PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 113 | విజయవాడ, సోమవారం 25 నవంబర్ 2024 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Monday 25 November 2024 | Rs

కాప్-29 సదస్సు

కుదిరిన రాజీ

- మాట నెగ్గించుకున్న సంపన్న దేశాలు
- 30 వేల కోట్ల డాలర్ల ప్యాకేజీతో సరి
- భారత్ అభ్యంతరం

5

కింగ్, ప్రిన్స్ శతకాల మోత

- యశస్వి 161, కోహ్లి 100
- పెర్త్ టెస్టులో గెలుపు ముంగిట భారత్

6

18 గంటల్లోనే..!

సెకి ఒప్పందంపై అంతా హడావుడి
ఫైల్‌కు మాజీ మంత్రి బాలినేని ఆమోదం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సెకి)-అదానీ- రాష్ట్ర డిస్కంల మధ్య జరిగిన త్రైపాక్షిక ఒప్పందం అనుమతులపై గత రాష్ట్రప్రభుత్వం కేవలం 18 గంటల్లోనే అనుమతి తీసుకుంది. అధికారికంగా చేయాల్సిన తంతు అంతా కూడా పూర్తిచేసిన రాష్ట్రమంత్రివర్గంలో ఆమోదించుకుంది. అయితే ఈ ఒప్పందంపై తాను సంతకం చేయలేదని అప్పటి విద్యుత్ శాఖ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి చెప్పినట్లు వార్తలు నిజం కాదని అప్పటి విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు అంటున్నారు. మంత్రివర్గ సమావేశానికి ముందే బాలినేని సెకి ఫైల్‌పై సంతకం చేశారని, ఆ తరువాతే మంత్రిమండలిలో ఆమోదం పొందిందని అంటున్నారు. సెకి ఒప్పందాలపై బాలినేని సంతకం చేశాకే మంత్రివర్గంలో చర్చించారని వైసిపి నేత చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఒంగోలులో ఆదివారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు.

అసలు ఏం జరిగిందంటే

సెకి ప్రాజెక్టుపై పై నుంచి కింద వరకు అంతా గప్‌చుప్‌గా సాగిందని ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఈ ప్రాజెక్టుకు కావాల్సిన అనుమతులు మొత్తం కేవలం 18 గంటల్లోనే పూర్తయ్యాయి. రాష్ట్రంలో 10 గిగావాట్ల సోలార్ ప్రాజెక్టులను ఏర్పాటు చేసి రైతులకు 30ఏళ్ల పాటు ఉచిత విద్యుత్‌సరఫరా చేయాలని 2020 ఫిబ్రవరి 15న, జూన్ 15వ తేదిన అప్పటి ప్రభుత్వం విడివిడిగా ఉత్తర్వులు తీసుకొచ్చింది. ఈ మెగా సోలార్ పవర్ ప్రాజెక్టును తొలుత రాష్ట్రప్రభుత్వం ఆధ్వర్యంలోనే ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుంది. అయితే 2021 సెప్టెంబర్ 12వ తేదిన అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని గౌతమ్ అదానీ తాడేపల్లికి వచ్చి రహస్యంగా కలిసి వెళ్లారు. దీంతో రాష్ట్రప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు కావాల్సిన మెగా సోలార్ పవర్ ప్రాజెక్టుకు బ్రేకులు పడ్డాయి. అదానీ రాకతో సెకి నుంచి కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. వ్యవసాయానికి కావాల్సిన సోలార్ విద్యుత్‌ను తాము అందిస్తామని వైఎస్ జగన్‌ను అదానీ కలిసిన మూడు రోజుల్లోనే అంటే సెప్టెంబర్ 15వ తేదిన సెకీ నుంచి రాష్ట్రప్రభుత్వానికి ప్రతిపాదనలు అందాయి. ఇందుకు తగ్గట్టుగా అన్ని అనుమతులను రాష్ట్రమంత్రివర్గంలో ఆమోదించుకునేందుకు అప్పటి ప్రభుత్వం హడావుడిగా ఈ తంతును పూర్తిచేసింది. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ప్రతిపాదనలను సెప్టెంబర్ 16వ తేది జరిగే క్యాబినెట్‌కు సమర్పించాలని అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఇంధన శాఖను ఆదేశించినట్లు తెలిసింది. సిఎస్ పంపిన అదే రోజు సాయంత్రం 3 గంటల సమయంలో ఇంధన శాఖ ఈ ఫైల్‌ను గ్రీన్ ఎనర్జీ కార్పొరేషన్ లిమిటెడ్(జిఈసిఎల్)కు పంపింది. జిఈసిఎల్ సాయంత్రం 5 గంటల ప్రాంతంలో తన ఆమోదాన్ని తెలిపి ఇంధనశాఖకు తిరిగి పంపింది. అక్కడి నుంచి ఆ ఫైల్ ఆర్థిక శాఖకు వెళ్లింది. అదే రోజు అర్ధరాత్రి 12 గంటల సమయంలో తన సమ్మతిని ఆర్థిక శాఖ తెలిపింది ఆ ఫైల్‌ను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఇంధన శాఖ సెప్టెంబర్ 16వ తేది ఉదయం 7 గంటల సమయంలో పంపింది. 45 నిమిషాల్లో ఫైల్‌ను ఆమోదించిన సిఎస్ అప్పటి విద్యుత్ శాఖమంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డికి సమర్పించారు. అదేరోజు ఉదయం 8 గంటలకు మిగతా 2లో

బలపడిన అల్పపీడనం

- నేడు వాయుగుండంగా మారే అవకాశం
- 27, 28 తేదీల్లో రాష్ట్రంలో భారీ వర్షాలు
- ఎపి విపత్తుల నిర్వహణ సంస్థ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

హిందూ మహాసముద్రంలో కేంద్రీకృతమైన అల్పపీడనం బలపడింది. ఇది పశ్చిమ వాయువ్య దిశగా కదిలి ఈ నెల 25న దక్షిణ బంగాళాఖాతం మధ్య భాగాలపై వాయుగుండంగా మారే అవకాశం ఉంది. ఈ విషయాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎమ్‌డి రోణంకి కూర్మనాథ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మరో రెండు రోజుల్లో వాయువ్య దిశగా తమిళనాడు- శ్రీలంక తీరాల వైపు వెళ్లే అవకాశం ఉందన్నారు. వాయుగుండం ప్రభావంతో ఈ నెల 27 నుంచి 30 వరకు కోస్తాంధ్రలో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. వర్షాల నేపథ్యంలో వరి కోతలు, ఇతర వ్యవసాయ పనుల్లో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రైతుల పంట పొలాల్లో నిలిచిన అదనపు నీటిని బయటకు పోయేలా ఏర్పాట్లు చేసుకోవాలని తెలిపారు. పండించిన ధాన్యాన్ని సురక్షిత ప్రదేశాల్లో ఉంచాలని, ఉద్యానవన పంట మొక్కలు / చెట్లు పడిపోకుండా నిలబడేందుకు కర్రలతో సపోర్టు అందించాలని సూచించారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు.

యుపిలో కాల్పులు

పోలీస్ తూటాలకు ముగ్గురు ముస్లిం యువకులు బలి
మసీదు సర్వే హింసాత్మకం.. నిరసనలపై ఉక్కుపాదం

లక్నో : ఉత్తర ప్రదేశ్‌లోని సంభాల్ జిల్లాలోని షాహి జామా మసీదులో సర్వే హింసాత్మకంగా మారింది. సర్వేను తీవ్రంగా వ్యతిరేకిస్తూ స్థానికులు పెద్ద ఎత్తున గుమిగూడారు. నిరసనకారులపై పోలీసులు ప్లాస్టిక్ బుల్లెట్లు ప్రయోగించడంతో ముగ్గురు ముస్లిం యువకులు ప్రాణాలు కోల్పోయారు. మొరాదాబాద్ డివిజనల్ కమిషనర్ అనన్య కుమార్ మాట్లాడుతూ, కాల్పుల్లో చనిపోయినవారిని నయీమ్, బిలాల్, నిమన్‌లుగా గుర్తించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పోలీసులకు కూడా కొందరికి గాయాలయ్యాయని చెప్పారు. ఈ ఘటనకు సంబంధించి ముగ్గురు మహిళలతో సహా 15 మందిని అదుపులోకి తీసుకున్నామన్నారు.. జమా మసీదు హరిహర ఆలయమని, ఆ ఆలయాన్ని కూల్చేసి మసీదు నిర్మించారని రిషి రాజ్ గిరి అనే వ్యక్తి పిటిషన్ వేయడం, జిల్లా కోర్టు వెంటనే దీనిపై సర్వేకు అడ్వకేట్ కమిషన్ నియమించి, వారం రోజుల్లోగా నివేదిక ఇవ్వాలని ఆదేశించడం చకచకా జరిగిపోయాయి. అంతే స్పీడుతో అడ్వకేట్ కమిషన్ కూడా మసీదులో సర్వే చేపట్టడం ఉద్రిక్తతలకు దారి తీసింది. ఆదివారం ఉదయం సర్వేకు వచ్చిన వారిని స్థానిక ముస్లిం యువకులు అభ్యంతరం తెలపడంతో పోలీసులు వెంటనే రంగ ప్రవేశం చేసి నిరసనకారులపై నిర్బంధాన్ని ప్రయోగించారు. దీంతో ఘర్షణలు చెలరేగాయి. మసీదులోకి అధికారులు రాకుండా అడ్డుకున్నారంటూ ముస్లిం యువకులపై పోలీసులు ప్లాస్టిక్ బులెట్లు ప్రయోగించారు. ఈ హింసాత్మక ఘటనలకు సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.

జిల్లా కోర్టు ఇచ్చిన ఆదేశంపై పై కోర్టులో అప్పీలు చేసుకునే అవకాశం కూడా లేకుండా సర్వేకు చర్యలు చేపట్టడంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది.కొందరు దుండగులు పోలీసుల పైకి రాళు విసిరారనీ, దీంతో పరిస్థితిని అదుపులోకి తీసుకురావటానికి పోలీసులు కొంత వరకు బల ప్రయోగం చేశారని జిల్లా ఎస్‌పి కృష్ణ కుమార్ విష్ణోయ్ తెలిపారు. రాళ్లు విసిరినవారినీ, ప్రేరేపించినవారిని గుర్తించామనీ.. వారిపై చర్యలుంటాయని చెప్పారు. అక్కడ పరిస్థితి అదుపులోనే ఉన్నదని సంభాల్ ఘటనపై యుపి డిజిపి ప్రశాంత్ కుమార్, జిల్లా మేజిస్ట్రేటు రాజేంద్ర పేసియా చెప్పారు. సర్వే నివేదికను ఈనెల 29న న్యాయస్థానానికి అందించనున్నట్లు సమాచారం.

ఆందోళనకారులపై కాల్పులు జరుపుతున్న పోలీసులు

ఎన్నికల్లో అవకతవకల నుంచి దృష్టి మరల్చేందుకే బిజెపి హింస : అఖిలేష్‌యాదవ్ విమర్శ

తాజా ఘటనపై ఉత్తర ప్రదేశ్‌లోని ప్రధాన ప్రతిపక్షం సమాజ్‌వాదీ పార్టీ (ఎస్‌పి) చీఫ్ అఖిలేశ్ యాదవ్ స్పందించారు. ఎన్నికల్లో అవకతవకల ఆరోపణల నుంచి దృష్టి మళ్లించేందుకే బిజెపి ఈ హింసను ప్రేరేపించిందని ఆయన విమర్శించారు. ఎన్నికల గురించి చర్చ జరగకుండా అంతరాయాన్ని కలిగించేందుకు ఉద్దేశపూర్వకంగానే సర్వే టీమ్‌ను ఆదివారం ఉదయం అక్కడికి పంపించారని పేర్కొన్నారు. ఈ మేరకు సంభాల్ ఘటనకు సంబంధించిన ఒక వీడియోను ఆయన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. బిజెపి ఈ ఆరోపణలను తోసిపుచ్చింది.

వక్ఫ్ బిల్లు ప్రజాస్వామానికి ముప్పు

- టిడిపి, వైసిపి ఎంపీలు వ్యతిరేకించాలి
- 'వక్ఫ్ బచావో' సభలో వక్తలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం తీసుకొస్తున్న వక్ఫ్‌సవరణ బిల్లు ప్రజాస్వామానికి ముప్పు అని పలువురు వక్తలు అన్నారు. ఈ బిల్లుకు వ్యతిరేకంగా ఆందోళనలు నిర్వహించాలని కోరారు. వక్ఫ్ చట్ట సవరణ బిల్లుకు వ్యతిరేకంగా 'లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక' అధ్యక్షతన ముస్లిం సంఘాలు, జమాత్‌ల మద్దతుతో 'వక్ఫ్ బచావో నిరసన సభ' విజయవాడలోని ఎంబి విజ్ఞాన కేంద్రంలో ఆదివారం జరిగింది. పరిరక్షణ వేదిక చైర్మన్ జల్లివిల్సన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో సిపిఎం రాష్ట్రకార్యదర్శి వి శ్రీనివాసరావు మాట్లాడుతూ హిందూ-ముస్లింల ఐక్యత దేశానికి జీవనాడి అని అన్నారు. ఈ ఐక్యతతోనే బ్రిటీష్ వాళ్లను ఎదుర్కొని దేశం నుంచి వెళ్లగొట్టారని చెప్పారు. ఈ ఐక్యతకు చిచ్చుపెట్టి బ్రిటీష్ నినాదమైన 'విభజించు.. పాలించు' దుర్మార్గ నీతిని బిజెపి అనుసరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిజెపి ముస్లింలకే కాదని హిందూవుల్లో ఉన్న 80 శాతం అణగారిన కులాలకు కూడా వ్యతిరేకమని తెలిపారు. కుల, మత ఘర్షణలు, ద్వేషాలను పెంచేందుకు ప్రయత్నిస్తోందని, ఇందులో భాగమే వక్ఫ్ చట్ట సవరణ అని చెప్పారు. ఈ చట్ట సవరణలను సిపిఎం తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. ఈ బిల్లుపై ఏర్పాటు చేసిన జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జెపిసి) ఈ అంశంపై నిరంకుశంగా వ్యవహరిస్తూ భిన్నభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవడం లేదన్నారు. పార్లమెంటు సంప్రదాయాలకు విరుద్ధమైన ఈ పద్ధతిని వ్యతిరేకించాలని కోరారు. ఈ పద్ధతిని ఆమోదిస్తే భవిష్యత్తులో దేశంలో ప్రజాస్వామ్యం ఉండదన్నారు. రాష్ట్రంలో ఉన్న పార్టీలు ఢిల్లీలో ఒక మాట, రాష్ట్రంలో మరోమాట ఈ బిల్లుపై మాట్లాడుతున్నాయని అన్నారు. లోక్‌సభలో టిడిపిపై, రాజ్యసభలో వైసిపిపై బిజెపి ఆధారపడి ఉందని, ఈ రెండు పార్టీలు వ్యతిరేకిస్తే బిల్లు ఎలా ఆమోదం పొందుతుందని ప్రశ్నించారు. ప్రజాతంత్రవాదులు, లౌకికవాదులు టిడిపి, వైసిపి ఎంపిలపై ఒత్తిడి తెచ్చి దీనిని వ్యతిరేకించేవిధంగా చూడాలని కోరారు. మతోన్మాదం ఏ రూపంలో ఎక్కడా ఉన్నా ఖండించాల్సిందేనని చెప్పారు. బంగ్లాదేశ్‌లో హిందూవులపై దాడులు జరుగుతున్నాయని చెబుతున్న ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మణిపూర్‌లో జరుగుతున్న దాడుల గురించి మాట్లాడటం లేదన్నారు. భారతదేశంపై పవన్‌కళ్యాణ్‌కు భక్తి ఉందా లేదా అని నిలదీశారు. బంగ్లాదేశ్‌లో జరుగుతున్న దాడులను అక్కడి కమ్యూనిస్టులు వ్యతిరేకిస్తూ మిగతా 2లో

విజయవాడలోని ఎంబివికెలో జరిగిన నిరసన సభలో మాట్లాడుతున్న వి శ్రీనివాసరావు

తిరుపతిలో బాలికపై అత్యాచారం

ప్రజాశక్తి- తిరుపతి సిటీ

చాక్లెట్లు కొనిస్తానని చెప్పి ఏడేళ్ల బాలికపై ఓ యువకుడు అత్యాచారానికి పాల్పడిన ఘటన తిరుపతిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పోలీసులు తెలిపిన కథనం మేరకు... తిరుపతి ఎంఆర్ పల్లికి చెందిన బాలాజీ ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. పది రోజులు క్రితం పక్కింటి బాలికను ఇంట్లో ఎవరూ లేని సమయంలో చాక్లెట్లు కొనిస్తానని మాయమాటలు చెప్పి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ విషయాన్ని ఎవరికీ చెప్పొద్దని బాలికను బెదిరించాడు. అప్పటి నుంచి బాలిక కొంత నలతగా ఉండేది. శనివారం బాలికకు తీవ్ర కడుపునొప్పి రావడంతో తల్లిదండ్రులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు అనుమానం వచ్చి బాలికను ప్రశ్నించడంతో యువకుడు తన పైన చేసిన అఘాయిత్యాన్ని వివరించింది. బాలిక తల్లిదండ్రులు ఎస్‌వి క్యాంపస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలికను వైద్యపరీక్షల నిమిత్తం పోలీసులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. నిందితుడు బాలాజీని అదుపులోకి తీసుకొని పొక్సో చట్టం కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

సత్వరమే వెలుగొండ

- బివి రాఘవులు డిమాండ్
- ముఖ్యమంత్రికి లేఖ
- నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రభుత్వానికి వెనుక బడిన, కరువు ప్రాంతాల అభివృద్ధి పట్ల చిత్త శుద్ధి ఉంటే సత్వరమే పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టును పూర్తి చేయాలని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఆదివారం ఒక లేఖ రాశారు. 2025 జులై నాటికి (వరదల సమయానికి) రిజర్వాయర్‌లో నీరు నింపేందుకు అవసరమైన పనులను పూర్తిచేయడానికి ప్రణాళిక రూపొందించి నిధులను కేటాయించాలని కోరారు. పనుల పర్యవేక్షణకు నిపుణుల బృందాన్ని నియమించాలన్నారు. నిర్వాసితులకు చెల్లింపులు వెంటనే పూర్తి చేయాలని, మొదటి సొరంగం మిగిలిన పనులను పూర్తిచేసి హెడ్‌వర్క్సుకు అప్రోచ్ ఛానల్ అనుసంధాన పనులను యుద్ధ ప్రాతిపదికన ఆరు నెలల్లో పూర్తి చేయాలని కోరారు. అప్రోచ్ ఛానల్‌కు మరమ్మతులు చేసి వరద సీజన్ నాటికి సిద్ధం చేయాలని, రెండవ సొరంగ పనులను, పంట కాల్వలను రెండవ దశలోని మిగిలిన పనులను నిర్ణీత సమయంలో పూర్తిచేయాలని సూచించారు. ఈ ఏడాది అక్టోబర్ 29న ముగ్గురు మంత్రులు ప్రాజెక్టును సందర్శించి మరో రెండేళ్ళలో ప్రాజెక్టును పూర్తి చేస్తామని చేసిన ప్రకటనను చూసి తాను ఈ నెల 12న ప్రాజెక్టు పరిశీలనకు వెళ్లినట్లు తెలిపారు. అక్కడ 06.03.24 తేదీతో "జంట సొరంగాలు జాతికి అంకితం" అని వేసిన శిలాఫలకాన్ని చూసి తాను ఆశ్చర్యపోయినట్లు లేఖలో పేర్కొన్నారు. ప్రాజెక్టు పూర్తికాక ముందే అసెంబ్లీ ఎన్నికల్లో లబ్ది పొందేందుకు వైసిపి ప్రభుత్వం ప్రజలను మభ్యపెట్టేందుకు ఆ శిలాఫలకాన్ని వేసినట్లు ఉందన్నారు. అదే కోవలోకి ఇప్పుడు మంత్రుల ప్రకటన రాకూడదని కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు. 'వెలుగొండ ప్రాజెక్టును 1996లో మీరే (చంద్రబాబు) శంకుస్థాపన చేశారు. ఇప్పటికే 28 సంవత్సరాలైంది. ఈ సమయంలో టిడిపి, కాంగ్రెస్, వైఎస్ఆర్ పార్టీ ప్రభుత్వాలు పరిపాలించాయి. ఇందులో 14 సంవత్సరాలు టిడిపి పాలనలో ఉన్నా ప్రాజెక్టుకు ముక్తి లభించలేదు. దీనినిబట్టి పాలక వర్గాలు వెనుకబడిన, వర్షాభావ షాడోజోన్ మిగతా 2లో



అదాని అంశంపై జెపిసి

- కేంద్రం వైఖరిపై ప్రధాని ప్రకటన చేయాలి
- అఖిలపక్ష సమావేశంలో ప్రతిపక్షాల డిమాండ్
- నేటి నుంచి పార్లమెంట్ శీతాకాల సమావేశాలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

అదానీ అవినీతిపై చర్చించాల్సిందేనని, జాయింట్ పార్లమెంటరీ కమిటీ వేయాల్సిందేనని పార్లమెంటులో పట్టుబట్టాలని ప్రతిపక్షాలు సంకల్పించుకోవడంతో సోమవారం నుండి జరిగే శీతాకాల సమావేశాలు వాడిగా, వేడిగా జరిగే అవకాశముంది. అదానీ వ్యవహారానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వ వైఖరిపై ప్రధాని ప్రకటన చేయాలని ప్రతిపక్షాలు ఇప్పటికే డిమాండ్ చేశాయి. పార్లమెంటు సమావేశాలు ప్రారంభం కావడానికి ముందు పార్లమెంట్ అనెక్స్ భవనంలో కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం ఆదివారం నిర్వహించారు. అదానీ గ్రూప్ అక్రమాలకు సంబంధించిన ఆరోపణలు, అమెరికాలో కేసు, మణిపూర్‌లో ఇటీవల మళ్లీ చోటుచేసుకున్న అల్లర్లు, ఉత్తరప్రదేశ్ ఉప ఎన్నికల్లో అవకతవకలు, వక్ఫ్ బిల్లుపై చర్చించేందుకు వీలుగా పార్లమెంటరీ బిజినెస్‌లో దీనిని చేర్చాలని కాంగ్రెస్‌తోపాటు ప్రతిపక్షాలు పట్టుపట్టాయి. ఢిల్లీ సహా పలు ప్రాంతాల్లో కాలుష్యం, రైలు ప్రమాదాలు వంటి అంశాలపైనా చర్చించాలని డిమాండ్ చేసినట్లు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత ప్రమోద్ తివారీ మీడియాకు తెలిపారు. ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన అంశాలపై చర్చ జరపాలని స్పష్టం చేశామన్నారు. అన్ని అంశాలపై చర్చకు కేంద్రం సిద్ధంగా ఉందని, శీతాకాల సమావేశాలు సజావుగా సాగేందుకు ప్రతిపక్షాలు సహకరించాలని రాజ్‌నాథ్‌సింగ్ కోరారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ఈ నెల 25 నుంచి డిసెంబర్ 20 వరకు జరగనున్నాయి. నవంబర్ 26న 75వ రాజ్యాంగ దినోత్సవ సందర్భంగా 'సంవిధాన్ సదన్' పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో నిర్వహించనున్నట్లు కేంద్రం వెల్లడించింది. మరోవైపు వక్ఫ్ సవరణ బిల్లుపై ఏర్పాటైన జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జెపిసి) ఈ నెల 29న తన నివేదికను పార్లమెంట్‌కు సమర్పించే అవకాశం ఉంది. వక్ఫ్ బిల్లుతో సహా మొత్తం 16 బిల్లులను ఆమోదించుకునేందుకు జాబితా చేసింది.

'ఉక్కు'పై ప్రధాని స్పందించాల్సిందే...

గాజువాకలో ప్రజలు, కార్మికుల భారీ ప్రదర్శన, బహిరంగ సభ

ప్రజాశక్తి- గాజువాక (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకుంటున్నట్లు విశాఖ నగరానికి రాకముందే ప్రధాని మోడీ ప్రకటించాలని డిమాండ్ చేస్తూ గాజువాకలో విశాఖ ప్రజలు, కార్మికులు ఆదివారం భారీ ప్రదర్శన నిర్వహించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. పాత గాజువాక నుంచి కొత్త గాజువాక, తిరిగి కొత్త గాజువాక నుంచి పాత గాజువాక కూడలి వరకూ నిర్వహించిన భారీ ప్రదర్శనకు స్థానికులు పూలుజల్లి ఎక్కడికక్కడ ఘనస్వాగతం పలికారు. స్టీల్‌ప్లాంట్‌ను రక్షించాలన్న నినాదాలతో గాజువాక పరిసరాలు మార్మోగాయి. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ, విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాలు, మహిళా, రైతు సంఘాల ఆధ్వర్యంలో తలపెట్టిన ప్రదర్శనకు, అనంతరం జరిగిన బహిరంగ సభకు పెద్ద సంఖ్యలో ప్రజలు, కార్మికులు హాజరయ్యారు.

మోడీపై రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు ఒత్తిడి తేవాలి : సిహెచ్ నర్సింగరావు

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఉపసంహరించుకొనేలా ప్రధాన మంత్రి మోడీపై రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు ఒత్తిడి తేవాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు కోరారు. ప్రదర్శన అనంతరం పాత గాజువాక కూడలిలో బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న మహోన్నత ఉద్యమాన్ని పరిగణలోకి తీసుకొని ప్రధాని తన పర్యటనలో సానుకూల నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్లాంట్ పరిరక్షణకు కార్మికులు చేస్తోన్న పోరాటాన్ని కొనియాడారు. కేంద్ర ప్రభుత్వ అండతో దేశాన్ని కార్పొరేట్ శక్తులు కబళించాలని చూస్తున్నాయని, దీనికి వ్యతిరేకంగా ఐక్య పోరాటాలను మరింత ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. దేశ ప్రతిష్టను దెబ్బతీసిన అదానీపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిం చాలని డిమాండ్ చేశారు. గంగవరం పోర్టును అదానీ ఎలా లాక్కున్నారో అందరికీ తెలుసన్నారు. ఆ పోర్టు నుంచి 42 రోజుల పాటు స్టీల్‌ప్లాంట్‌కు మిగతా 2లో

ర్యాలీలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న ప్రజలు, కార్మికులు

కౌన్ బనేగా మహా సీఎం

- ఫడ్నవీస్, షిండే, అజిత్ పవార్‌ల మధ్య కుర్చీలాట

28న హేమంత్ సోరెన్ ప్రమాణ స్వీకారం

- కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు గవర్నర్ ఆహ్వానం

5

ఈతకెళ్లి ఇద్దరు బాలురు మృతి

ప్రజాశక్తి-గన్నవరం (కృష్ణా జిల్లా)
ఈత సరదా ... ఇద్దరు బాలుర ప్రాణాలను బలి తీసుకుంది. ఈ సంఘటన కృష్ణా జిల్లా బాపులపాడు మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం ఎ.సీతారాంపురం గ్రామానికి చెందిన కోలా యశ్వంత్ కష్ణ (10), రెడ్డి అజయ్ (9) ఇద్దరూ స్నేహితులు. యశ్వంత్ ఐదో తరగతి, రెడ్డి అజయ్ నాలుగో తరగతి చదువుతున్నారు. ఆదివారం పాఠశాలకు సెలవు కావడంతో సరదాగా ఈత కొడదామని ఏలూరు కాలువ వద్దకు వెళ్లారు. కాలువలో దిగగా లోతు ఎక్కువగా ఉండడంతో మునిగిపోయారు. ఇది గమనించిన స్థానికులు కాలువలో వారిని ఒడ్డుకు తీసుకోచ్చారు. అప్పటికే వారిద్దరూ ప్రాణాలు కోల్పోయారు. వీరవల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సినీ నటుడు అలీకి మళ్లీ నోటీసులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
అక్రమ నిర్మాణాల విషయంలో సినీ నటుడు అలీకి పంచాయతీ కార్యదర్శి ఆదివారం నోటీసులు జారీ చేశారు. అక్రమ నిర్మాణాలపై వివరణ ఇవ్వాలని నోటీసులో పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శి తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా నవాబుపేట మండలం ఎక్మామిడి గ్రామంలోని నటుడు అలీ ఫామ్‌హౌజ్‌లో నిర్మాణాలు చేపట్టారు. వీటికి పంచాయతీ నుంచి అనుమతి లేదని, ఈ నెల 5న అలీకి పంచాయతీ కార్యదర్శి శోభారాణి నోటీసులు జారీ చేశారు. నిర్మాణాలకు సంబంధించి ధ్రువీకరణ పత్రాలు ఉంటే పంచాయతీలో అందజేయాలని కోరారు. దీనిపై అలీ నుంచి ఎలాంటి స్పందనా రాలేదు. దీంతో మళ్లీ ఆదివారం పంచాయతీ కార్యదర్శి మరోసారి నోటీసు ఇచ్చారు. అక్రమ నిర్మాణాలు వెంటనే నిలిపివేయాలని నోటీసులో పేర్కొన్నారు. మూడ్రోజుల్లో వివరణ ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శి స్పష్టం చేశారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

18 గంటల్లోనే..!

(మొదటి పేజీ తరువాయి)
ఆమోదం తెలిపిన బాలినేని అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు సమర్పించారు. ఈ ఫైల్‌ను ఆ రోజు జరిగే మంత్రివర్గ సమావేశం ముందు ఉంచాలని సిఎం ఆదేశాలు చేశారు. ఈ ఒప్పంద వివరాలు, అందరి అభిప్రాయాలను మంత్రివర్గంలో చర్చించాక ఈ ఫైల్‌ను మంత్రివర్గ సమావేశం ఆమోదం తెలిపింది. రైతులకు పగటి పూట 9గంటల ఉచిత విద్యుత్ అందించేందుకు రాష్ట్రప్రభుత్వం ఏర్పాటు చేయనున్న 10వేల మెగావాట్ల సోలార్ పవర్ ప్రాజెక్టు నుంచి ప్రభుత్వం తప్పుకుంటున్నట్లు అప్పటి మంత్రివర్గ నిర్ణయాలను సమాచార శాఖమంత్రిగా ఉన్న పేర్ని వెంకటరామయ్య మీడియాకు వెల్లడించారు. సెకి నుంచి 7వేల మెగావాట్ల విద్యుత్‌ను యూనిట్‌కు రూ.2.29లకే కొనుగోలు చేయగానికి మంత్రిమండలి ఆమోదం తెలిపిందని, ఈ మేరకు సెకికి ప్రభుత్వం నుంచి లేఖ పంపుతామన్నారు.

విశాఖ రైల్వే జోన్‌కు టెండర్లు

- వైర్‌లెస్ కాలనీలో పదహారున్నర ఎకరాల్లో నిర్మాణం
- టెండర్ల దాఖలుకు ఆఖరు తేదీ డిసెంబర్ 27
- 11 అంతస్తుల భవన నిర్మాణానికి కేంద్రం గ్రీన్ సిగ్నల్

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో
ఎట్టకేలకు విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యాలయ భవనాల నిర్మాణానికి కేంద్ర రైల్వే శాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందుకు సంబంధించి టెంటర్లను ఆహ్వానించింది. డిసెంబర్ 27లోపు టెండర్లను దాఖలు చేయాలని పేర్కొంది. ఈ నెల 29న ఉమ్మడి విశాఖ జిల్లాలో ఎన్‌టిపిసి గ్రీన్ ఎనర్జీ ప్లాంట్ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొనేందుకు విచ్చేస్తున్న దేశ ప్రధాని నరేంద్ర మోడీ... జోన్ కార్యాలయానికి పునాది రాయి వేయనున్నారని కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రకటించారు. గతంలో ఆరిలోవ ప్రాంతంలోని ముడసర్లోవ చెంత రైల్వే శాఖకు చెందిన 53 ఎకరాల్లో దక్షిణ కోస్తా రైల్వేజోన్ భవనాన్ని నిర్మాణం చేయాలని ప్రతిపాదనలు పంపినా వైర్‌లెస్ కాలనీలోని స్థలాన్నే కేంద్రం ఆమోదించినట్లు సమాచారం.

జోన్ కార్యాలయ నమూనా

వైర్‌లెస్ కాలనీ 16 ఎకరాల్లోనే నూతన భవనం

రైల్వే స్టేషన్‌కు ఎదురుగాగల డాబాగార్డెన్స్ వద్ద ఉన్న వైర్‌లెస్ కాలనీలోని పదహారున్నర ఎకరాల రైల్వే స్థలంలోనే 11 అంతస్తుల భారీ భవన నిర్మాణానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. గతంలోనే ఇక్కడ పాడుబడిన రైల్వే క్వార్టర్లను తొలగించి రైల్వే శాఖ చదును చేసి సిద్ధం చేసింది. తొమ్మిది అంతస్తులు, రెండు సెల్లార్ పార్కింగ్ ఫ్లోర్లతో కలిపి మొత్తంగా 11 అంతస్తుల్లో దక్షిణ కోస్తా రైల్వే జోనల్ మేనేజర్ కార్యాలయ నిర్మాణం చేయనున్నారు. డిసెంబర్ 27లోపు టెండర్లు దాఖలవుతాయని రైల్వే అధికారులు చెబుతున్నారు. జోన్ కార్యాలయానికి రూ.149.16 కోట్లు అంచనా వ్యయం అవుతుందని కేంద్రానికి రైల్వే గతంలోనే డిపిఆర్ పంపింది. టెండర్లు ఖరారయ్యాక భవన నిర్మాణం రెండేళ్లలో పూర్తయ్యేలా చూడాలని రైల్వే శాఖను మంత్రి అశ్విని వైష్ణవ్ ఆదేశించినట్లు తెలుస్తోంది. దక్షిణ కోస్తా రైల్వే జోనల్ కార్యాలయ ఎలక్ట్రికల్ పనులకు సుమారు రూ.15.7 కోట్ల అంచనా వ్యయాన్ని రెండు రోజుల క్రితం కేంద్రం ఆమోదించినట్లు సమాచారం. జోనల్ కార్యాలయ ప్రతిపాదిత నమూనాను భువనేశ్వర్ కేంద్ర రైల్వే అధికారులు తయారు చేశారు. సైట్ సర్వే ప్లాన్, మాస్టర్ ప్లాన్, ఏరియల్ వ్యూ, ఫ్రంటెండ్ వ్యూ, స్ట్రీట్ వ్యూ, ఎంట్రన్స్ వ్యూ ఇలా అన్ని వైపుల నుంచీ డిజైన్‌ను తయారు చేసి వాల్తేరు రైల్వే అధికారులకు పంపినట్లు తెలుస్తోంది.

విద్యార్థుల జీవితాలతో కూటమి చెలగాటం

- మాజీ ముఖ్యమంత్రి జగన్ విమర్శ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
విద్యార్థుల జీవితాలతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం చెలగాటమాడుతోందని వైసిపి అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి విమర్శించారు. ఈ మేరకు ఆదివారం ఆయన సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. మూడు త్రైమాసికాలుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులను పిల్లల చదువులకు చెల్లించకపోవడంతో చదువులు మానుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. ప్రకాశం జిల్లా జె పంగులూరులో ఫీజు రీయింబర్స్‌మెంట్ రాకపోవడంతో పనులకు వెళ్తున్న విద్యార్థి కథనం తనకు ఆవేదన కలిగించిందని పేర్కొన్నారు. చంద్రబాబు పాలనలో అన్ని రంగాల్లోనూ తిరోగమనమే కనిపిస్తోందన్నారు. ముఖ్యంగా విద్యారంగాన్ని దారుణంగా దెబ్బతీశారని పేరొన్నారు. అమ్మ ఒడి, ఇంగ్లీషు మీడియం, 3వ తరగతి నుంచి టోఫెల్, సబ్జెక్టు టీచర్లు, సిబిఎస్ఇ నుంచి ఐబి దాకా ప్రయాణం, 8వ తరగతి పిల్లలకు ట్యాబ్‌లు, బైజూస్ కంటెంట్, నాడు-నేడు ఇలా అన్నింటినీ రద్దు చేశారని ఆయన తప్పుబట్టారు. వసతి దీవెన, విద్యా దీవెన నిలిపివేసి, డిగ్రీ, ఇంజనీరింగ్, వైద్య విద్య అభ్యసిస్తున్న వారిని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వైసిపి హయాంలో ప్రతి త్రైమాసికం పూర్తి కాగానే తల్లుల ఖాతాలో జమ చేసే వాళ్లమని, ఇలా గత విద్యా సంవత్సరం డిసెంబరు త్రైమాసికం వరకు రూ.12,609 కోట్లు ఒక్క విద్యా దీవెనకే ఖర్చు చేశామని ఆయన తెలిపారు. ఎన్నికల కోడ్ కారణంగా జనవరి- మార్చి త్రైమాసికానికి , ఏప్రిల్‌లో వెరిఫికేషన్ చేసి మే నెలలో ఇవ్వాల్సిన ఫీజు డబ్బులు ఇవ్వనీయకుండా ఇదే కూటమి పార్టీలు ఇసికి ఫిర్యాదు చేశాయని జగన్ గుర్తు చేశారు. ఎన్నికలు అయిపోయిన తర్వాత జూన్‌లోనైనా ఇచ్చారా అంటే అదీ లేదన్నారు. ఏప్రిల్‌లో ఇవ్వాల్సిన వసతి దీవెన పరిస్థితి కూడా అంతేనన్నారు. ఏప్రిల్-జూన్, జులై- సెప్టెంబరు త్రైమాసికానికి సంబంధించి ఫీజులు చెల్లింపులో ఎలాంటి అడుగు ముందుకు పడలేదన్నారు. అక్టోబరు- డిసెంబరు త్రైమాసికం కూడా సగం గడిచిపోయిందని, మొత్తం కలుపుకుంటే రూ.2,800 కోట్లకు పైగా ఫీజులు రీయింబర్స్ చేయాల్సివుందన్నారు. మరో రూ.1,100 కోట్లు లాడ్జింగ్, బోర్డింగ్ ఖర్చుల కింద వసతి దీవెన బకాయిలు కూడా ఉన్నాయని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోక వచ్చాక ఇసుక స్కామ్, పేకాట క్లబ్బులు, మాఫియా సామ్రాజ్యాలు, ప్రైవేటీకరణ ముసుగులో స్కాములు చేస్తూ మెడికల్ కాలేజీలు, ప్రభుత్వ పోర్టులను దోచిపెట్టే స్కామ్‌లకు పాల్పడుతున్నారే తప్ప పిల్లల మీద శ్రద్ద లేకుండా పోయిందన్నారు. ప్రభుత్వం వెంటనే తల్లికి వందనం, ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో సహా వసతి దీవెన నిధులు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

సెకి ఒప్పందాలపై బాలినేని సంతకం

- వైసిపి నేత చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి వెల్లడి

ప్రజాశక్తి- ఒంగోలు కలెక్టరేట్
విద్యుత్తు కొనుగోలుకు సంబంధించి సెకి ఒప్పందాలపై మంత్రిగా అప్పట్లో బాలినేని శ్రీనివాసరెడ్డి సంతకం చేసి ఇప్పుడు దీనికి విరుద్ధంగా మాట్లాడడం తగదని వైసిపి ఒంగోలు పార్లమెంట్ పరిశీలకులు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అన్నారు. ఒంగోలులోని వైసిపి జిల్లా కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'మీరు మంత్రిగా ఉన్నప్పుడు సెకి నుంచి వచ్చిన లేఖపైనా, ఒప్పందాలపై రెండుసార్లు సంతకాలు పెట్టిన విషయం మర్చిపోరా?' అని ప్రశ్నించారు. అర్ధరాత్రి సంతకం పెట్టామన్నారని, సంతకం పెట్టలేదని ఇప్పుడు చెప్పడం ఎవరి మెప్పుకోసమని ప్రశ్నించారు. వైసిపి అధినేత జగన్‌మోహన్‌రెడ్డిపై ఆధారాలు లేని ఆరోపణలు, విమర్శలు చేయడం సరికాదన్నారు. ఏ కుటుంబం అయితే రాజకీయంగా ఈ స్థితికి తీసుకొచ్చిందో వారిపైనే విమర్శలు ,చేయడం బాలినేనికి తగదని పేర్కొన్నారు. జగన్‌మోహన్‌రెడ్డిపై అభాండాలు వేసి వ్యక్తిత్వ హననం చేసి లబ్ధి పొందాలనుకుంటే మీకే రివర్స్ అవుతుందన్నారు. విద్యుత్ యూనిట్ ధర 4.50 రూపాయలతో చంద్రబాబు సిఎంగా ఉన్నప్పుడు ఒప్పందం చేసుకుంటే, జగన్ సిఎం అయిన తర్వాత యూనిట్ ధర 2.48 రూపాయలకే ఒప్పందం చేసుకున్నారని పేర్కొన్నారు. బాలినేని మరీ ఇంతలా దిగజారిపోయి మాటమారుస్తారని ఊహించలేదన్నారు.

ఇది కేంద్రం నిర్వాకం....

- అదానీ ముడుపులపై దర్యాప్తు చేపట్టాలి
- కేంద్ర ఆర్థిక మంత్రికి ఇఎఎస్ శర్మ

ప్రజాశక్తి- విశాఖపట్నం : సెకి నుంచి విద్యుత్తు ఒప్పందాలు చేసుకునేందుకు వివిధ ప్రభుత్వ పెద్దలకు గౌతమ్ అదానీ భారీగా ముడుపులు చెల్లించడంపై దర్యాప్తు జరిపించాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరుతూ భారత ప్రభుత్వ మాజీ కార్యదర్శి ఇఎఎస్ శర్మ లేఖ రాశారు. అదానీపై అమెరికా కోర్టు కేసు నమోదు చేయడం సెబీతో సహా ఇతర కేంద్ర ప్రభుత్వ సంస్థల వైఫల్యాన్ని సూచిస్తోందని విమర్శించారు. ఈ వివాదంపై న్యాయవ్యవస్థ పర్యవేక్షణలో సిబిఐ, ఇడి, డిఆర్ఐ, సిబిడిటి వంటి సంస్థలతో సమగ్ర విచారణ నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. 'అమెరికా డిస్ట్రిక్ట్ కోర్టు, ఎస్ఇసి రెండూ కూడా అమెరికాలో న్యాయవ్యవస్థకు చెందినవి కావడంతో మీరు, మీతో మంత్రులు ఎప్పటిలానే ఈ అభియోగాలు, నేరారోపణలను పక్కన పెట్టలేరు. అమెరికా, భారత్‌లో ఎఫ్‌బిఐ నిష్పక్షపాతంతో దర్యాప్తు చేపట్టాలి. అదానీపై అభియోగాలను తిరస్కరించడం, రక్షించడంతో మీ శాఖ దేశీయ మదుపరులు, ప్రజల ప్రయోజనాలను దెబ్బతీయడమే కాకుండా మీ శాఖ వివరించలేని అచేతన స్థితికి పడిపోయింది. అదానీ అంశం కేంద్ర, రాష్ట్ర సంస్థల విచ్ఛిన్నంపై తీవ్రమైన ఆందోళనలను లేవనెత్తుతోంది. ఇది దేశ ప్రజలను మోసగించడం, మిలియన్ల మంది విద్యుత్ వినియోగదారుల ప్రయోజనాలను దెబ్బతీయడమే' అని లేఖలో శర్మ పేర్కొన్నారు. అదానీ గ్రూప్, విదేశీ ఆధారిత అజూర్ వంటి కార్పొరేట్ల సౌర విద్యుత్ ప్లాంట్ల నుండి విద్యుత్‌ను సేకరించడంతో విద్యుత్ మంత్రిత్వ శాఖ (ఎంఒపి) ఉద్దేశపూర్వకంగా సౌరరంగంలో అవినీతికి ఆస్కారం కల్పించిందని శర్మ విమర్శించారు.

2003 విద్యుత్ చట్టంలోని సెక్షన్ 11 నిబంధన ప్రకారం సౌర విద్యుత్ కేంద్రాల నుంచి రాష్ట్రాలు తమ మొత్తం విద్యుతవసరాల్లో 10 శాతాన్ని కొనుగోలు చేయాలని కేంద్రం ఆదేశించిందని, రాష్ట్రాలు తమ ఆర్థిక స్థితి, యూనిట్ ధర వంటి అంశాలతో సంబంధం లేకుండా ఈ కొనుగోలు బాధ్యతను నిర్దేశించిందని శర్మ తన లేఖలో గుర్తు చేశారు. ఈ నిబంధనతోనే గత దశాబ్ద కాలంలో కార్పొరేట్ సోలార్ ప్లాంట్ల ఏర్పాటులో రాజకీయ అవినీతి ఎలా జరిగిందో స్పష్టమవుతోందని అన్నారు. ఈ నిబంధన ఏకైక లక్ష్యం దేశీయ వినియోగదారుల నుంచి కార్పొరేట్లకు ఆదాయం అందించడమేనని అన్నారు. ఈ నిబంధనతోపాటు పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖ (ఎంఎన్ఆర్ఇ) అదానీ గ్రీన్, అజూర్‌తో సహా కొన్ని కార్పొరేట్ సంస్థలకు పిఎల్ఐ, విజిఎఫ్ వంటి సందేహాస్పద పథకాలను ప్రారంభించడం ద్వారా విచక్షణారహితంగా సబ్సిడీలు/సబ్వెన్షన్లను మంజూరు చేసింది. విద్యుత్ వినియోగదారులు భరించగలిగే ధరలకే ఆ సంస్థలు విద్యుత్ సరఫరా చేయాలి. కానీ, అదానీ గ్రూప్‌కు రూ.863 కోట్ల పిఎల్ఐ సబ్సిడీ, అజూర్‌కు రూ.186 కోట్ల విజిఎఫ్ చెల్లించారు. అవన్నీ పన్ను చెల్లింపుదారుల నిధులు, ప్లారమెంట్ ఆమోదించిన బడ్జెట్ నుంచి అన్నది స్పష్టమే! అలాగే కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సెకి) అనేది కార్పొరేట్ సంస్థల నుంచి ఖరీదైన విద్యుత్‌ను కొనుగోలు చేసి, దానిని బలవంతంగా రాష్ట్ర విద్యుత్ వినియోగాలకు విక్రయించడానికి ఒక అవాంఛనీయ బ్రోకర్‌గా మారింది. అదేవిధంగా ఖరీదైన విద్యుత్‌ను విక్రయించినందుకు ఆ కార్పొరేట్ సంస్థల నుంచి లంచాలు తీసుకుంటుందని లేఖలో శర్మ విమర్శించారు. ఇంత జరుగుతున్నా వినియోగదారుల ప్రయోజనాలకు రక్షణగా ఉండాల్సిన సిఇఆర్‌సి, ఎస్ఇఆర్‌సిలు మౌన ప్రేక్షకులుగా ఉండటం విచారకరమని తెలిపారు. అలాగే ఆర్థిక శాఖ ద్వారా పర్యవేక్షించబడే సెబి కూడా తన స్వంత బాధ్యతలను ఉల్లంగిచినట్లు తెలుస్తోంది. దీనికి కారణం సెబీ ఛైర్‌పర్సన్‌కు అదానీ గ్రూపునకు మధ్య సంబంధాలు ఉన్నాయనే వార్తలేనని అని శర్మ లేఖలో పేర్కొన్నారు. అదానీ గ్రూపునకు వ్యతిరేకంగా సెబీ విచారణ చేసినట్లు సమాచారం ఉందని, అయితే ఆ నివేదికలు ఇంకా వెలుగుచూడలేదని లేఖలో శర్మ గుర్తు చేశారు. అలాగే దేశంలో విద్యుత్ వినియోగదారులు అనేక విధాలుగా నష్టపోతున్నారనడానికి అనేక ఉదాహరణలు ఉన్నాయని, కొన్ని నెలల క్రితం దేశంలో కేంద్ర బొగ్గు, రైల్వే మంత్రిత్వ శాఖలు కృత్రిమంగా బొగ్గు కొరతను సృష్టించాయని, తరువాత విదేశాల నుంచి బొగ్గును కొనుగోలు చేయాలని రాష్ట్రాలను కేంద్రం ఆదేశించిందని తెలిపారు. విదేశీ బొగ్గు గనుల యాజమాన్యం అదే అదానీ గ్రూపుదేనని తెలిసే కేంద్రం ఈ ఆదేశాలు ఇచ్చిందని, దీని ద్వారా విద్యుత్ వినియోగదారులపై అధిక ధరల భారం పడిందని అన్నారు.

కేంద్రంలోని ప్రస్తుత ప్రభుత్వం ప్రజాప్రయోజనాలను పరిరక్షించకుండా, అత్యుత్సాహంతో గౌతమ్ అదానీని రక్షిస్తున్నట్లు కనిపిస్తోంది. అదానీ సంస్థను భారతదేశ సార్వభౌమాధికార చిహ్నంగా చూపుతున్నారు. దానికి జాతీయత రంగు కూడా ఇస్తున్నారు. మనదేశ సార్వభౌమాధికారంపై దాడితో సమానంగా పేర్కొంటున్నారు. దీనిద్వారా ఉద్దేశపూర్వకంగా వాస్తవాలను మరుగుపరుస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. సమగ్ర ఆడిట్ నిర్వహించడం కోసం ఈ లేఖను కాగ్‌కు కూడా పంపుతున్నాను' అని ఈ లేఖలో ఇఎఎస్ శర్మ పేర్కొన్నారు.

రైతు, ప్రజావ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలి

- 26న దేశవ్యాప్త ఆందోళనను జయప్రదం కోరుతూ బైక్ ర్యాలీలు



పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండలో బైకు ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-యంత్రాంగం
కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల విధానాలను వ్యతిరేకిస్తూ ఈ నెల 26న రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్ల వద్ద చేపట్టే కార్మిక, కర్షక ప్రదర్శన, ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ ఆల్ ట్రేడ్ యూనియన్స్, సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యాన ఆదివారం పలు జిల్లాల్లో బైక్ ర్యాలీలు నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తోన్న రైతు, ప్రజావ్యతిరేక విధానాలను అన్ని వర్గాల ప్రజలూ ప్రతిఘటించాలని ఆయా సంఘాల నాయకులు కోరారు.

రైతుల పంటలకు గిట్టుబాటు ధర చట్టం చేయాలని, ఏ రంగంలో పనిచేసే కార్మికుడికైనా కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, పరిశ్రమలలో కార్మికుల జీవితాలకు భద్రత కల్పించేలా సేఫ్టీ సౌకర్యాలు కల్పించాలని, కార్మిక చట్టాల స్థానే తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, కౌలు రైతులకు భూయజమానితో సంబంధం లేకుండా గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. శ్రీకాకుళం నగరంలో బైక్ ర్యాలీని ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.మోహనరావు జెండా ఊపి ప్రారంభించారు. నగరంలోని అంబేద్కర్ కూడలి వద్ద నుంచి ప్రారంభమైన ర్యాలీ ఆర్‌టిసి కాంపెక్స్ వరకు సాగింది. రణస్థలం మండల కేంద్రంలో రామతీర్థాలు కూడలి నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండలో బైక్ ర్యాలీ చేశారు. విజయనగరం జిల్లా చేపట్టిన బైక్ ర్యాలీలో కార్మిక, రైతు సంఘాలు నాయకులు మాట్లాడుతూ.. వ్యవసాయ నల్ల చట్టాలను వెనక్కు తీసుకుంటామని, రైతులు పండించిన పంటకు కనీసం మద్దతు ధర చట్టాన్ని తీసుకొస్తామని రైతు ఉద్యమం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ ఇచ్చిన హామీలను గాలికి వదిలేశారన్నారు. అనేక పోరాటాల ద్వారా సాధించుకున్న 44 కార్మిక చట్టాలను మార్చేసి నాలుగు లేబర్ కోడ్లను తీసుకొచ్చి కార్మిక హక్కులను కాలరాస్తున్నారని తెలిపారు. కడపలో బైక్ ర్యాలీ నిర్వహించారు. పంట రుణాలు ఇవ్వాలని, నష్టపరిహారం చెల్లించాలని, ఉపాధి హామీ కార్మికులకు 200 రోజుల పని దినాలను కల్పించి రోజు వేతనం రూ.600 చెల్లించాలని కోరారు. విశాఖ ఉక్కు, రైల్వే, ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణ ఆపాలని డిమాండ్ చేశారు. సభను జయప్రదం చేయాలని కోరుతూ కృష్ణా జిల్లా బంటుమిల్లి, కోడూరులో ప్రజాసంఘాల నాయకులు కరపత్రాలు పంపిణీ చేశారు.

వక్ఫ్ బిల్లు ప్రజాస్వామానికి ముప్పు

(మొదటి పేజీ తరువాయి)
ప్రతిఘటిస్తున్నారని వివరించారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ మాట్లాడుతూ అత్యంత ప్రమాదకరమైన సవరణలు బిల్లులో ఉన్నాయని అన్నారు. మత విభజన తీసుకొచ్చేందుకు ఈ బిల్లు తీసుకొచ్చారని తెలిపారు. టిటిడిలో హిందూయేతరలు ఉండకూడదని ఒకవైపు చెబుతూ మరోవైపు వక్ఫ్‌బోర్డులో హిందువులు ఉండాలని పేర్కొనడం సరికాదన్నారు. ఈ బిల్లు పార్లమెంటులో వీగిపోయేందుకు ఎపి, బీహార్ ముఖ్యమంత్రులు ముందుకు రావాలని కోరారు. మాజీ ఎంపి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ వక్ఫ్‌బోర్డు ఉమ్మడి జాబితాలో ఉన్నందున రాష్ట్రాల అభిప్రాయాలు కూడా తీసుకోవాల్సి ఉందన్నారు. చేగువేరాను ఆదర్శంగా భావించినట్లు చెప్పిన నాయకుడు సనాతన ధర్మం గురించి మాట్లాడం విడ్డూరంగా ఉందని పవన్ కళ్యాణ్‌ను విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు మస్తాన్ వలీ మాట్లాడుతూ వక్ఫ్ ఆస్తులను కొల్లగొట్టేందుకు మోడీ ప్రభుత్వం సవరణలు తీసుకొస్తుందని విమర్శించారు. ముస్లిం సమాజాన్ని భయభ్రాంతులకు గురిచేసేందుకు సిఎఎ, ఎన్‌ఆర్‌సి, వక్ఫ్ సవరణలు వంటి చట్టాలు తీసుకొస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో మనువాదాన్ని తిరిగి తీసుకొచ్చేందుకు కుట్ర చేస్తున్నారని విమర్శించారు. జల్లి విల్సన్ మాట్లాడుతూ విహెచ్‌పి, ఆర్‌ఎస్‌ఎస్ కనుసన్నల్లో ప్రధాని నరేంద్రమోడీ పరిపాలన చేస్తున్నారని విమర్శించారు. ఆవాజ్ రాష్ట్ర అధ్యక్షులు చిష్టి, జమాతే ఇస్లామి హింద్ రాష్ట్ర అధ్యక్షులు రఫీక్ అహ్మద్, అహెహదీజ్ జమాత్ అధ్యక్షులు ఫజ్లుర్ రహమాన్ ఉమ్రి, సున్నతుల్ జమాత్ అధ్యక్షులు ముక్తియార్, మజ్లిసుల్ ఉలేమా అధ్యక్షులు ముఫ్తి యానప్, ముస్లిం ఐక్యవేదిక అధ్యక్షులు జాఫర్ పులి, లౌకిక పరిరక్షణ వేదిక విజయవాడ అర్బన్ కన్వీనర్ అబ్దుల్ మతీన్, ముస్లిం జెసి కన్వీనర్ షేక్ మునీర్ అహ్మద్, ప్రముఖ న్యాయవాది సలీమ్, సామాజిక, రాజ్యాంగ అధ్యయన కేంద్రం నిర్వాహకులు ఆరిఫ్ మహ్మద్ తదితరులు ప్రసంగించారు.

బకాయిలు పెట్టి నీతులు చెబుతారా?

- జగన్‌ను ప్రశ్నించిన మంత్రి లోకేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
విద్యార్థులకు రూ.6500 కోట్లు బకాయిలు పెట్టి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నీతులు చెప్పడం విచిత్రంగా ఉందని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విమర్శించారు. ఆదివారం సామాజిక మాధ్యమంలో జగన్ చేసిన పోస్టుకు లోకేష్ స్పందించారు. అధికారంలో ఉన్నప్పుడు బాధ్యతారాహిత్యంగా ఉండి ప్రతిపక్షంలోకి రాగానే విలువలు వల్లించడం జగన్‌కే చెల్లిందన్నారు. విద్యా దీవెన, వసతి దీవెన పేరుతో రూ.3500 కోట్లు బకాయిలు పెట్టి మోసం చేసిన కారణంగానే సర్టిఫికెట్లు రాక లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. అనాలోచిత, అవినీతి విధానాల కారణంగా గత ఐదేళ్లల్లో ప్రభుత్వ పాఠశాలల్లో 4 లక్షల మంది విద్యార్థులు తగ్గిన విషయం వాస్తవం కాదా? అని ఆయన ప్రశ్నించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులను సిద్ధం చెయ్యకుండానే సిబిఎస్ఇ పరీక్ష విధానం తీసుకొచ్చారని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల బోధనా సామర్థ్యం పెంచకుండా టోఫెల్, ఐబి శిక్షణ ఇచ్చేవారు లేకపోయినా అమలు చేశామని ప్రచారం చేసుకున్నారని తెలిపారు. గత ఐదేళ్లల్లో భ్రష్టుపట్టిన విద్యారంగాన్ని గాడిన పెట్టడం తమ బాధ్యత అని తెలిపారు.

నకిలీ రుణ యాప్‌లకు బలౌతున్న సామాన్యులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
రాష్ట్రంలో నకిలీ లోన్ యాప్‌లకు బలైపోతున్నవారి సంఖ్య పెరిగిపోతోంది. బ్యాంకుల్లో రుణాలు పొందడంలో ఇబ్బందులు పడలేక..సులభంగా మంజూరు అవుతున్నాయనే భ్రమలో అనేక మంది సామాన్యులు ఈ లోన్ యాప్‌ల బారిన పడి ప్రాణాలు మీదకు తెచ్చుకుంటున్నారు. ఇందుకు సంబంధించిన మోసాలపై 2019 నుంచి 2024 అక్టోబరు వరకు 199 కేసులు నమోదవ్వడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. అయితే నకిలీ యాప్‌ల వల్ల మోసపోయిన వారి సంఖ్య ఇంకా ఎక్కువ ఉంటుందని, కానీ అవగాహన లేకపోవడం వల్ల ఫిర్యాదు కూడా చేయలేని స్థితిలో ఉన్నారని సంబంధిత నిపుణులు పేర్కొంటున్నారు. వడ్డీల మీద వడ్డీలు బాదడం కాకుండా..బెదిరింపులు, కుటుంబ సభ్యుల వ్యక్తిగత జీవితాలపై సామాజిక మాధ్యమాల్లో అభ్యంతరక పోస్టులతో వేధింపులు, భౌతిక దాడులతో ఈ యాప్ కంపెనీల రికవరీ ఏజెంట్లు రెచ్చిపోతున్నారు. 2019-2023 మధ్యకాలంలో ఈ రుణాల యాప్‌లకు వివిధ రూపాల్లో 201 మంది బాధితులుండగా..ఆరుగురు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఏడాది అక్టోబర్ వరకు 11 మంది బాధితులుండగా..ఇద్దరు బలవన్మరణానికి పాల్పడ్డారు. ఇలాంటి దారుణాలకు సంబంధించి 2019 నుంచి 2024 అక్టోబరు వరకు 199 కేసులను పోలీస్‌లు నమోదు చేశారు.

146 మందిపై చర్యలు తీసుకున్నారు. రాష్ట్రంలో దాదాపు 456 నకిలీ యాప్‌లు ప్రజలను మోసగిస్తున్నాయని గుర్తించి, వాటిలో ఇప్పటి వరకు 229 యాప్‌లను బ్లాక్ చేయించినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. మనీ రికవరీ ఏజెంట్ల నుంచి ఇన్‌కమింగ్ కాల్స్‌ను నిలిపివేసేందుకు 1138 మొబైల్ నెంబర్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. దీంతో పాటు సైబర్ నేరాలకు పాల్పడివారిపై ఫిర్యాదుల కోసం జాతీయ స్థాయిలో 1930 నంబరు అందుబాటులో ఉందని తెలిపారు. ఇప్పటికైనా ప్రజలు నకిలీ రుణ యాప్‌లతో అప్రమత్తంగా ఉండాలని, రిజర్వుబ్యాంకు నియంత్రణలోని పనిచేస్తున్న సంస్థల నుంచే రుణాలు తీసుకోవాలని అధికారులు సూచించారు.

బహిరంగ సభలో మాట్లాడుతున్న సిహెచ్.నర్సింగరావు

'ఉక్కు'పై ప్రధాని స్పందించాల్సిందే...

(మొదటి పేజీ తరువాయి)
బొగ్గు రాక స్తంభించించిన విషయాన్ని గుర్తు చేశారు.

'ఉక్కు' ఉద్యమానికి ప్రతి ఒక్కరి మద్దతు
విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

రాష్ట్రాభివృద్ధితోపాటు ఈ ప్రాంత అభివృద్ధిని ఆకాంక్షించే ప్రతి ఒక్కరి మద్దతూ ఉక్కు ఉద్యమానికి ఉందని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్లు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్ తెలిపారు. బహిరంగ సభలో వీరు మాట్లాడుతూ కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను విరమించుకోకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. పోరాట కమిటీ నాయకులు జె.అయోధ్యరామ్, కెఎస్ఎన్.రావు, నీరుకొండ రామచంద్రరావు, యు.రామస్వామి, జె.రామకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ సభలో డిసిఎంఎస్ మాజీ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి, ప్రజా సంఘాల నాయకులు మణి, రెడ్డి వెంకటరావు, కుమార మంగళం, కెఎం.శ్రీనివాసరావు, రాంబాబు, ఎన్.రామారావు, రైతు సంఘం నాయకులు ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

సత్వరమే వెలుగొండ

(మొదటి పేజీ తరువాయి)
ప్రాంతాన్ని ఎంత నిర్లక్ష్యం చేశాయో అర్థమవుతోంది' అని బివి రాఘవులు తన లేఖలో పేర్కొన్నారు.

ప్రాజెక్టు పూర్తి కావాలంటే
రూ.3,595 వేలకోట్లు నిధులు అవసరం:

వెలుగొండ ప్రాజెక్టుకు ఇప్పటి వరకు రూ.6,062.88కోట్లు ఖర్చయ్యాయని, పూర్తి చేయడానికి ఇంకా రూ.3,595 కోట్లు నిధులు కావాలని ప్రభుత్వ లెక్కలే చెబుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రారంభ అంచనా ప్రకారం ప్రాజెక్టుకు రూ.980 కోట్లు కాగా, ప్రభుత్వ నిర్లక్ష్యాలు కాలయాపన మూలంగా తక్కువ ఖర్చుతో పూర్తి కావాల్సిన ప్రాజెక్టు వ్యయం భారీగా పెరిగిపోయిందన్నారు. మంత్రులు చెప్పినట్లు రెండేళ్లలో ప్రాజెక్టు పూర్తి కావాలంటే రూ.3 వేలు కోట్లు నిధులు అవసరమవుతాయన్నారు. ఈ ఏడాది బడ్జెట్‌లో కనీసం రూ.1500 కోట్లు కేటాయించి ఉంటే మంత్రుల మాటలపై ప్రజలకు నమ్మకం కలిగేదన్నారు. ఇందుకు భిన్నంగా బడ్జెట్‌లో కేవలం రూ.394 కోట్లు మాత్రమే కేటాయించారని, ఇదే విధంగా ప్రతి సంవత్సరం కేటాయింపులు చేస్తే ప్రాజెక్టు పూర్తవ్వడానికి 8 సంవత్సరాలు పడుతుందని రాఘవులు పేర్కొన్నారు. ప్రాజెక్టు పనుల పరిస్థితిని చూస్తే మంత్రుల మాటలు వట్టి మాయ మాటలని భావించాల్సివస్తోందన్నారు. మొదటి సొరంగం దాదాపు పూర్తయ్యిందని, ఇంకా 30 మీటర్లు మాత్రమే లైనింగ్ పూర్తి కావాల్సి ఉందన్నారు. ఆ కొద్ది మేర లైనింగ్‌ను ఎందుకు వదిలేశారో? తనకు అర్థం కావడం లేదన్నారు. రెండవ సొరంగంలో 11 కిలోమీటర్ల మేర పనులు పూర్తయ్యాయన్నారు. అయితే మరో 7.9 కిమీ కైవారానికిగాను 7 మీటర్ల మేర మట్టి తొలగించలేదన్నారు. ఇంకో రెండు మీటర్ల పనులు జరగాల్సివుందన్నారు. రెండవ సొరంగం తవ్వకంలో వచ్చిన మట్టిని బయటకు తేకుండా హెడ్‌వర్క్స్ ప్రాంతంలో డంప్ చేశారని, అదే విధంగా మొదటి సొరంగంలోకి 5 చోట్ల రంధ్రాలు పెట్టి దానిలో మట్టిపోశారని పేర్కొన్నారు. ఇటువంటి అస్తవ్యస్త పనులతో ప్రాజెక్టు నిర్మాణం ఆలస్యం కావడమే కాకుండా ఖర్చు పెరిగిపోతుందని తెలిపారు. ఈ ప్రాజెక్టులో భాగమైన 53 టిఎంసిల సామర్థ్యం కలిగిన రిజర్వాయరు 2018లోనే పూర్తయి.. 8 సంవత్సరాలుగా నిరుపయోగంగా ఉందన్నారు. సొరంగాల నుంచి రిజర్వాయర్‌లోకి వెళ్లే అప్రోచ్ ఛానల్ 2019లో పూర్తయ్యిందన్నారు.

నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలి

వెలుగొండ రిజర్వాయర్ నిర్మాణంతో 11 గ్రామాల ప్రజలు నిర్వాసితులయ్యారని, నేటికీ వారికి పూర్తిస్థాయిలో నష్టపరిహారం అందలేదని బివి రాఘవులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ గణాంకాల ప్రకారం నిర్వాసితులకు రూ.1,002 కోట్లు చెల్లించాల్సివుందన్నారు. నిర్వాసితుల కుటుంబాలకు తొలుత న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వపై ఉందన్నారు. ప్రాజెక్టు పనుల్లో అన్నిటికన్నా ముందు పూర్తి కావాల్సిన హెడ్‌వర్క్స్ పనులు ఇంకా పూర్తి కాలేదని హెడ్‌వర్క్స్ నుంచి సొరంగాలను కలుపుతూ చేయాల్సిన పనులు కూడా పూర్తి కాలేదని ఆయన తెలిపారు. 22 కిలోమీటర్లు ఛానల్‌కు మరమ్మతులు ఎప్పుడు చేస్తారు? కల్వర్టులు ఎప్పుడు నిర్మిస్తారు? లైనింగ్ ఎప్పుడు వేస్తారనేది అస్పష్టంగా ఉందన్నారు. ఈ సమస్యలన్నీ పరిష్కరించి నిర్ధిష్ట గడువులోగా ప్రాజెక్టును పూర్తి చేయాలని ముఖ్యమంత్రిని కోరారు.

లారీ ఢీకొని ఇద్దరు మృతి

- నలుగురికి గాయాలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్ (ఏలూరు జిల్లా)

లారీ ఢీకొని రెండు కుటుంబాలకు చెందిన ఇద్దరు వ్యక్తులు మృతి చెందగా, నలుగురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన ఏలూరు జిల్లా నూజివీడు మండలం తుక్కులూరు గ్రామంలో శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... గొల్లపల్లి గ్రామానికి చెందిన ఊటుకూరి చిట్టిబాబు, శ్రీలక్ష్మి దంపతులు, అదే గ్రామానికి చెందిన కటారి కృష్ణ, లక్ష్మి దంపతులు వారి పిల్లలతో కలిసి రెండు బైక్‌లపై శనివారం సాయంత్రం మండలంలోని పోతురెడ్డిపల్లిలో వారి బంధువుల ఇంట్లో అయ్యప్పస్వామి భజన కార్యక్రమానికి వెళ్లారు. భజన ముగిసిన అనంతరం రాత్రి వారి బైక్‌లపై గొల్లపల్లికి తిరుగు ప్రయాణం అయ్యారు. తుక్కులూరు వద్దకు వచ్చేసరికి హనుమాన్ జంక్షన్ నుంచి చీమలపాడు వెళ్తున్న లారీ వీరి బైక్‌లను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో చిట్టిబాబు భార్య శ్రీలక్ష్మి (31), కటారి కృష్ణ (38) అక్కడికక్కడే మృతి చెందారు. చిట్టిబాబు, ఆయన కుమార్తె హర్షిణి, కృష్ణ భార్య లక్ష్మి, వారి కుమార్తె పల్లవికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు విజయవాడలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

సెల్‌టవర్ ఎక్కి యువకుడు హల్‌చల్

ప్రజాశక్తి-బొబ్బిలి

సెల్ టవర్ పైకి ఎక్కిన అజయ్

విజయనగరం జిల్లా బొబ్బిలి పట్టణ పరిధిలో సెల్‌టవర్ ఎక్కి ఆత్మహత్య చేసుకుంటానని ఓ యువకుడు ఆదివారం హల్‌చల్ చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బొబ్బిలి పట్టణంలోని గొల్లపల్లి ప్రాంతానికి చెందిన అజయ్ అదే గ్రామానికి చెందిన యువతిని ప్రేమిస్తున్నాని వెంటపడేవాడు. ఈ విషయం తెలిసి యువతి తల్లిదండ్రులు పోలీసుస్టేషన్లో అజయ్‌పై ఫిర్యాదు చేశారు. దీంతో అజయ్‌ను పోలీసులు స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. మనస్తాపానికి గురైన అజయ్ గొల్లపల్లి సమీపంలోని దాడితల్లి కాలనీలో ఉన్న సెల్‌టవర్ ఎక్కాడు. ప్రేమించిన యువతితో పెళ్లి చేయకపోతే పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించాడు. పోలీసులు, స్థానికులు కలుగజేసుకుని ఆ యువతిని టవర్ వద్దకు రప్పించి పెళ్లి చేసుకుంటానని ఆమెతో చెప్పించడంతో కిందికి దిగాడు. అనంతరం అజయ్‌ను రూరల్ సిఐ నారాయణరావు అదుపులోకి తీసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించి కౌన్సిలింగ్ ఇచ్చారు.

పిజి వైద్య విద్యార్థి ఆత్మహత్య

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

మత్తు ఇంజక్షన్ చేసుకుని వైద్య విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఏలూరు జిల్లాలోని ఆశ్రం మెడికల్ కాలేజీలో చోటుచేసుకుంది. ఏలూరు వన్‌టౌన్ సిఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం... పల్నాడు జిల్లా సరసారావుపేటకు చెందిన డాక్టర్ వరగాని జవహర్ (30) ఏలూరు ఆశ్రం మెడికల్ కాలేజీలో పోస్టు గ్రాడ్యుయేషన్ వైద్య విద్యను అభ్యసిస్తున్నారు. ఆదివారం తెల్లవారుజామున ఆశ్రం ఆస్పత్రి అత్యవసర విభాగంలో విధులకు హాజరయ్యారు. ఉదయం 7 గంటల సమయంలో ఆయన వాష్‌రూమ్‌లోకి వెళ్లి తలుపు గడియ పెట్టుకున్నారు. ఎంతసేపైనా బయటకు రాకపోవడంతో డ్యూటీ డాక్టర్లు ఆస్పత్రి సిఇఒ డాక్టర్ హనుమంతరావు, ఇతర అధికారులకు సమాచారం ఇచ్చారు. అధికారుల సూచన మేరకు తలుపులను పగులగొట్టి చూడగా జవహర్ మరణించి ఉన్నారు. అక్కడ మత్తు ఇంజక్షన్లు చేసుకున్నట్లుగా చిరంజీలు, వాడేసిన ఇంజక్షన్ బాటిళ్లు లభించాయి. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. ఏలూరు రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. అయితే, ఆత్మహత్యకు కారణాలు మాత్రం తెలియరాలేదు.

విశాఖ డెయిరీ మెడలు వంచుదాం

డెయిరీ కార్మికుల దీక్షల్లో సిహెచ్.నర్సింగరావు

విశాఖ డెయిరీ కార్మికుల దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న సిహెచ్.నర్సింగరావు

ప్రజాశక్తి - గాజువాక (విశాఖపట్నం)

విశాఖ డెయిరీ యాజమాన్యం మెడలు వంచి కార్మికుల హక్కులు సాధించుకుందామని విశాఖ కో-ఆపరేటివ్ డెయిరీ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు సిహెచ్.నర్సింగరావు అన్నారు. సమస్యలను పరిష్కరించాలంటూ డెయిరీ కార్మికులు డెయిరీ ఎదుట చేపట్టిన దీక్షలు ఆదివారానికి నాలుగో రోజుకు చేరాయి. వారి పోరాటానికి నర్సింగరావు మద్దతు ప్రకటించి మాట్లాడారు. పోరాటాలతోనే విశాఖలో ప్రభుత్వ రంగ సంస్థలను రక్షించుకోగలిగామని తెలిపారు. బిహెచ్‌పివి, స్టీల్‌ప్లాంట్, షిప్‌యార్డు అందుకు ఉదాహరణ అని పేర్కొన్నారు. విశాఖ డెయిరీలో 1979లో సిఐటియును ఏర్పాటు చేశామని, దానికి తాను అధ్యక్షునిగా ఉన్నానని గుర్తు చేసుకున్నారు. యూనియన్ పోరాటాలతో నాడు డెయిరీ కార్మికుల జీతాలు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల జీతాల్లా ఉండేవని, డెయిరీ కూడా లాభాల్లో నడిచిందని తెలిపారు. అప్పట్లోనే కార్మికులకు ట్రాన్స్‌పోర్టు అలవెన్స్ కూడా చెల్లించే విధంగా అగ్రిమెంట్ చేశామన్నారు. ప్రస్తుత యాజమాన్యం కార్మికులను మోసం చేస్తోందని తెలిపారు. 20 ఏళ్లుగా కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అగ్రిమెంట్ పేరుతో ఒక్కొక్క కార్మికునికీ ఒక్కోలా జీతం చెల్లిస్తున్నారని తెలిపారు. డెయిరీకి వచ్చిన లాభాలను సొసైటీ పేరుతో దారిమళ్లించి, యాజమాన్యంలో ఉన్నవారు సొంతానికి వాడుకుంటున్నారని విమర్శించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు కెఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చెబుతున్న దాని ప్రకారం రూ.26 వేల వేతనం చెల్లించాలన్నారు. కాలయాపన చేయకుండా కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. పబ్లిక్ సెక్టార్ కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ కుమార్ మంగళం, స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి మాట్లాడుతూ డెయిరీ కార్మికుల పోరాటానికి పూర్తి మద్దతునిస్తున్నామన్నారు. విశాఖ కో-ఆపరేటివ్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎస్.రమణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.రాజేంద్రప్రసాద్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎం.రాంబాబు, స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు లేబర్ యూనియన్ నాయకులు నమ్మి రమణ, శ్రామిక మహిళ సమన్వయ కమిటీ కన్వీనర్ పి.మణి పాల్గొన్నారు.

కన్నీటి సంద్రంలో ఎల్లుట్ల

- మృతుల కుటుంబాలను పరామర్శించిన నాయకులు

ప్రజాశక్తి - పుట్లూరు

మృతదేహాలను నివాళి అర్పిస్తున్న శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

అనంతపురం జిల్లా గార్లదిన్నె మండల పరిధిలోని ఎన్‌హెచ్-44 రహదారిపై శనివారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో పుట్లూరు మండలం ఎల్లుట్ల గ్రామానికి చెందిన ఎనిమిది మంది వ్యవసాయ కార్మికులు మృతిచెందిన విషయం విదితమే. రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన బాలపెద్దయ్య (50), డి నాగమ్మ (45), బి నాగమ్మ (50), డి రామాంజనమ్మ (42), చిన్న నాగన్న (52), కొండమ్మ (48), జయరాముడు (40), ఈశ్వరయ్య (55) మృతదేహాలను ఆదివారం స్వగ్రామానికి తీసుకువచ్చారు. మృతుల్లో ఐదుగురు ఒక కుటుంబానికి చెందిన వారు. మృతదేహాలను చూసిన గ్రామస్తులు కన్నీటి సంద్రమయ్యారు. మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు రోధనలు మిన్నంటాయి. వారిని ఓదార్చడం ఎవరి తరమూ కాలేదు. ఒకే కుటుంబంలోని ఐదుగురి మృతదేహాలను ఒకేసారి అంత్యక్రియలు నిర్వహించారు. మిగత ముగురి మృతదేహాలకు వేర్వేరుగా అంత్యక్రియలు చేశారు. ముందుగా మృతదేహాలకు పలువురు టిడిపి, వైసిపి, ఇతర పార్టీల నాయకులు నివాళులర్పించారు. మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందించారు. మృతిచెందిన వారి కుటుంబ సభ్యులను తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి పరామర్శించారు. మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియాతో పాటు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని లేకుంటే గ్రామస్తుల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు.

కలెక్టర్, మంత్రి పరామర్శ

ప్రమాదంలో గాయపడి అనంతపురం నగరంలోని కిమ్స్ సవేరా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్, వైద్య విద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదివారం పరామర్శించారు.

ప్రమాద ఘటనను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు ధైర్యం చెప్పారు. బాధితులను అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, టిడిపి జిల్లా అధ్యక్షులు వెంకట శివుడు యాదవ్, శింగనమల టూ మెన్ కమిటీ సభ్యులు పరామర్శించారు.

స్థానిక సంస్థల్లో రూ.24.53 కోట్ల దుర్వినియోగం

- కాగ్ వెల్లడి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

స్థానిక సంస్థల్లో నిధుల దుర్వినియోగంపై పర్యవేక్షణ కొరవడిందని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) ఆందోళన వ్యక్తం చేసింది. క్షేత్ర స్థాయిలో నిబంధనలకు విరుద్ధంగా నిధులను వినియోగం, దుర్వి నియోగం వంటి చర్యలకు ప్రభుత్వం అడ్డుకట్ట వేయలేకపోతోంది. 2022 మార్చి నాటికి పంచాయతీ రాజ్ సంస్థల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఇటువంటి కేసులు 1,980 నమోదయ్యాయని తెలిపింది. ఈ కేసుల్లో 24.53 కోట్లు దుర్వినియోగం అయినట్లు పేర్కొంది. ప్రజల నుంచి వసూలు చేసే వివిధ రకాల పన్నుల సొమ్మును ఖజానాకు జమ చేయాల్సివున్నా..అలా చేయకుండా ఆ నిధులను దుర్వినియోగం చేస్తున్న ఉదంతాలు కూడా వెలుగుచూసినట్లు కాగ్ పేర్కొంది. ఇలాంటి ఘటనలు గ్రామ పంచాయతీల్లో అధికంగా ఉన్నట్లు తెలిపింది. జిల్లా, మండల పరిషత్‌ల కంటే గ్రామ పంచాయతీల్లో నిధుల దుర్వినియోగం అత్యధికంగా ఉన్నట్లు కాగ్ నివేదించింది. రాష్ట్ర వ్యాప్తంగా 1,811 గ్రామ పంచాయతీల్లో 21.76 కోట్లు నిధులు దుర్వినియోగమయ్యాని పేర్కొంది. నిధుల దుర్వినియోగం అంశాన్ని సంబంధిత శాఖ కార్యదర్శులు ప్రతి ఆరు నెలలకు సమీక్షించి రికవరీకి తగిన ఆదేశాలు ఇవ్వాల్సి ఉంటుందని, అయితే ఆ దిశగా చర్యలు లేకపోవడంతో పర్యవేక్షణ కొరవడిందని కాగ్ తెలిపింది.

వైద్యుల రక్షణకు ప్రత్యేక చట్టం

- అమరావతిలో భూమి కేటాయించాలి
- ఐఎంఎ రాష్ట్ర సదస్సు తీర్మానం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి


ప్రసంగిస్తున్న డాక్టర్ సోమరాజు

వైరస్‌లపై వైద్యులకు పూర్తి స్థాయి అధ్యయనం, పరిశోధన పెరగాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర 66వ మహాసభ ఆదివారంతో ముగిసింది. గుంటూరులో మూడు రోజులపాటు జరిగిన ఈ సభలో పలు తీర్మానాలను ఆమోదించారు. ప్రధానంగా దేశంలో వైద్యుల రక్షణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని, రాష్ట్ర రాజధాని అమరావతిలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యాలయానికి స్థలం కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరుతూ మహాసభ తీర్మానం చేసింది. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జాతీయ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ ఆర్ వి అశోకన్, డాక్టర్ అనిల్ కుమార్ జె నాయక్, రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ నందకిషోర్‌తో పాటు వివిధ రంగాలకు చెందిన వైద్య నిపుణులు ప్రసంగిస్తూ.. వైద్యులు నిరంతరం విధులకే పరిమితం కాకుండా కొంత విశ్రాంతి, ఆరోగ్య, కుటుంబ జీవనంపై దృష్టి సారించాలని సూచించారు. ప్రముఖ హృద్రోగ నిపుణులు, పద్మశ్రీ డాక్టర్ సోమరాజు మాట్లాడుతూ దైనందిన జీవనంలో వైద్యులూ వ్యాధి గ్రస్తులుగా మారడం ఆందోళన కలిగించే అంశమని తెలిపారు. దేశంలో సగటు మనిషి ఆయుష్షు 65 సంవత్సరాలు కాగా.. వైద్యుల సగటు ఆయుష్షు 59 సంవత్సరాలుగా నమోదైందన్నారు. మారుతున్న జీవన శైలి కూడా ఇందుకు కారణమని పేర్కొన్నారు. వైద్యులు తరచూ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. పలువురు వైద్య రంగ నిపుణులు మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతోపాటు ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, ఆధునిక పద్ధతులు, పలు సర్జరీల్లో కీలక భూమిక పోషిస్తున్నాయని వివరించారు. రానున్న రోజుల్లో రోబోటిక్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌తో వైద్యరంగం కొత్త పుంతలు తొక్కనుందని పేర్కొన్నారు. యువ వైద్యులు వైద్య రంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పులపై ఎప్పటికప్పుడు దృష్టి సారించాలని సూచించారు. వైద్యులు డాక్టర్ పి.రమేష్, ఎన్.వి.సుందరాచారి, ఎస్ఎస్‌వి రమణ, డాక్టర్ నరేష్, కొంగర శ్రీకాంత్, బూసిరెడ్డి నరేందర్ రెడ్డి, సుబ్బారాయుడు, సేవాకుమార్ తదితరులు వివిధ అంశాలపై ప్రసంగించారు.

ఆర్‌టిసి బస్సులో యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి -ఏర్పేడు (తిరుపతి జిల్లా)

బస్సులో ఆత్మహత్య చేసుకన్న యువకుడు

ఆర్‌టిసి బస్సులో ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఈ సంఘటన తిరుపతి జిల్లాలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం తెల్లవారుజామున శ్రీకాళహస్తి నుంచి తిరుపతికి పల్లెవెలుగు బస్సు బయలుదేరింది. ఏర్పేడు మండలంలోని మేర్లపాక వద్ద 25 ఏళ్ల యువకుడు బస్సు ఎక్కారు. బస్సు చివరకు వెళ్లి తనతో పాటు తెచ్చుకున్న తాడును ఇనుప కమ్మికి కట్టి ఉరేసుకున్నారు. ఆ సమయంలో బస్సులో ముగ్గురు ప్రయాణికులు ఉన్నారు. బస్సు రేణిగుంట వద్దకు చేరుకున్నాక యువకుడు ఉరేసుకుని ఉండటాన్ని ప్రయాణికులు గుర్తించి కండక్టర్, డ్రైవర్‌కు సమాచారం ఇచ్చారు. వారు వెళ్లి చూడగా అప్పటికే యువకుడు మృతి చెందినట్లు గుర్తించి రేణిగుంట పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అయితే మృతి చెందిన యువకుడి వివరాలు తెలియాల్సి ఉంది.

అనస్తీయాలజిస్టుల జాతీయ సదస్సులో రాష్ట్రానికి ఏడు అవార్డులు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

ఇండియన్ సొసైటీ ఆఫ్ అనస్తీయాలజిస్ట్‌ల (ఐఎస్ఎ) 71వ జాతీయ సదస్సు ఆదివారం బీహార్ రాజధాని పాట్నాలో ముగిసింది. ఈ నెల 20న ప్రారంభమైన ఈ సదస్సు ఐదు రోజులపాటు జరిగింది. మూడు వేల మందికిపైగా అనస్తీషియా వైద్యులు పాల్గొన్న ఈ సదస్సులో అనస్తీషియాలో నూతన ఆవిష్కరణలపై చర్చ జరిగింది. సదస్సులో ఇండియన్ సొసైటీ ఆఫ్ అనస్తీయాలజిస్ట్స్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖకు జాతీయ స్థాయిలో ఏడు అవార్డులు వచ్చాయి. వివిధ విభాగాల్లో డాక్టర్ ఎం.వి.భీమేశ్వర్‌కు, డాక్టర్ పి.అనిల్ కుమార్‌కు, డాక్టర్ ప్రవీణ్ కుమార్‌కు అవార్డులు లభించాయి. విజేతలకు రాష్ట్ర అకడమిక్ చైర్మన్, రాష్ట్ర పూర్వ అధ్యక్షులు డాక్టర్ ఉప్పులేటి తారకప్రసాద్, పూర్వ కార్యదర్శి డాక్టర్ యర్రంశెట్టి అచ్యుత్, రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సూరిశెట్టి శ్రీనివాస్ తదితరులు అభినందించారు.

Chola
Enter a better life

చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్

కార్పొరేట్ ఆఫీస్ చిరునామా: చోళాక్రెస్ట్, సూపర్ బి, సి54 & సి55, 4, తిరువికా ఇండస్ట్రీయల్ ఎస్టేట్, గిండీ, చెన్నై-600032

స్వాధీనతా ప్రకటన (అనుబంధం 4) (రూల్ 8(1) క్రింద)

ఏదైతే, క్రింది సంతకందారు **మెసర్స్ చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్** యొక్క అధీకృత అధికారిగా, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (54 ఆఫ్ 2002) క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 9తో చదువగల సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ సదరు నోటీసు స్వీకరణ తేది నుండి 60 రోజుల్లోగా నోటీసులో పేర్కొనబడిన మొత్తాలు మరియు దానిపై వడ్డీని చెల్లించమని రుణగ్రహీతలు **(దిగువ పేర్కొన్న పేర్లు మరియు చిరునామాలకు)** మిమ్మల్ని కోరుతూ సదరు చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద దిగువ పేర్కొన్న తేదినాటి డిమాండ్ నోటీసులు జారీచేయబడినవి. రుణగ్రహీతలు మొత్తాలను తిరిగిచెల్లించుటలో విఫలం చెందిన కారణంగా, ఇందుమూలంగా రుణగ్రహీతలు మరియు సాధారణ ప్రజలకు నోటీసు ఇవ్వడమేమనగా, క్రింది సంతకందారు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8తో చదువగల సదరు చట్టంలోని సెక్షన్13 యొక్క సబ్-సెక్షన్(4) క్రింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ దిగువ వివరించిన ఆస్తిని స్వాధీనంలోకి తీసుకున్నారు. ప్రధానంగా పై పేర్కొన్న రుణగ్రహీతలు మరియు సాధారణ ప్రజలను ఇందుమూలంగా హెచ్చరించడమేమనగా, ఆస్తులతో ఏవిధమైన లావాదేవీలు జరుపరాదని మరియు సదరు ఆస్తులతో ఎవరైనా ఏవేని లావాదేవీలు జరుపదలచిన వారు **మెసర్స్ చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్** వారికి పేర్కొన్న మొత్తాలు మరియు దానిపై వడ్డీని చెల్లించుటకు లోబడి ఉంటుంది. సెక్యూర్డు అసెట్స్ విమోచనానికి అందుబాటులో ఉన్న సమయానికి సంబంధించి చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8) నియమాలను రుణగ్రహీతల శ్రద్ధను కోరుతున్నారు.

క్ర. సం.	రుణగ్రహీతల పేరు మరియు చిరునామా & రుణ ఖాతా నెంబరు	డిమాండ్ నోటీసు తేది	బాకీపడిన మొత్తం	స్వాధీనతా ఆస్తి వివరాలు	స్వాధీనతా తేది
1.	**రుణ ఖాతా నెంబరు:** HLO1VJI000057117 **లక్ష్మీ హరనాథ్ బాబు, మలేపాటి చిట్టమ్మ జానీ, ఇరువురి నివాసం:** 74-8-8/2, ఫ్లాట్ నెం.77, గ్రౌండ్ ఫ్లోర్, 4వ క్రాస్ రోడ్, జెడి నగర్ విజయవాడ, వాటర్ ట్యాంక్, విజయవాడ (అర్బన్), ఆంధ్రప్రదేశ్-520010, **ఇక్కడ కుడా:** ఆర్ఎస్ నెం.137/2, ఆర్.ఎస్.నెం.137/2, డోర్ నెం.2-151 దగ్గర, గాంధీ బొమ్మి రోడ్ దగ్గర, ఎస్‌బిఐ బ్యాంక్ వెనుకవువైపు రోడ్, ఫ్లాట్ నెం.ఎఫ్.2, సెకండ్ ఫ్లోర్ పెదా అవుటపల్లి గ్రామం, ఉంగుటూరు మండలం, కృష్ణజిల్లా-521286, ఆంధ్రప్రదేశ్, గాంధీ విగ్రహం, మరియు ఎన్టీఆర్ విగ్రహం మరియు ఎస్‌బిఐ బ్యాంక్ కృష్ణ.	13-09-2024	12.09.2024 నాటికి **రూ. 20,80,198/-** (రూపాయలు ఇరవైలక్షల ఎనభైవేల ఒకవంద తొంబైఎనిమిది మాత్రమే) మరియు దానిపై వడ్డీ.	పెద అవుటపల్లి గ్రామం, పెద అవుటపల్లి గ్రామ పంచాయితీ ప్రాంతం, ఉంగుటూరు మండలం, గన్నవరం సబ్ రిజిస్ట్రీ, కృష్ణా జిల్లాలోని సమీప డోర్ నెం.2-151, ఆర్.ఎస్.నెం.137/2లోని 303.1/2 చ.గ.ల పూర్తి విస్తీర్ణంనకుగాను 43.35 చ.గ.ల ఉమ్మడి విస్తీర్ణపు విడదీయలేని స్థల భాగంతోసహా 120చ.అ.ల కార్ పార్కింగ్ ఏరియా, 100చ.అ.ల ఉమ్మడి ఏరియా, 800 చ.అ.లప్లింత్ ఏరియాతో రెండవ అంతస్తులోని ఫ్లాట్ నెం.ఎస్.ఎఫ్-2 ఆస్తి మొత్తం. సరిహద్దులుగా: స్థలానికి సరిహద్దులు: తూర్పు: అవుటుపల్లి శ్రీదుర్గా రాణి ప్రహరిగోడ కొంత వరకు, పి.శివ కోటి సత్యనారాయణ ప్రహరి గోడ కొంత వరకు, దక్షిణం: పంచాయితీ బజార్, పడమర: 3.0 గజాలు వెడల్పు ఉమ్మడి మార్గం ఈ ఆస్తి, కొమ్మరాజు పాపారావు,నవులూరి శ్రీనివాసరావు, కొమ్మన వెంకటేశ్వర రావుకు చెందినది, ఉత్తరం: కొమ్మన వెంకటేశ్వరరావు ప్రహరి గోడ. ఫ్లాట్ సరిహద్దులు: తూర్పు: కారిడార్, దక్షిణం: ఉమ్మడి కారిడార్, మెట్లు, పడమర: ఒపెన్ టు స్కై, పడమర: ఒపెన్ టు స్కై.	స్వాధీనత తేది: 20-11-2024

తేది: 20-11-2024
ప్రదేశం: విజయవాడ

చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ తరపున
అధీకృత అధికారి

ఎత్నిక్ టొబాకో (ఇండియా) లిమిటెడ్ జాయింట్ ఇ-వేలం అమ్మకం ప్రకటన

IBC, 2016 క్రింద గోయింగ్ కన్సర్న్‌గా మరియు SARFAESI చట్టం, 2002లోని సెక్షన్ 13(4) ప్రకారం సంబంధిత రూల్స్ 8(6) & 9 తో చదవబడే సెక్యూరిటీ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్ 2002 ప్రకారం విక్రయం కోసం ఇ-వేలం అమ్మకపు ప్రకటన

కార్పొరేట్‌డెటార్: మెస్సర్స్ ఎత్నిక్ టొబాకో (ఇండియా) లిమిటెడ్ (లిక్విడేషన్‌లో కలదు)
వ్యక్తిగత హామీదారులు/తనఖాదారులు: శ్రీ తాడిశెట్టి మురళీ మోహన్ మరియు శ్రీమతి తాడిశెట్టి వెంకటరమణ
రిజిస్టర్డ్ చిరునామా: డి.నెం. 6-23-6/ఎ, జయ టవర్స్, 05వ లైను, 04వ క్రాస్ రోడ్డు, అరండల్‌పేట, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522 002, ఇండియా
లిక్విడేటర్: కాశి శ్రీనివాస్, (IBBI Registration: IBBI/IPA-003/IPA-ICAI-N-000237/2019-2020/12840).
Email: cirp.ethnictobacco@gmail.com, srinivaskashyap111080@gmail.com
మరియు
సెక్యూర్డ్ క్రెడిటార్స్ తరపున స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, స్ట్రెస్డ్ అస్సెట్స్ మేనేజ్‌మెంట్ బ్రాంచి-2, హైదరాబాద్.
శ్రీమతి ఇ. రాధిక, ఛీఫ్ మేనేజర్, సంప్రదించండి: 8985622824, E-mail: sbi.18359@sbi.co.in

IBC కోడ్, 2016 క్రింద లిక్విడేషన్ ఎస్టేట్‌లో భాగమైన ఆస్తులు లిక్విడేటర్ రూపొందించిన సంబంధిత నిబంధనలతో చదవబడే, సంబంధిత IBBI (లిక్విడేషన్ ప్రాసెస్) నిబంధనలు, 2016 & IBC, 2016 ప్రకారం లిక్విడేటర్ రూపొందించిన ప్రక్రియ మరియు సెక్యూర్డ్ క్రెడిటార్స్ అనగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కెనరా బ్యాంక్, రిలయన్స్ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్ మరియు ఇండియన్ బ్యాంక్‌లకు అనుకూలంగా వ్యక్తిగత హామీదారులచే, మరియు **మెస్సర్స్ ఎత్నిక్ టొబాకో (ఇండియా) లిమిటెడ్ (ఇన్ లిక్విడేషన్)**, తనఖా పెట్టబడిన భూమి & భవనం విక్రయం కోసం కార్పొరేట్ రుణగ్రహీత మరియు వ్యక్తిగత హామీదారులు/మార్ట్‌గేజర్‌లతో సహా సాధారణ ప్రజానీకానికి ఇ-వేలం విక్రయ నోటీసు ఇవ్వడమైనది. సదరు స్థిరాస్తుల కోసం సెక్యూరిటీ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్ 2002 కింద రూల్స్ 8(6) & 9 తో జతచేయబడిన సెక్షన్ 13(4) క్రింద **22-08-2019** తేదీన ఆస్తులు స్వాధీనం చేసుకోబడినవి. ఆస్తులను **"ఎక్కడ ఉన్నది అక్కడే", "ఎలా ఉన్నది అలాగే", "ఏది ఉందో అదే విధంగా" మరియు "ఏ ఇతర సహాయం లేకుండా"** పద్ధతిలో **27-12-2024** జాయింట్ ఇ-వేలం ప్రక్రియలో విక్రయించబడునని తెలియజేయడమైనది. ప్రతిపాదిత జాయింట్ ఇ-వేలం వివరాలు ఈ దిగువ పేర్కొనబడినవి.

చరాస్తులు: గుంటూరు జిల్లా, ఈదులపాలెం గ్రామములో 8 ఎకరాల 60 సెంట్లలో నిర్మించినబడిన ఇండ స్ట్రియల్ రూఫ్ క్రింద ఏర్పాటు చేయబడిన ప్లాంట్ మరియు మెషినరీ మరియు స్వీకరించదగిన వాటితో కూడిన ఫైనాన్షియల్ ఆస్తులు.

స్థిరాస్తులు

వ.నెం	డాక్యుమెంట్ నెం.	ఆస్తి యజమాని పేరు	విస్తీర్ణము	విస్తీర్ణము
1	విక్రయ దస్తావేజు: 3192/2006 తేది: 17.10.2006 లీజు డీడ్: 246/2010 తేది: 23.01.2010	శ్రీ తాడిశెట్టి మురళీమోహన్ తండ్రి: తాడిశెట్టి నరసింహారావు	5 ఎకరాల	డి.నెం. 5/1, ఈదులపాలెం (గ్రా) జిపి, ప్రత్తిపాడు సబ్ డివిజన్, గుంటూరు జిల్లా. **స్థలమునకు హద్దులు: తూర్పు:** సర్కారు డొంక, **దక్షిణం:** సర్కారు డొంక (కొండవీడు డొంక), **పడమర:** వనమా వెంకటరత్నం & ఇతరులు, **ఉత్తరం:** సర్కారు డొంక.
2	విక్రయ దస్తావేజు: 4218/2008 లీజు డీడ్: 1372/2009 తేది: 05.06.2009 రెక్టిఫికేషన్ డీడ్: 825/2019 తేది: 14.06.2019	శ్రీమతి తాడిశెట్టి వెంకటరమణ, భర్త: తాడిశెట్టి నరసింహారావు	1 ఎకరం 30 సెంట్లు	డి.నెం. 5/1, ఈదులపాలెం (గ్రా) జిపి, ప్రత్తిపాడు సబ్ డివిజన్, గుంటూరు జిల్లా. **స్థలమునకు హద్దులు: తూర్పు:** తాడిశెట్టి మురళీమోహన్ యొక్క స్థలము బోర్డర్, **దక్షిణం:** సర్కారు డొంక బోర్డర్, **పడమర:** తాడిశెట్టి వెంకట రమణ యొక్క స్థలము బోర్డర్, **ఉత్తరం:** సర్కారు డొంక బోర్డర్.
3	విక్రయ దస్తావేజు: 3507/2006 తేది: 22.11.2006 లీజు డీడ్: 1373/2009 తేది: 05.06.2009 రెక్టిఫికేషన్ డీడ్: 1826/2019 తేది: 14.06.2019	శ్రీమతి తాడిశెట్టి వెంకటరమణ, భర్త: తాడిశెట్టి నరసింహారావు	2 ఎకరాలు	డి.నెం. 5/1, ఈదులపాలెం (గ్రా) జిపి, ప్రత్తిపాడు సబ్ డివిజన్, గుంటూరు జిల్లా. **స్థలమునకు హద్దులు: ఉత్తరం:** తాడిశెట్టి మురళీమోహన్ యొక్క స్థలము బోర్డర్, **దక్షిణం:** సర్కారు డొంక (కొండవీడు డొంక), **తూర్పు:** వనమా వెంకటరత్నం, **పడమర:** సర్కారు డొంక.
4	విక్రయ దస్తావేజు: 504/2009 తేది: 25.09.2009 లీజు డీడ్: 4827/2010 తేది: 27.09.2010	శ్రీ తాడిశెట్టి మురళీమోహన్ తండ్రి: తాడిశెట్టి నరసింహారావు	30 సెంట్లు	డి.నెం. 744, ఈదులపాలెం (గ్రా) జిపి, ప్రత్తిపాడు సబ్ డివిజన్, గుంటూరు జిల్లా. **స్థలమునకు హద్దులు: ఉత్తరం:** తాడిశెట్టి మురళీమోహన్ చెందిన స్థలము, **దక్షిణం:** సర్కారు డొంక, **తూర్పు:** సర్కారు డొంక, **పడమర:** సర్కారు డొంక.

పైన పేర్కొన్న మొత్తం నాలుగు ఆస్తులు వెరశి 8 ఎకరాల 60 సెంట్ల భూమి మరియు అందులో 2,92,038 చ॥అ॥ల విస్తీర్ణములో నిర్మించబడిన భవనములు, ఇండస్ట్రియల్ షెడ్స్‌తో సహా

రిజర్వు ధర:	రూ. 46,62,00,000/- (నలభై ఆరు కోట్ల అరవై రెండు లక్షల రూపాయలు)
డిపాజిట్ చేయవలసిన బయానా:	రూ. 4,66,20,000/- (నాలుగు కోట్ల అరవై ఆరు లక్షల ఇరవై వేల రూపాయలు)
అర్హత పొందిన డాక్యుమెంట్లు సమర్పించుటకు చివరి తేది/ఇఓఐ	15.12.2024
సైట్ సందర్శన మరియు సమాచారాన్ని పంచుకోవడం	18.12.2024 నుండి 24.12.2024
బయనా దాఖలుకు చివరి తేది	25.12.2024
ఇ-వేలం తేది మరియు సమయం	27.12.2024 ఉ. 11.00 గం॥ల నుండి సా. 04.00 గం॥ల వరకు
బిడ్ పెంపుదల మొత్తం	రూ. 10,00,000/- (పది లక్షల రూపాయలు మాత్రమే) గుణిజములతో

గమనిక:
1) ఆస్తులు ఉమ్మడిగా విక్రయించబడతాయి మరియు విడివిడిగా ఆస్తుల కోసం వేలం అనుమతించబడదు.
2) ఎత్నిక్ టొబాకో (ఇండియా) లిమిటెడ్ మరియు ఇండ్ టాబ్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ యూనిట్లు స్థాపించబడిన ఆస్తులు. భూమి, భవనాలు మరియు ప్లాంట్ మరియు యంత్రాలు ఒకే ప్రాంగణంలో సాధారణ కాంపౌండ్ వాల్‌తో ఉన్నాయి, స్పష్టమైన సరిహద్దులు లేవు మరియు విడదీయడానికి లేకుండా ఉన్నాయి కనుక బిడ్డర్లు ETIL మరియు Ind Tob రెండింటికీ కలిపి వేలం వేయవలెను. ఎత్నిక్ టొబాకో (ఇండియా) లిమిటెడ్ మరియు ఇండ్ టాబ్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ (ఏకకాలంలో చేయబడిన ప్రకటన) విలువ గరిష్టీకరణ కోసం కలిపి బిడ్ చేసిన బిడ్‌లను మాత్రమే లిక్విడేటర్ పరిశీలిస్తారు.
3) NCLT, అమరావతి బెంచ్ జారీచేసిన IA (IBC)/316/2024 తేది: 26.09.2024 ఆర్డర్‌తో పాటు IA (IBC) 341/2022 తేది. 24.03.2023 లో CP నం. CP (IB)/30/7/AMR/2021 లో ఆర్డర్‌తో చదవబడే ఆదేశాలకు అనుగుణంగా జాయింట్ సేల్ నిర్వహించడుతోంది.
4) ఇ-వేలం ప్రక్రియ కోసం వివరణాత్మక నిబంధనలు & షరతులు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా www.sbi.co.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న జాయింట్ ఇ-వేలం ప్రక్రియ మెమోరాండమ్‌లో నిర్దేశించబడినవి.
5) వివరణాత్మక నిబంధనలు & షరతులు మరియు పూర్తి ఇ-వేలం ప్రక్రియ పత్రం అనగా ఆస్తుల వివరాలతో కూడిన జాయింట్ ఇ-వేలం ప్రక్రియ మెమోరాండం, ఆన్‌లైన్ ఇ-వేలం బిడ్ ఫారం, డిక్లరేషన్ మరియు అండర్‌టేకింగ్ ఫారం, ఆన్‌లైన్ వేలం విక్రయం యొక్క సాధారణ నిబంధనలు మరియు షరతులు వెబ్‌సైట్ https://bankauctions.in/ లో అందుబాటులో కలవు. సంప్రదించండి: **టి. జయ ప్రకాష్‌రెడ్డి, prakash@bankauctions.in, 8142000062/64/66**
పై షెడ్యూల్‌లో పేర్కొన్న ఆస్తులను, కాబోయే బిడ్డర్లు తనిఖీ చేసుకొనుటకు, మరిన్ని వివరాల కోసం దయచేసి రిజల్యూషన్ ఏజెంట్ మెస్సర్స్ రఘు అసోసియేట్స్, శ్రీ వి.యన్.వి. సత్యనారాయణ (మొబైల్: 94140886500/8885552284)ను సంప్రదించగలరు.

ప్రదేశము: హైదరాబాద్
తేది: 25.11.2024

కాశి శ్రీనివాస్, లిక్విడేటర్
మెస్సర్స్ ఎత్నిక్ టొబాకో (ఇండియా) లిమిటెడ్ (లిక్విడేషన్‌లో)
మరియు సెక్యూర్డ్ క్రెడిటార్స్ తరపున

మెస్సర్స్ Ind Tob ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ జాయింట్ ఇ-వేలం అమ్మకం ప్రకటన

IBC, 2016 క్రింద గోయింగ్ కన్సర్న్‌గా మరియు SARFAESI చట్టం, 2002లోని సెక్షన్ 13(4) ప్రకారం సంబంధిత రూల్స్ 8(6) & 9 తో చదవబడే సెక్యూరిటీ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్ 2002 ప్రకారం విక్రయం కోసం ఇ-వేలం అమ్మకపు ప్రకటన

కార్పొరేట్‌డెటార్: మెస్సర్స్ Ind Tob ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ (లిక్విడేషన్‌లో కలదు), కార్పొరేట్ డెటర్, వ్యక్తిగత హామీదారులు/తనఖాదారులు: శ్రీ తాడిశెట్టి వెంకటరావు మరియు తాడిశెట్టి మురళీ మోహన్
రిజిస్టర్డ్ చిరునామా: డి.నెం. 6-5-15, 15వ లైను, 04వ క్రాస్ రోడ్డు, అరండల్‌పేట, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522 002, ఇండియా
లిక్విడేటర్: కాశి శ్రీనివాస్, (IBBI Registration: IBBI/IPA-003/IPA-ICAI-N-000237/2019-2020/12840).
Email: cirp.indtob@gmail.com, srinivaskashyap111080@gmail.com
మరియు
సెక్యూర్డ్ క్రెడిటార్స్ తరపున స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, స్ట్రెస్డ్ అస్సెట్స్ మేనేజ్‌మెంట్ బ్రాంచి-2, హైదరాబాద్.
శ్రీమతి ఇ. రాధిక, ఛీఫ్ మేనేజర్, సంప్రదించండి: 8985622824, E-mail: sbi.18359@sbi.co.in

IBC కోడ్, 2016 క్రింద లిక్విడేషన్ ఎస్టేట్‌లో భాగమైన ఆస్తులు లిక్విడేటర్ రూపొందించిన సంబంధిత నిబంధనలతో చదవబడే, సంబంధిత IBBI (లిక్విడేషన్ ప్రాసెస్) నిబంధనలు, 2016 & IBC, 2016 ప్రకారం లిక్విడేటర్ రూపొందించిన ప్రక్రియ మరియు సెక్యూర్డ్ క్రెడిటార్స్ అనగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు అనుకూలంగా వ్యక్తిగత హామీదారులచే, మరియు **మెస్సర్స్ Ind Tob ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ (ఇన్ లిక్విడేషన్)**, తనఖా పెట్టబడిన భూమి & భవనం విక్రయం కోసం కార్పొరేట్ రుణగ్రహీత మరియు వ్యక్తిగత హామీదారులు/మార్ట్‌గేజర్‌లతో సహా సాధారణ ప్రజానీకానికి ఇ-వేలం విక్రయ నోటీసు ఇవ్వడమైనది మరియు సదరు స్థిరాస్తుల కోసం సెక్యూరిటీ ఎన్‌ఫోర్స్‌మెంట్ రూల్స్ 2002 కింద రూల్స్ 8(6) & 9 తో జతచేయబడిన సెక్షన్ 13(4) క్రింద **22-08-2019** తేదీన ఆస్తులు స్వాధీనం చేసుకోబడినవి. ఆస్తులను **"ఎక్కడ ఉన్నది అక్కడే", "ఎలా ఉన్నది అలాగే", "ఏది ఉందో అదే విధంగా" మరియు "ఏ ఇతర సహాయం లేకుండా"** పద్ధతిలో **27-12-2024** జాయింట్ ఇ-వేలం ప్రక్రియలో విక్రయించబడునని తెలియజేయడమైనది. ప్రతిపాదిత జాయింట్ ఇ-వేలం వివరాలు ఈ దిగువ పేర్కొనబడినవి.

స్థిరాస్తుల వివరణ

వ.నెం	డాక్యుమెంట్ నెం.	ఆస్తి యజమాని పేరు	విస్తీర్ణము	విస్తీర్ణము
1	5385/2009 తేది: 23.11.2009 లీజు డీడ్: 5743/2009 తేది: 21.12.2009	శ్రీ తాడిశెట్టి వెంకటరావు తండ్రి: తాడిశెట్టి నరసింహారావు	3 ఎకరాల 83 సెంట్లు	డి.నెం. 4/6, ఈదులపాలెం (గ్రా) జిపి, గుంటూరు జిల్లా. **స్థలమునకు హద్దులు: ఉత్తరం:** జొన్నలగడ్డ జోజయ్యకు చెందిన స్థలము, **దక్షిణం:** సర్కారు డొంక (కొండవీడు డొంక), **తూర్పు:** తాడిశెట్టి మురళీమోహన్‌కు చెందిన స్థలము, **పడమర:** శ్రీమతి మారెళ్ళ ఇందిరా చేత తాడిశెట్టి మురళీమోహన్‌కు అమ్మిన స్థలము.
2	విక్రయ దస్తావేజు: 235/2012 తేది: 19.01.2012 డాక్యుమెంట్ నెం. 250/2012, తేది: 20.01.2012, డాక్యుమెంట్ నెం. 379/2012, తేది: 28.01.2012, డాక్యుమెంట్ నెం.2473/2012, తేది: 20.06.2012, లీజు డీడ్ నెం. 5796/2012, తేది: 19.12.2012	శ్రీమతి తాడిశెట్టి వెంకటరావు తండ్రి: తాడిశెట్టి నరసింహారావు	5 ఎకరాల 81 సెంట్లు	డి.నెం. 4/3, 4/4, 4/5, ఈదులపాలెం (గ్రా) జిపి, ప్రత్తిపాడు మండలం, గుంటూరు జిల్లా. **స్థలమునకు హద్దులు: ఉత్తరం:** సర్కారు డొంక (కొండవీడు డొంక), **దక్షిణం:** మెస్సర్స్ Ind Tob ఇంటర్నేషనల్ ప్రేవేట్ లిమిటెడ్‌కు చెందిన గోడౌన్, **తూర్పు:** ఎతినిక్ టొబాకో త్రెస్సింగ్ ఫ్యాక్టరీ, **పడమర:** ఉగ్గిరాల దొనరావుకు చెందిన స్థలము.
3	విక్రయ దస్తావేజు: 5740/2009 తేది: 21.12.2009 లీజు డీడ్ నెం. 5742/2009, తేది: 21.12.2009 & 1821/2019, తేది: 14.06.2019	శ్రీమతి తాడిశెట్టి మురళీమోహన్ తండ్రి: తాడిశెట్టి నరసింహారావు	2 ఎకరాల 33 సెంట్లు	డి.నెం. 4/6, ఈదులపాలెం (గ్రా) జిపి, ప్రత్తిపాడు మండలం, గుంటూరు జిల్లా. **స్థలమునకు హద్దులు: ఉత్తరం:** ఉగ్గిరాల దొనరావు & జొన్నలగడ్డ గోపయ్యకు చెందిన స్థలము, **దక్షిణం:** సర్కారు డొంక (కొండవీడు డొంక), **తూర్పు:** తాడిశెట్టి వెంకటరావుకు చెందిన స్థలము, **పడమర:** మోదుగుల సుబ్బారెడ్డికి చెందిన స్థలము.
4	విక్రయ దస్తావేజు: 5386/2009 తేది: 23.11.2009 లీజు డీడ్ నెం. 5741/2009, తేది: 21.12.2009 & 1822/2019, తేది: 14.06.2019	శ్రీ తాడిశెట్టి మురళీమోహన్ తండ్రి: తాడిశెట్టి నరసింహారావు	56 సెంట్లు	డి.నెం. 4/6, ఈదులపాలెం (గ్రా) జిపి, ప్రత్తిపాడు మండలం, గుంటూరు జిల్లా. **స్థలమునకు హద్దులు: ఉత్తరం:** జొన్నలగడ్డ జోజయ్యకు చెందిన స్థలము, **దక్షిణం:** సర్కారు డొంక (కొండవీడు డొంక), **తూర్పు:** ఎగ్జిక్యూటెంట్స్ స్థలము, **పడమర:** తాడిశెట్టి వెంకటరావుకు చెందిన స్థలము.
5	విక్రయ దస్తావేజు: 504/2009 తేది: 25.09.2009 & 1021/2009, తేది: 04.05.2009 & 2732/2010, తేది: 21.06.2010, లీజు డీడ్ నెం. 1374/2011, తేది: 20.04.2011	శ్రీ తాడిశెట్టి మురళీమోహన్ తండ్రి: తాడిశెట్టి నరసింహారావు	2 ఎకరాల 38 సెంట్లు	సర్వే నెం. 774, యనమదల జిపి (గ్రా) జిపి, ప్రత్తిపాడు మండలం, గుంటూరు జిల్లా. **స్థలమునకు హద్దులు: ఉత్తరం:** సర్కారు డొంక (కొండవీడు డొంక), **దక్షిణం:** బొమ్మిడాల నారాయణమూర్తికి చెందిన స్థలము, **తూర్పు:** కెనాల్, **పడమర:** సర్కారు డొంక (కొండవీడు డొంక).
	మొత్తం		14.91 ఎకరాలు	
6	పైన పేర్కొన్న మొత్తం ఐదు ఆస్తులు వెరశి 14 ఎకరాల 91 సెంట్ల భూమి మరియు అందులో 5,54,586 చ॥అ॥ల విస్తీర్ణములో నిర్మించబడిన భవనములు, ఇండస్ట్రియల్ షెడ్స్‌తో సహా			
7	స్వీకరించదగిన వాటితో కూడిన ఫైనాన్షియల్ ఆస్తులు.			

రిజర్వు ధర:	రూ. 61,38,00,000/- (అరవై ఒక్క కోట్ల ముప్పై ఎనిమిది లక్షలు రూపాయలు)
డిపాజిట్ చేయవలసిన బయానా:	రూ. 6,13,80,000/- (ఆరు కోట్ల పదమూడు లక్షల ఎనభై వేల రూపాయలు)
అర్హత పొందిన డాక్యుమెంట్లు సమర్పించుటకు చివరి తేది/ఇఓఐ	15.12.2024
సైట్ సందర్శన మరియు సమాచారాన్ని పంచుకోవడం	18.12.2024 నుండి 24.12.2024
బయనా దాఖలుకు చివరి తేది	25.12.2024
ఇ-వేలం తేది మరియు సమయం	27.12.2024 ఉ. 11.00 గం॥ల నుండి సా. 04.00 గం॥ల వరకు
బిడ్ పెంపుదల మొత్తం	రూ. 10,00,000/- (పది లక్షలు మాత్రమే) గుణిజములతో

గమనిక:
1) ఆస్తులు ఉమ్మడిగా విక్రయించబడతాయి మరియు విడివిడిగా ఆస్తుల కోసం వేలం అనుమతించబడదు.
2) ఎత్నిక్ టొబాకో (ఇండియా) లిమిటెడ్ మరియు ఇండ్ టాబ్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ యూనిట్లు స్థాపించబడిన ఆస్తులు. భూమి, భవనాలు మరియు ప్లాంట్ మరియు యంత్రాలు ఒకే ప్రాంగణంలో సాధారణ కాంపౌండ్ వాల్‌తో ఉన్నాయి, స్పష్టమైన సరిహద్దులు లేవు మరియు విడదీయడానికి లేకుండా ఉన్నాయి కనుక బిడ్డర్లు ETIL మరియు Ind Tob రెండింటికీ కలిపి వేలం వేయవలెను. ఎత్నిక్ టొబాకో (ఇండియా) లిమిటెడ్ మరియు ఇండ్ టాబ్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ (ఏకకాలంలో చేయబడిన ప్రకటన) విలువ గరిష్టీకరణ కోసం కలిపి బిడ్ చేసిన బిడ్‌లను మాత్రమే లిక్విడేటర్ పరిశీలిస్తారు.
3) NCLT, అమరావతి బెంచ్ జారీచేసిన IA (IBC)/319/2024 తేది: 26.09.2024 ఆర్డర్‌తో పాటు IA (IBC) 338/2022 తేది. 24.03.2023 లో CP నం. CP (IB)/33/7/AMR/2021 లో ఆర్డర్‌తో చదవబడే ఆదేశాలకు అనుగుణంగా జాయింట్ సేల్ నిర్వహించడుతోంది.
4) ఇ-వేలం ప్రక్రియ కోసం వివరణాత్మక నిబంధనలు & షరతులు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా www.sbi.co.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న జాయింట్ ఇ-వేలం ప్రక్రియ మెమోరాండమ్‌లో నిర్దేశించబడినవి.
5) వివరణాత్మక నిబంధనలు & షరతులు మరియు పూర్తి ఇ-వేలం ప్రక్రియ పత్రం అనగా ఆస్తుల వివరాలతో కూడిన జాయింట్ ఇ-వేలం ప్రక్రియ మెమోరాండం, ఆన్‌లైన్ ఇ-వేలం బిడ్ ఫారం, డిక్లరేషన్ మరియు అండర్‌టేకింగ్ ఫారం, ఆన్‌లైన్ వేలం విక్రయం యొక్క సాధారణ నిబంధనలు మరియు షరతులు వెబ్‌సైట్ https://bankauctions.in/ లో అందుబాటులో కలవు. సంప్రదించండి: **టి. జయ ప్రకాష్‌రెడ్డి, prakash@bankauctions.in, 8142000062/64/66.**
పై షెడ్యూల్‌లో పేర్కొన్న ఆస్తులను, కాబోయే బిడ్డర్లు తనిఖీ చేసుకొనుటకు, మరిన్ని వివరాల కోసం దయచేసి రిజల్యూషన్ ఏజెంట్ మెస్సర్స్ రఘు అసోసియేట్స్, శ్రీ వి.యన్.వి. సత్యనారాయణ (మొబైల్: 94140886500/8885552284)ను సంప్రదించగలరు.

ప్రదేశము: హైదరాబాద్
తేది: 25.11.2024

కాశి శ్రీనివాస్, లిక్విడేటర్
మెస్సర్స్ Ind Tob ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ (లిక్విడేషన్‌లో)
మరియు సెక్యూర్డ్ క్రెడిటార్స్ తరపున

'కథానిక అంటే మళ్లీ మళ్లీ
చదివించే వచన ఖండకావ్యం.
వెనక నుంచి సముద్రం హోరు
వినిపిస్తూ చూడ్డానికి మాత్రం కెరటంలా
కన్పించేది'

- బుచ్చిబాబు

ఏలినోడు ఏటిసేత్తన్నాడు?

ఏ మరిడమ్మోరు వాలిందో
అవుడి దిష్టే తగిలిందో!
ఊరి పెజలు పిక్కలు దేరిపోయి
దబ్బులు కక్కుకొని చచ్చిపోతుంతే
ఏమి సేతుమురా దేముడానని
బుర్ర బాదుకోడం అయిపోతంది!

ఎప్పుడో ఊరిగాని ఊరెళ్ళి
ఇన్నేళ్లికి వత్తాడికి
ఊరు వల్లకాడై యున్నాది
ఇంత రవ్వ బాగైనట్టు లేదు
పెజల బుగ్గలు సప్పిబడిపోయి
ఒళ్ళు ఎముకులు దేరిపోయున్నాది

ఏమి బతికేత్తమని ఈ ఊరిల
రెండు కిడ్నీలు కుళ్ళిపోయి
కడుపులోన పేగుల చుట్టుకొని
దగ్గతుంతే సొప్పు పడిపోతుంతే
రేయిజాలా ఎకూపిరితో
గొద్దవ అరిసినట్టే పెజలుంతే!
కుర్ర మీసాలోడు మెడలు వాలేత్తే
ఆసుపత్రికని వొట్టికెళ్తుంటే
ఊరి బంద్రాలు వరకు దిగబెట్టి
కడచూపు అయితాదేమోనని
సచ్చినోడి పాడెనక ఊరంతా ఏడ్చినట్టు
వచ్చినోళ్లంతా ఒకటే గోల ...

ఏటైపోనారు ఆ పెజలంతా
సంగిడి రాయిలు ఒంటిసేత్తో జల్లినోలు
బుర్ర మీద మూడాజిరులేసుకొని
కొండ నుండి కర్రలు తెచ్చిన ఆడోళ్ళేరి
కావిడి మీద రెండేసి దొంతులెట్టుకొని
ఊబి నీలు ఒట్టుకొచ్చిన మగోళ్లెటైనారు?

ఏం గాచ్చారం!
ఏం పురుగు చొరబడ్డాదీళ్ళ కడుపులో
లోకం సూడని పిల్లలు కళ్ళు తేలేత్తుంతే
తాటి చెట్టులాంటి మడుసులు
సొప్ప కట్టలాగైపోతుంతే
ఏలినోడు ఏటిసేత్తన్నాడు?

ఏం ముదనష్టపు బతుకులు మావని
కుమిలికొని ఏడకండిరా
ఓట్లడగడానికొచ్చినోడికి
బొట్టెట్టి దిష్టి తీయకంటా
గుంజీలు లాగేసి అడగండి
మా ఊరేటైపోనాదని!

- వినోద్ కుత్తుం
96343 14502

ఇప్పుడైనా ...

దేవుడిచ్చిన భూమిని కొందరు మిమ్మల్ని దగా చేసి
వాళ్ళ సొంతం చేసుకుంటే మీకేమీ పట్టలేదు!
మిమ్మల్ని కూలీలను చేసి కూడు లేకుండా చేసినా
మీకేమీ పట్టలేదు!

కూలినాలీ జనమంతా ఒక్కటి కాకుండా
అంతా దేవుడు చేసిందే అన్నా
మీకేమీ పట్టలేదు!
విపరీతంగా గుళ్ళు కట్టి మీకు భక్తి బోధలు చేసి
వాళ్ల అబద్ధాలు చెప్పినా
మీకేమీ పట్టలేదు!

మీరు భక్తికి దాసులై దేవుడి చుట్టూ తిరుగుతూ
ముత్యాల తలంబ్రాలతో దేవుడి కళ్యాణాలు చేసినా
ఏ దేవుడూ మీ మొర వినక
నిత్య దరిద్రంతో మీరు ఆత్మహత్యలకు లోనైనా
మీకు ఏమీ పట్టలేదు!
వాళ్లు నిత్యం అబద్ధాలు చెప్పి
మిమ్మల్ని దోచుకుంటున్నా
మీకేమీ పట్టలేదు!
దేవుడి పిచ్చితో కులమతాల పిచ్చితో
సర్వ నాశనమౌతున్నా
మీకేమీ పట్టలేదు!

చెపుదామంటే భయం!
వాళ్ళను చూసి కాదు; మిమ్మల్ని చూసి నా భయం!
నిజం చెపితే నిష్ఠురం!
గుళ్లో దేవుడు లేడు
దేవుణ్ణి కూడా మోసం చేసి
వాళ్ళు కులుకుతున్నారు!
చైనావాళ్లు ఒకప్పుడు మత్తుమందు భాయీలు
టెక్నాలజీతో ఎదిగి ప్రపంచాన్ని శాసిస్తున్నారు!
మన నాయకులు మిమ్మల్ని
'సనాతనం' చుట్టూ తిప్పుతూ
భక్తిపిచ్చోళ్లను చేశారు!
నిజమైన దేవుడు మీ గుండెల్లోనే ఉన్నాడు!
పేదలంతా ఒక్కటైతే
దేవుడు మీతోనే ఉంటాడు!
మీ 'దరిద్రాని'కి 'భక్తి'
వాళ్ళ 'భాగ్యాని'కి 'రాజ్యం'
ఇదంతా ఒక కుతంత్ర రాజకీయం!
ఇప్పుడైనా కళ్లు తెరవండి!

- వరుణ్ చక్కా
99023 57475

తూరుపు గుమ్మం తలుపు

ఒక కొయ్యను చెక్కాల్సిందే
పచ్చని కొమ్మను నరికైనా సరే
పండు ఎండుకొమ్మను కొట్టైనా సరే
ఒక కొయ్యను చెక్కాల్సిందే!

నవ మాసాల పేగుటూయలకు
ప్రాణ బిందువులు తాపిన చనుగుబ్బలకు
ప్రేమను వెన్న ముద్దలుగా పెట్టిన చేతులకు
చిరునవ్వులను పెదవులకు పూసిన తల్లులకు
సమాధానం చెప్పి తీరాల్సిందే!

గుండెలపైన ఆడిస్తూ
గుండెకాయంత జాగ్రత్తగా చూసుకుంటూ
ఒడి నుండి ఇంటి వొడి వరకూ
రక్షణ గోడగా నిలిచి
ప్రతి అడుగుకు చెమట పూలు చల్లుకుంటూ
తన చల్లని తల్లి కోసం ఎన్నో కలలు కన్న
ఆ తండ్రి కన్నీటిని తుడవాల్సిందే!
అత్తరు వాసనల
నెత్తురు చిందించిన కొంక నక్కలకు
బుగ్గ పాలారని పసి మొగ్గల ప్రాణాలు చిదిమిన
నర మేధకులకు చిరునవ్వుల
వెలుతురు వాడని
నెలవంకల మట్టుపెట్టిన మకిలి గాళ్ళకు
శాంతి కేతనాలైన
పారవతాల్ని రక్తసిక్తం చేసిన వేటగాళ్లకు
తూర్పు గుమ్మం తలుపు తెరవాల్సిందే
తెల్లవారకముందే ఉరి తీయాల్సిందే!

- ఈతకోట సుబ్బారావు
94405 29785

అధ్యాపక దీపం, అనువాద రత్నం

కొమ్మారెడ్డి కేశవరెడ్డి ... క్రమశిక్షణ, అంకితభావం, ఉదాత్త మానవీయ విలువలు, ఎంత కృషి చేసినా వినమ్రంగా మసలే సంస్కారం నిండిన పెద్దాయన. తెలుగు కళాసాహిత్యాలతో, ప్రజాజీవితంతో, ఉపాధ్యాయ ఉద్యమంతో పెనవేసుకుని పెరిగారు. బాల్యంలోనే హరికథలు, బుర్రకథలు, జానపదాలను చూస్తూ కళల పట్ల మక్కువ పెంచుకుని విద్యార్థి దశలోనే మ్యాగజైన్లలో రచనలు చేసిన జిజ్ఞాసువు ఆయన. సూర్యాపేటలో మొదలై తర్వాత చాలా ఊళ్లు తిరిగిన ఆయన ఉపాధ్యాయ జీవితం రేపటి పౌరులను చేరువ చేసింది. తను చదువుకుంటూ వారిని తీర్చిదిద్దుతూ ముందుకుసాగింది. ఉపాధ్యాయ ఉద్యమ ప్రభావం కేశవరెడ్డికి ఉత్సాహాన్ని మరింత పెంచింది. ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆయన శాశ్వత చిరునామాగా మారింది.

అక్షర ప్రస్థానం.. అపార అధ్యయనం

అనేక పరిణామాల మధ్య ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) ఏర్పడినప్పుడు అగ్ర నాయకులుగా ఎ.వెంకటస్వామి, డి.రామిరెడ్డి, పివి సుబ్బరాజు వంటివారు ముందుండేవారు. వీరితో పాటు ఐక్య ఉపాధ్యాయ సంపాదకుడుగా మైనేని వెంకటరత్నం... విజయవాడలో ప్రజాశక్తి కార్యాలయం వెనకే యుటిఎఫ్ భవన్ నిర్మాణం జరిగాక వీరందరినీ నిరంతరం కలుస్తుండేవాళ్లం. గుంటూరు నుంచి దాదాపు వారంలో మూడు నాలుగు సార్లు వచ్చివెళ్లే వారు కేశవరెడ్డి. ఐక్య ఉపాధ్యాయ సంపాదకవర్గ సభ్యులుగా మైనేనికి సహాయపడుతుంటేవారు. దేశదేశాల విద్యావిధానం గురించి వ్యాసాలు రాస్తుండేవారు. ఇలాటి సమయంలో హఠాత్తుగా నగరం వెలువడింది. అమ్మ నవలతో ప్రపంచ వ్యాపితంగా ప్రగతిశీల శక్తులకు ఊపిరులూదిన మాగ్జిం గోర్కి నవల స్వర్ణ పిశాచి నగరం ఆ విధంగా కేశవరెడ్డి కలంలో రూపుదిద్దుకుంది. పాత్రలకు పేర్లు, వాతావరణం.. వీటన్నిటిని మార్చి తెలుగీకరించే ప్రయత్నం చేశారు. ఆ నవలపైన వచ్చిన సమీక్షలు నాకు తన రచనాశక్తిని పరిచయం చేశాయి. మరోవైపున ఈ విధమైన తెలుగీకరణ మంచిదా కాదా అని చర్చ కూడా నడచింది గాని కేశవరెడ్డి తన అభిప్రాయం మార్చుకోలేదు. కాకుంటే మరింత రెండు మూడేళ్ల పాటు ఏకధాటిగా ఇంగ్లీషు తెలుగు సాహిత్యం చదువుతూ అవగాహన పరిపుష్టం చేసుకున్నారు. పట్టు పెంచుకున్నారు. అప్పుడే ప్రజాశక్తి ఆదివారం అనుబంధానికి ధారావాహికలు రాస్తుండేవారు. 'కాశయ్య ముత్యాలు' వాటిలో నాకు బాగా గుర్తుంది. అది కూడా అనుసరణే అయినా జీవద్భాషలో చాలా పట్టుగా నడిచింది. రచన ఇవ్వడమే గాక ఆయన దానిపై స్పందన తెలుసుకోవడానికి ఎంతో తపన పడేవారు. నాలాటి వారిని పదేపదే ప్రశ్నలు వేసేవారు. పైపై మెచ్చుకోళ్ల కన్నా విషయ ప్రధానమైన విమర్శకు విలువనిచ్చేవారు. అలాటి చాలా చర్చలు నాకు గుర్తుకొస్తున్నాయి. చిన్న చిన్న గల్పికల్లాటి వాటితో గొప్ప భావన స్ఫురింపచేసే శక్తి ఆయనకుండేది. విస్తారంగా చదివారు గనక ఒక్క ఊపులోనే చరిత్ర గమనాన్ని గుదిగుచ్చి రాయగలిగేవారు.

ప్రామాణిక గ్రంథ పరంపర

ఇఎంఎస్ నంబూద్రిపాద్ స్వాతంత్ర్య పోరాట చరిత్ర బృహద్గ్రంథ అనువాదం కేశవరెడ్డిని చాలామందికి పరిచయం చేసింది. మాన్స్ వర్డ్లీగూడ్స్ అనే సులభతర ఆర్థిక శాస్త్ర గ్రంథాన్ని అనువాదం చేసినప్పుడు 'మానవుడు సంపద సమాజం' అనే పేరు నేనే పెట్టాను. వర్గ సమాజ వాస్తవాలను కళ్లకు కట్టే భూలోకంలో శని మరో ప్రయోగం. (మూలం : ఆంటన్ టామ్సార్వే) బిపిన్ చంద్ర, సుమిత్ సర్కార్, కె.కృష్ణారెడ్డి స్వాతంత్ర్య సమరం పైన, భారత దేశ చరిత్రపైన రాసిన గ్రంథాల సీరిస్ అనువాదం పోటీ పరీక్షలకు గొప్ప వనరుగా కొనసాగుతోంది.

కేశవరెడ్డి ఈ కాలంలో అనారోగ్యంతో బాధపడినా, కుటుంబ బాధ్యతలు వెన్నాడినా కాస్త వెసులుబాటు కలగగానే ఏదైనా అనువాదం అడిగేవారు. ఎలాటి ప్రతిఫలం తీసుకోకుండా, ఆలస్యం లేకుండా అత్యంత బాధ్యతగా అనువాదం చేసి పంపుతుండేవారు. దశాబ్దాలుగా ఎంతో మంది ప్రయత్నించి కూడా తెలుగులో తీసుకు రాలేకపోయిన ఎరిక్‌హాబ్స్ వామ్ రచనలు, పీపుల్స్ హిస్టరీ పేరిట ఇర్ఫాన్ హబీబ్ రాసిన చరిత్ర సీరిస్ అనువాదం చేయడం ఆయన పట్టుదలకు ప్రతిబింబం. ఇదే కాలంలో విద్యారంగంపై అగాధమైన శ్రమతో రాసిన సమగ్ర గ్రంథాన్ని ఎంఎల్సి కెఎస్ లక్ష్మణరావు సహకారంతో గుంటూరులో ప్రచురింపచేశారు. ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ అందించిన ఆణిముత్యాల వంటి అనువాదకుల్లో అగ్రగణ్యులు కేశవరెడ్డి. తనతో పాటు గుర్తుకువచ్చే మరో పేరు ఎజి యతిరాజులు. అందుకే వీరిద్దరిని పలు సందర్భాల్లో అభినందించేవాళ్లం.

పదేళ్ల పత్రికా బాధ్యత

కేవలం రచనలు, అనువాదాల గురించే చెబితే కేశవరెడ్డి జీవిత చిత్రణ పూర్తి కాదు. ఉద్యోగ విరమణ వరకూ ఆయన ఉపాధ్యాయ బాధ్యతలకు న్యాయం చేసేందుకు ఎంతో శ్రమించేవారు. మరోవంక మైనేని వెంకటరత్నం తర్వాత ఐక్య ఉపాధ్యాయ సంపాదకత్వం చేపట్టి దశాబ్దం పాటు తీసుకువచ్చారు. ఆ కాలంలో సాహిత్యానికి ఇతోధిక ప్రోత్సాహం ఇచ్చారు. స్వయంగా రచయిత గనకే ఏది కావలసినా రాయడానికి కూచునేవారు. సతీమణి హనుమాయమ్మ ఎల్లవేళలా సహకరించి ఉండకపోతే ఇది సాధ్యమయ్యేది కాదు. ఇక వారి కుమారుడు ఈశ్వర్ మంచి ఉద్యోగం వదులుకుని ఐచ్ఛికంగా వచ్చి ప్రజాశక్తిలో దీర్ఘకాలం పాటు కీలక సేవలందించారు. ఈశ్వర్ భార్య, యుటిఎఫ్ నిర్మాత వెంకటస్వామి కుమార్తె అరుణ కూడా ప్రజాశక్తి ఫీచర్స్ విభాగంలో పనిచేశారు. కుమార్తె పద్మజ డాక్టర్ కాగా, అల్లుడు ప్రతాపరెడ్డి ఐటి నిపుణుడుగా ఫ్రీ సాఫ్ట్‌వేర్ ఉద్యమంలో బాధ్యతలు నిర్వహిస్తున్నారు. మరొక కుమారుడు శ్రీనివాస రెడ్డి, కోడలు రాజీ. ఇలా మొత్తం కుటుంబం ఉద్యమంలో ఉండటం ఎంత విశేషమో చెప్పనవసరం లేదు. తన కృషికి, అధ్యయనానికి వారు గొప్ప గౌరవాభిమానాలతో ప్రోత్సాహమిచ్చారు.

సాహితీ స్రవంతితో అనుబంధం

రచనా రంగం, ఉపాధ్యాయ ఉద్యమం, సాహిత్యరంగం ... మూడింటిలోనూ మా ఇద్దరికి మంచి సాన్నిహిత్యం ఉండేది. సాహితీస్రవంతి ఏర్పాటులోనూ, విస్తరణలోనూ కేశవరెడ్డి పాత్ర మరవలేనిది. వాస్తవంగా సంస్థ ఈ పేరుతో ముందుకు రాకముందు 1999లో జరిపిన సాహిత్య తరగతులలోనే ఆయన ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు. ఓపిక తగ్గినా గుంటూరు, విజయవాడలలో కార్యక్రమాలకు కృషి చేసేవారు. సాహిత్యశాలలు, కార్యశాలలలో చాలాసార్లు అధ్యక్ష స్థానంలో ఉండి పెద్దరికంతో నడిపేవారు. సాహితీ స్రవంతి ఉపాధ్యక్ష బాధ్యతలతో సహా పలు విధాల సేవలందించారు. సాహిత్యరంగ విశాల స్వభావం, విమర్శనాత్మక దృక్పథం కూడా ఆయనలో తగుపాళ్లలో ఉండేవి. స్వతహాగా కొంత మొహమాటస్తులనిపించినా విధానాల విషయంలో దృఢమైన వ్యక్తిత్వం ఆయనది. ఇన్ని మంచి లక్షణాలున్నాయి గనకే ఎనిమిది పదులు వచ్చినా ఎత్తిన జెండా దింకుండా, రాసే కలం ఆపకుండా ముందుకే నడిచారు. అధ్యాపకుడుగా, అధ్యయన శీలిగా, అక్షరాన్వేషిగా, అనువాదకుడుగా ఆఖరి వరకూ సేవలందించిన కేశవరెడ్డి వంటి మేధావులు చాలా అరుదుగా ఉంటారు. ఆయన కన్నుమూసి నాలుగేళ్లు పూర్తయిన్నప్పటికీ అనువాద పరంగా సాహిత్యరంగానికి ఆయన చేసిన సృజనాత్మక కృషి ఎప్పటికీ సజీవంగా నిలిచే ఉంటుంది.

(నవంబర్ 26 : కేశవరెడ్డి వర్థంతి)

– తెలకపల్లి రవి

29న కొమ్మారెడ్డి కేశవరెడ్డి సాహితీ పురస్కార ఉత్సవం

ఏపి యుటిఎఫ్ సీనియర్ నాయకులు, ఐక్య ఉపాధ్యాయ పత్రిక మాజీ ప్రధాన సంపాదకులు, అనువాదకులు, సాహితీవేత్త కొమ్మారెడ్డి కేశవరెడ్డి సాహితీ పురస్కారోత్సవం ఈనెల 29వ తేదీన గుంటూరులో జరగనుంది. 2020 నవంబర్ 26న మరణించిన కేశవరెడ్డి సాహితీ రంగానికి చేసిన సేవలకు కొనసాగింపుగా వారి కుటుంబ సభ్యుల సహకారంతో యుటిఎఫ్, సాహితీ స్రవంతి రాష్ట్ర కమిటీలు ఏటా కొమ్మారెడ్డి కేశవరెడ్డి సాహితీ పురస్కారం ఇవ్వాలని నిర్ణయించాయి. 2021లో మొదలుపెట్టి రావెల సాంబశివరావు, డా.ఎస్.ఆర్.పరిమి, విశపు బాల సుబ్రహ్మణ్యంలకు పురస్కారాలు అందించటం జరిగింది. ఈ ఏడాది ప్రముఖ రచయిత్రి ఓల్గాకు ఈ పురస్కారం అందజేయాలని నిర్ణయించాం. కథ, నవల, కవిత్వం, అనువాదం, విమర్శ, సంపాదకత్వం, నాటికలు, సినిమాలు, టీవీ సీరియల్స్ లాంటి అన్ని ప్రక్రియల్లో ఓల్గా తన సృజనాత్మక సాహిత్యాన్ని వెలువరించారు. అభ్యుదయ, స్త్రీ వాద, వామపక్ష ఉద్యమాల్లో కలిసి పనిచేశారు. 29వ తేదీ సాయంత్రం 5 గంటలకు గుంటూరులోని జాషువా విజ్ఞాన కేంద్రంలో పురస్కార ప్రదానోత్సవం జరుగుతుంది. యుటియఫ్ రాష్ట్ర నాయకులు ఉప్పుటూరి రాజశేఖరరావు అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో సాహిత్య విమర్శకులు డా.పాపినేని శివశంకర్, పిడిఎఫ్ ఫ్లోర్ లీడర్, ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు, పురస్కార గ్రహీత ఓల్గా పాల్గొంటారు. యుటిఎఫ్ నాయకులు ఎన్.వెంకటేశ్వర్లు, కె.ఎస్.ఎస్.ప్రసాద్; రిటైర్డ్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ డి.ఆంజనేయరెడ్డి, సాహితీ స్రవంతి రాష్ట్ర ఉపాధ్యక్షులు సత్యాజీ, ప్రజాశక్తి బుక్‌హౌస్ జనరల్ మేనేజర్ కె. లక్ష్మయ్య హాజరవుతారు.

– పురస్కార ప్రదాన కమిటీ

ఇదా, తెలుగుదనం?

ఇత్తడి చెంబు, అరిటాకు
ఆవకాయ, అరిసె, పెద బాలశిక్ష
వంకాయ, దప్పళం, పట్టె మంచం
ఇదే మన సంస్కృతి
అంటున్నాడొక దర్భల కవి!

మా ఇంట్లో ఇత్తడి చెంబుకు బదులు
మూతొంకర్లు తిరిగిన సత్తు సెంబు
మా సొట్టల బతుకుల్ని హేళన చేసేది
మీ సేతుల్లోని పెద బాలశిక్ష
మాకెంత పెద్ద శిక్ష వేసిందో తెల్సా?
'చదువెందుకు మీకు పోయి పేడెత్తుకోక' అని
మహా చిరాగ్గా ముఖం పెట్టి

బడి గేట్లోంచి గొడ్ల సావిట్లోకి తన్నింది!
అందంగా కనపడింది కదాని
అరిటాకులో తిందామని
ఏ పొలం గట్టు చెట్టు మీద చేయి పడగానే
మందపాటి అరచేయి
మా వీపున భయపెట్టే తట్టయింది!

నోరు సప్పిడికొట్టి నాలుక బతిమాలుతుంటే
ఆడ రైతులు ఏ మందారాకులోనో ఏసిచ్చిన
జాడీలోని అడుగు బూజు ఆవకాయ బద్ద
నోట్లోకెళ్లి తన్నుకొచ్చిన కక్కు
ఇప్పటికీ దేవుతుంది!
ఏ పండగ పూటైనా
నా చేతుల్తో పిండి కొట్టి పాకం పట్టి
చలివిడి ముద్ద అప్పం చేసి నూనెలో దేవి
అరిసెలు లెక్కపెట్టుకునే దాకా చూస్తానా
ఆవిడ పెట్టెలో దాచుకుని
'పొద్దుగూకు పోయిందిక ఎల్లి రావే' అంటే
తీపోసన అంటిన బట్టలతో ఇంటికెళ్లి స్నానం
చేసి
నిద్రపోతున్న పిల్లల పక్కనే
నడుం వాల్చి కన్ను మూస్తే
అరిసె ఇరిసిపెట్టినట్టు,
పిల్లల నోటిని తీపి చేసినట్టు కల!

మా బతుక్కి వంకాయ దప్పలం
తిరగమోతలెక్కడ?
ఏ పచ్చిపులుసులోకి సతికిల పడిన
నిప్పుల్లో కాల్చిన ఉప్పు సావిడాయో
గంజేరి దాకనో కడుపులో దాచుకోదా!
మీ నట్టింట్లో కులికే నయగార వయ్యారం
వార్నీసు పట్టించిన
నాన్నైమైన టేకు చెక్క మంచం
మా ఇంట్లో ఎక్కడిది?

అసలు మాకంటూ ఓ ఇల్లుందా?
ఉన్నా అదెప్పుడన్నా ఇల్లయ్యిందా?
కుక్కిమంచం కవిత్వంలో గ్లామర్ అద్దుకుంది
గాని
దానికి మహాకవుల బిరుదెక్కడేడిసింది
మీ పట్టెమంచపు సొగసు గుబ్బలకు తప్ప!

మీ తల బిరుసుతనం కాకపోతే
తెలుగు సంప్రదాయం
సొగసైన బట్టల్లోనూ, బుట్టల్లోనే దాక్కొందా?
ఇలాంటి దిక్కుమాలిన కొలతలతో
తెలుగు కొందరికే ఎందుకు దక్కుతుందో
చెప్పగలవా, ఓ పట్టులంగా ఓణీ సంస్కృతీ ..!?

– నేలపూరి రత్నాజీ
79015 96763

స్త్రీ చైతన్య ప్రతీక గురజాడ 'కన్యక'

మౌఖిక సాహిత్యంగా తెలుగు ప్రజల్లో విస్తృత ప్రచారం పొందిన వైశ్య కుల దేవత కన్యకా పరమేశ్వరి కథ గురజాడ కన్యకకి మూలమని ప్రచారంలో ఉన్నా, రెండు కథలకీ సారూప్యం చాలా తక్కువ. వైశ్య కులానికి చెందిన బాలిక కన్యక పాత్రని ఆధారంగా చేసుకుని సామాజిక నీతిని ఆవిష్కరించడం గురజాడ చేసిన ప్రయత్నం; ఆ ప్రయత్నం బలీయమైనది కాబట్టే 'కన్యక'కి 112 సంవత్సరాల వయసు వచ్చినా స్త్రీ చైతన్య ప్రతీక అయిన ఒక కథా కావ్యంగా నిలుస్తోంది. కథలో కన్యక వయసు గురజాడ చెప్పకపోయినా కథాకాలం నాటి పరిస్థితుల దృష్ట్యా, ఆ రోజుల్లో యుక్త వయసు వచ్చిన ఆడపిల్లలు చెలికత్తెలతో కలిసి బయటకు వచ్చేవారు కాదు కాబట్టి, ఆమె బాలిక అని అనుకోవచ్చు.

కన్యక కథ స్థూలంగా పరికిస్తే – ఒక రోజు కన్యక చెలికత్తెలతో కలిసి గుడికి వెడుతో ఉంటుంది. అటుగా వస్తున్న ఆ పట్టణాన్ని ఏలే రాజు కన్యకని చూసి, ఆమె సౌందర్యానికి ముగ్ధుడై మోహించి తనతో వచ్చిన మంత్రులతో కలిసి ఆమెని చుట్టుముట్టి చెరపట్టే ప్రయత్నం చేస్తాడు. నిస్సహాయ స్థితి స్ఫురహకొచ్చి, సమయస్ఫూర్తితో 'కోవెలకి వెళ్ళి దేవకార్యం తీర్చి వస్తాను; వైశ్య కన్యను, నిన్ను తప్పించుకుని ఎక్కడకి పోతాను' అని అంటుంది కన్యక. ఆ తరవాత కన్యక తండ్రి రాజుతో మాట్లాడుతూ– తన కూతురు రాజు సొత్తే కదా అని పలికి రాజుని శాంతింపచేసే ప్రయత్నం చేస్తూ, కులధర్మం ప్రకారం అగ్ని సాక్షిగా కన్యకని పొంది తమ వాళ్ళని ఆదరించమని అభ్యర్థిస్తాడు. దానికి రాజు తాను చెప్పినదే ధర్మం అని, తాను తలచుకుంటే గాంధర్వ చేసుకోగలను కదా అని బదులిస్తాడు. ఈ రోజు, రేపు అని గడువు పెట్టకుండా పిల్లని ఇస్తే ఇయ్యి, లేకుంటే పో అని గదమాయిస్తాడు రాజు. 'ముందు దైవ కార్యం, తరవాత కదా రాచకార్యం, మా ఇంటి కులదైవం అయిన వీరభద్రుడి గుడికి ఇప్పుడే వెళ్ళి దైవకార్యం నిర్వహించి వస్తాను' అని అంటాడు కన్యక తండ్రి. "సరే, నేను కూడా వస్తాను, గుడిలోనే అగ్నిసాక్షిగా కన్యకను స్వీకరిస్తాను" అని రాజు కన్యక కుటుంబంతో సహా గుడికి వెడతాడు. అక్కడ కన్యక తన కుటుంబాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ ఎన్నో ఉపదేశాలు, ఉద్బోధలూ చేస్తుంది. ఆ తరవాత "నువ్వే కనక రాజువైతే నన్ను పట్టుకో" అంటూ సవాలు విసిరి మంటల్లోకి దూకి ఆత్మాహుతి చేసుకుంటుంది.

కేవలం కథ పరంగా చూస్తే పెద్దగా సంచలనం ఏమీ కనపడదు. సమాజంలో బలవంతుడైన ఒక దుష్టుడు చెరపడుతూంటే తలొగ్గలేక ఒక ఆడపిల్ల అగ్నికి ఆహుతి అవుతుంది. అది కథ సారం, ముగింపు. గురజాడ రాసిన కన్యక ఖండిక పైకి కనిపించే కథని మించిన సందేశాన్ని తెలుపుతుంది. రాజుకి, కన్యకకి మధ్య జరిగిన తొలి సంభాషణ తరవాత కథాగమనంలో కొంచె అస్పష్టత ఉంది. రాజుకి, కన్యకకి మధ్య జరిగిన సంభాషణకి సంబంధించిన వాక్యాల తరవాత వెంటనే అర్థాంతరంగా కన్యక తండ్రికి, రాజుకి మధ్య సంభాషణ మొదలవుతుంది. ఇది గురజాడ కథాగమనంలో ప్రదర్శించిన శైలిలో భాగమా లేక, ఆయన రాసిన కవిత మూలంలో మనకి లభ్యం కాని చరణాలు ఉన్నాయా అన్నది పరిశోధించాలి. చెలామణీలో ఉన్న ప్రతి ప్రకారం చూస్తే కథ వేర్వేరు రోజుల్లో జరిగిందని అనుకోవాలి. ఈ కవితలో రాజు పేరుగానీ, కన్యక తండ్రి పేరుగానీ ప్రస్తావించడు గురజాడ. కథ కన్యక ప్రధానంగానే నడుస్తుంది, ముగుస్తుంది. మెటిల్డా లాంటి కథలో కూడా అన్ని పాత్రలకీ పేరు పెట్టకుండా కథని రసవత్తరంగా నడిపిస్తాడు గురజాడ. అది గురజాడ కథకి, కథనానికి, కాలానికి ఉన్న బలం.

కన్యక – పూర్ణమ్మ : సారూప్యత

బాలికల జీవితం ఆధారంగా గురజాడ రాసిన పూర్ణమ్మ, కన్యక ఖండికల్లో పెక్కు సారూప్యతలు కనిపిస్తాయి. రెండు కవితల్లోనూ బలవంతపు వివాహం నచ్చని ఆత్మగౌరవం గల బాలికలు నిరసనతో తనువు చాలిస్తారు. ఇద్దరు నాయికలూ తమ కాలానికి అతీతమైన తెగువ, సమయస్ఫూర్తి, వివేకం, పరిణతి కలిగి ఉంటారు. యువతుల్లో ఈ గుణాలు ఉండాలన్న ఆకాంక్షవల్ల కావచ్చు కన్యక, పూర్ణమ్మ పాత్రలను సృష్టించాడు గురజాడ.

కథ జరిగిన ప్రాంతాలకి, కవితల్లోని వర్ణనలకి కూడా రెండు కథలలోనూ పోలిక కనిపిస్తుంది. ఇద్దరు నాయికలూ కొలిచే దేవత దుర్గగానూ, వారు దర్శించే కోవెల ప్రాంగణంలో ఉండే కొలను, అందులోని కలువలు రెండు కవితల్లోనూ పోలిక కలిగి ఉంటాయి. ఈ రెండు కవితల్లోనూ ప్రస్తావించిన దుర్గ, శక్తి, స్త్రీ శక్తికి ప్రతీకాత్మక రూపాలుగా గురజాడ సృష్టించాడని అనుకోవచ్చు. తాను సందర్శించిన ప్రాంతాల్లో తాను సందర్శించిన దేవాలయాలను ఈ కవితల్లో చిత్రించే ప్రయత్నం చేశాడా గురజాడ? పరిశోధకులు తేల్చవలసిన అంశం ఇది.

కథా పరంగా చూస్తే, పూర్ణమ్మ ఎవరికీ చెప్పకుండా

వెళ్ళిపోతుంది. వెనక్కి తిరిగి రాదు. పూర్ణమ్మ దుర్గను చేరిందని రాయడంద్వారా, ధ్వనిప్రాయంగా ఆమె ఆత్మాహుతి చేసుకుందని చదువరులు ఊహించేలా చెబుతాడు. బలవంతంగా పెళ్లి చేసుకోవాలన్న రాజు కోరికని తీర్చలేక అగ్నికి ఆహుతి అయిందని కథలో నేరుగా చెబుతాడు గురజాడ. రాజుని నేరుగా ఎదుర్కొనేటప్పుడు పారిపోయే అవకాశం లేదు కాబట్టి గుళ్ళో జరుగుతున్న తంతులో అగ్నికి ఆహుతి అవడమే శరణ్యం కన్యకకి. అంతేగాక, "నువ్వొక రాజువైతే, నన్నిపుడు పట్టుకో" అని సవాలు విసిరి అగ్నిలో దూకుతుంది కన్యక. ఎంత రాజయినా, కామంతో దహించుకుపోతున్నా, కన్య అగ్నిలో దూకుతోంటే ఆమెని కాపాడే ధైర్యం లేని అసమర్థుడిగా చిత్రించడానికి అవసరమైన సన్నివేశం కల్పించి కవిగానే కాకుండా, ఒక దర్శకుడిలా ఆలోచించాడు గురజాడ.

కన్యకలో భాష : గురజాడ సృష్టించిన సాహిత్యానికి ప్రాణం పోసిన మరో ముఖ్య అంశం సంభాషణలు. పాత్రల మధ్య జరిగే సంభాషణలు సహజమైన ఉపమానాలతో, సముచిత, సందర్భోచిత భాషతో, పొందికైన పదాల వాడుకతో, వయ్యారంగా ఒదిగే వాక్య నిర్మాణంతో తన రచనలని దృశ్యకావ్యాలుగా రాయగల ప్రతిభ గురజాడది. కన్యక కవితలో ఈ ప్రతిభ మరీ బలీయంగా కనిపిస్తుంది. ఉదాహరణకి, తరటు (తరటు బంగరు), తొగల (తొగల కాంతులు –), నాల (... నాల నడుమను నట్టి వీధిని), మట్టి (... మట్టి వచ్చిన దైవగతిు), దిట్టతనము (– దిట్టతనమును బూని), నెట్ట, (... కన్నియ నెట్ట నిట్టు పలికెన్) లాంటి అంతగా వాడుకలో లేని పదాలను కవితని రసవత్తరంగా నడిపే క్రమంలో వాడడం; 'పాలు పెరుగులు', 'పళ్ల పువ్వులు', 'రక్తగంధం', 'రక్తమాల్యం' వంటి పదబంధాల వాడకం, 'పళ్లెరం సాగించి' అనే సొగసైన మాండలిక ప్రయోగం, కవితకి వన్నె తెచ్చేలా వాడారు గురజాడ.

గురజాడ సందేశం : కన్యక పాత్ర ద్వారా గురజాడ విస్తృత సమాజానికి గురజాడ ఇచ్చిన సందేశం బలీయమైనది. "సమాజంలో ఉన్నత స్థాయికి ఎదగాలంటే డబ్బు, ఆస్తి ఉంటే చాలదు. చదువు, ధైర్యం, బుద్ధిబలం, అన్యాయాన్ని ఎదిరించడానికి, అవసరమైతే పోరాడడానికి భుజబలం, కలిగి ఉండాలి. అప్పుడే పాలకులకు ధీటుగా ఎదగగలరు" అన్న సామాజిక సత్యాన్ని 112 సంవత్సరాల క్రితం దుర్బల స్థితిలో ఉన్న ఒక బాలిక పాత్రద్వారా చెప్పిస్తాడు దార్శనికుడైన గురజాడ. మన బతుకు దెబ్బతినకుండా సాగాలంటే తలదించుకుని బతకాలనే మనస్తత్వం సమాజ శ్రేయస్సుకు, వ్యక్తి జీవిత గమనానికి అవరోధమని పరోక్షంగానైనా కన్యక పాత్ర ద్వారా బలంగా చెప్పాడు గురజాడ.

కన్యక ఖండిక నడచిన తీరు ఒక ఎత్తైతే, ప్రతీకాత్మకంగా రాసిన ఉపసంహారం మరో ఎత్తు. ప్రజలని నియమ, నిబద్ధతలతో ఏలవలసిన రాజు ప్రజాకంటకుడిగా మారితే ఏమవుతుందో కన్యక కవితకి ఉపసంహారం ద్వారా చెప్పాడు గురజాడ. "రాజు గర్వం మట్టిగలిసింది; రాజు పతనానికి ప్రతీకగా కోట, పేటలు కూలి రాజ్యం నక్కలపాలయింది. ఎక్కడైతే కన్యక మానం కాపాడుకోవడం కోసం మంట కలిసిందో అక్కడ ఎత్తైన భవనం ఆవిర్భవించింది" అని చెప్పడం ద్వారా పాలకులు, రాజ్యాలు శాశ్వతం కాదని, వారు చేసే పని వల్ల మాత్రమే వారికి చరిత్రలో స్థానం ఉంటుందని, ఏనాటి పాలకులకైనా వర్తించేలా బోధనాత్మక సందేశం ఇచ్చాడు గురజాడ. కవులు, రచయితలు సమాజంలో జరిగే అమానుషాలని, అకృత్యాలని తమ రచనల ద్వారా ఎత్తిచూపాలని ధ్వనిప్రాయంగా చెప్పాడు.

(నవంబరు 30 : గురజాడ వర్థంతి)

– డాక్టర్ కొవ్వలి గోపాలకృష్ణ

అదానీపై విచారణకు ఆదేశించండి

- సుప్రీంకోర్టులో పిటిషన్

న్యూఢిల్లీ : అదానీపై అమెరికా న్యాయస్థానంలో ప్రాసిక్యూటర్లు అవినీతి, లంచం అభియోగాలు మోపిన నేపథ్యంలో ఈ వ్యవహారంపై విచారణకు ఆదేశించాల్సిందిగా అభ్యర్థిస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. అదానీ, ఆయన సన్నిహితులు భారత ప్రభుత్వ అధికారులకు రూ.2,236 కోట్ల మేర ముడుపులు అందించారంటూ అమెరికా న్యాయస్థానంలో అభియోగాలు మోపినందున వాటిపై భారత దర్యాప్తు సంస్థలు కూడా విచారణ జరిపేలా ఆదేశాలు జారీ చేయాలని న్యాయవాది విశాల్ తివారీ సుప్రీంకోర్టును కోరారు. అదానీ గ్రూప్ అనేక అవకతవకలకు పాల్పడిందని ఆరోపణలు వచ్చాయని, దేశ ప్రయోజనాల దృష్ట్యా వాటిపై కూలంకషంగా దర్యాప్తు జరగాల్సిన అవసరం ఉన్నదని పిటిషనర్ అభ్యర్థించారు. విశాల్ తివారీ తన పిటిషన్‌లో సెబీ పనితీరును కూడా ప్రశ్నించారు. వాటాల ధరలను ఎక్కువగా చేసి చూపడం, సెక్యూరిటీల నిబంధనల ఉల్లంఘన, లావాదేవీలను బయటపెట్టకపోవడం వంటి ఆరోపణలకు సంబంధించి అదానీ గ్రూపుపై విచారణ జరపాల్సిందిగా గత సంవత్సరం మార్చిలో సెబీని సుప్రీంకోర్టు ఆదేశించిందని గుర్తు చేశారు. ఇప్పటి వరకూ ఆ వివరాలు బహిర్గతం చేయలేదని, ఈ జాప్యం కారణంగా మదుపుదారుల విశ్వాసం సన్నగిల్లిందని తెలిపారు. సెబీపై విశ్వాసాన్ని కలిగించేందుకు, దాని పారదర్శకతను నిరూపించేందుకు దర్యాప్తు వివరాలను ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉన్నదని అభిప్రాయపడ్డారు. లేకుంటే భారతీయ ఆర్థిక మార్కెట్లపై ఇన్వెస్టర్లు విశ్వాసం కోల్పోయే ప్రమాదం ఉన్నదని పిటిషనర్ హెచ్చరించారు.

రాజకీయాల్లో యువతకు ప్రోత్సాహం

- మన్ కీ బాత్‌లో ప్రధాని మోడీ

న్యూఢిల్లీ : యువతను ముఖ్యంగా రాజకీయేతర నేపథ్యం ఉన్న యువతను రాజకీయాల వైపు మళ్లించేందుకు 2025 జనవరిలో వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్‌ను నిర్వహించనున్నట్లు ప్రధానమంత్రి నరేంద్రమోడీ తెలిపారు. మన్ కీ బాత్ రేడియో కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆయన మాట్లాడారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా నిర్వహించే యువజనోత్సవాల్లో భాగంగా న్యూఢిల్లీలో జనవరి 11, 12 తేదీల్లో ఈ కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. దేశం నలుమూలల నుంచి రెండు వేల మంది యువత ఇందులో పాల్గొంటారని తెలిపారు. కనీసం లక్ష మంది యువతను రాజకీయాల్లో చేర్చేందుకు ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ నెల 24న ఎన్‌సిసి డే అని గుర్తు చేస్తూ యువతలో క్రమశిక్షణ, నాయకత్వం, సేవ స్ఫూర్తిని ఎన్‌సిసి నింపుతుందని చెప్పారు. సమాజం కోసం నిస్వార్థంగా పని చేస్తున్న కొంతమంది యువకులను మోడీ ఈ సందర్భంగా ప్రశంసించారు. డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లు పొందడంలో వృద్ధులకు లక్నోకు చెందిన వీరేంద్ర, మొబైల్ ద్వారా చెల్లింపులు చేయడంలో భోపాల్‌కు చెందిన మహేష్ సహాయ పడుతున్నారని చెప్పారు. ఇటీవల తన గయానా పర్యటన గురించి మోడీ వెల్లడించారు.

తప్పుగా చూపించిన జిపిఎస్

- నిర్మాణంలో ఉన్న వంతెన పైనుంచి కారుపడి ముగ్గురు మృతి

లక్నో : జిపిఎస్ నావిగేషన్ మ్యాప్ తప్పుగా చూపించడంతో నిర్మాణంలో ఉన్న వంతెన పైనుంచి కారు కింద పడింది. అందులో ప్రయాణించిన ముగ్గురు వ్యక్తులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఉత్తరప్రదేశ్‌లోని బరేలీ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. కొందరు వ్యక్తులు బరేలీ నుంచి బదౌన్ జిల్లాలోని డేటాగంజ్‌కు కారులో వెళ్తున్నారు. ఆదివారం ఉదయం పది గంటల సమయంలో ఖల్పూర్-దతాగంజ్ రహదారిపై ఆ కారు వేగంగా ప్రయాణించింది. నావిగేషన్ పొరపాటు వల్ల నిర్మాణంలో ఉన్న వంతెనపైకి ఆ కారు దూసుకెళ్లింది. వంతెన పైనుంచి కింద ఉన్న రామగంగా నదిలో అది పడింది. ఆ కారులో ఉన్న ముగ్గురు వ్యక్తులు మరణించారు. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను కారు నుంచి బయటకు తీశారు.

కుదిరిన రాజీ

- కాప్-29 సదస్సులో మాట నెగ్గించుకున్న సంపన్న దేశాలు
- 30 వేల కోట్ల డాలర్ల ప్యాకేజితో సరి
- భారత్ అభ్యంతరం

బాకు : కాప్ ఐక్యరాజ్యసమితి ఫ్రేమ్‌వర్క్ కన్వెన్షన్‌కి సంబంధించిన పార్టీల కాన్ఫరెన్స్ 29వ సెషన్‌లో సంపన్న దేశాలు తమ మాట నెగ్గించుకున్నాయి. వాతావరణంలోకి పెద్దయెత్తున కర్బన ఉద్గారాలను విడుదలజేసే సంపన్న దేశాలు క్లైమేట్ ఫైనాన్స్ కింద ఏటా లక్షా 30 వేల కోట్ల డాలర్లు చెల్లించాలని పేద, వర్ధమాన దేశాలు పట్టుబట్టగా సంపన్న దేశాలు 25 వేల కోట్ల డాలర్లతో సరిపెట్టాలని చూశాయి. దీనిని ఎట్టి పరిస్థితుల్లోను తాము అంగీకరించేది లేదని బడుగు దేశాలు స్పష్టం చేయడంతో కాప్-29 చర్చలు ప్రతిష్టంభనలో పడ్డాయి. దీనిని తొలగించడం కోసం సంపన్న దేశాలు కంటి తుడుపు చర్యగా 30 వేల కోట్లకు పెంచుతూ సరికొత్త ప్రతిపాదనను ఆఖరి నిమిషంలో తీసుకొచ్చాయి. ఇంతకు మించి ఒక్క డాలర్ కూడా అదనంగా ఇచ్చేది లేదని తెగేసి చెప్పాయి. అప్పటికే కాలాతీతం కావడంతో అనేక తర్జన భర్జనల అనంతరం ఆదివారం తెల్లవారుజామున 30 వేల కోట్ల డాలర్లు ప్యాకేజీకి బడుగు దేశాలు అయిష్టంగానే ఆమోదం తెలిపాయి.

ఈ ఒప్పందాల్లో వాతావరణ ఫైనాన్సింగ్ కోసం న్యూ కలెక్టివ్ క్వాంటిఫైడ్ గోల్ (ఎన్‌సిక్యూజి) , పారిస్ ఒప్పందంలోని ఆర్టికల్ 6 ప్రకారం గ్లోబల్ కార్బన్ మార్కెట్ మెకానిజానికి సంబంధించిన అంశాలు ఉన్నాయి. ఈ వాతావరణ ఆర్థిక లక్ష్యాలు 2025 తర్వాత అమలులోకి వచ్చేలా ఒప్పందం నిర్దేశించింది. అభివృద్ధి చెందిన దేశాల నుండి ఏటా 30 వేల కోట్ల డాలర్ల నిధులు వర్ధమాన దేశాల వాతావరణ చర్యలకు మద్దతుగా చెల్లిస్తాయని, 2035 నాటికి ఈ వార్షిక లక్ష్యం కనీసం లక్షా 30 వేల కోట్ల డాలర్లకు చేరుకోవాలన్నది స్థూలంగా వాతావరణ ఫైనాన్సింగ్ లక్ష్యమని అందులో పేర్కొన్నాయి. తదుపరి దశలో .అభివృద్ధి చెందుతున్న దేశాలు వాతావరణ చర్యలు చేపట్టడానికి, వచ్చే ఏడాది దేశాల వారీగా జాతీయంగా కోటాలు నిర్ణయించేందుకు ఈ ఒప్పందం ప్రాతిపదికగా ఉంటుందని భావిస్తున్నారు.

పారిస్ ఒప్పందంలోని ఆర్టికల్ 6 ప్రకారం అంతర్జాతీయ కార్బన్ మార్కెట్ మెకానిజంపై ఏళ్ల తరబడి కొనసాగుతున్న ప్రతిష్ఠంభనను దాదాపు 200 పార్టీలు బహుపాక్షిక చర్చల ద్వారా బ్రేక్ చేసి దీనిపై ఏకాభిప్రాయానికి వచ్చాయి. దీంతో పారిస్ ఒప్పందానికి సంబంధించి అపరిష్కృతంగా మిగిలి ఉన్న చివరి అంశం పరిష్కారమైంది. అంతేకాదు, కార్బన్ ట్రేడింగ్ మెకానిజం, గ్లోబల్ స్టాక్‌టేక్ అమలు, ఉపశమన చర్యలు, గ్లోబల్ అడాప్టేషన్ గోల్‌తో సహా వివిధ అంశాలపైనా సదస్సు కొన్ని నిర్ణయాలు చేసింది.

వర్ధమాన దేశాల అవసరాలను తీర్చడంలో సంపన్న దేశాల ఆర్థిక హామీలు ఇప్పటికీ ఆశించిన దానికన్నా చాలా తక్కువగా ఉన్నాయని ఎన్‌సిక్యూజి పత్రం వెల్లడించిందని, వారి ఆర్థిక బాధ్యతలను మరింత స్పష్టంగా వివరించాలని చైనా ప్రతినిధి బృందం నేత జావో యింగ్‌మిన్ పేర్కొన్నారు.ప్రపంచ భౌగోళిక రాజకీయ ముఖ చిత్రం ఎలా మారుతుందన్న దానితో సంబంధం లేకుండా, చైనా, బాధ్యతాయుతమైన ప్రధాన అభివృద్ధి చెందుతున్న దేశంగా, వాతావరణ మార్పుపై బహుపాక్షిక ప్రక్రియ, అంతర్జాతీయ సహకారాన్ని స్థిరంగా ప్రోత్సహిస్తుందని జావో పునరుద్ఘాటించారు.

డీల్‌పై అభ్యంతరం వ్యక్తం చేసిన భారత్

కాప్ -29 ఫైనాన్స్ ఒప్పందాన్ని సదస్సు ఆమోదించిన తరువాత భారత్ దీనిపై అభ్యంతరం వ్యక్తం చేసింది. దీనిని 'ఆప్టికల్ ఇల్యూషన్'గా పేర్కొంది క్లైమేట్ ఫైనాన్స్ ఫండ్ కింద ఏటా లక్షా 30 వేల కోట్ల డాలర్లు చెల్లించాలని వర్ధమాన దేశాలు గొంతు చించుకుంటుంటే 30 వేల డాలర్లతో సంపన్న దేశాలు సరిపెట్టాయని, దీనిని తాము వ్యతిరేకిస్తున్నామని కాప్-29 సదస్సులో పాల్గొన్న భారత ప్రతినిధి బృందం నాయకుడు చాందిని రైనా సదస్సు ముంగింపు ప్లీనరీలో మాట్లాడుతూ చెప్పారు. భారత్ వైఖరిని నైజీరియా సమర్థిస్తూ, ఈ ఫైడాన్స్ డీల్ ఓ జోక్ అని వ్యాఖ్యానించింది.

"ఈ పత్రం ఆప్టికల్ భ్రమ తప్ప మరేమీ కాదని చెప్పడానికి నేను చింతిస్తున్నాను. ఇది మా అభిప్రాయం ప్రకారం, మనమందరం ఎదుర్కొంటున్న సవాలు యొక్క అపారతను పరిష్కరించదు. అందువల్ల, ఈ పత్రాన్ని ఆమోదించడాన్ని మేము వ్యతిరేకిస్తున్నాము, "అని భారత ప్రతినిధి ప్రతినిధి చాందినీ రైనా శిఖరాగ్ర సమావేశం ముగింపు ప్లీనరీ సమావేశంలో అన్నారు.

విద్వేష, 'చొరబాటు' రాజకీయాలకు శృంగభంగం

- జార్ఖండ్ ఎస్‌టి రిజర్వుడు స్థానాల్లో బిజెపి కూటమికి ఘోర పరాభవం

న్యూఢిల్లీ : విద్వేషాలను రెచ్చగొట్టి ప్రజల మధ్య విభజన తీసుకొచ్చి రాజకీయంగా లబ్ధిపొందేందుకు బిజెపి నేతృత్వంలోని కూటమి చేసిన ప్రయత్నాలను జార్ఖండ్ ప్రజలు తిప్పికొట్టారు. 'చొరబాటుదారులు' అంటూ ముస్లిములపై అసత్య ప్రచారంతో జార్ఖండ్ స్థానిక ప్రజలను రెచ్చగొట్టాలని, తద్వారా ఓట్లు రాబట్టుకోవాలని చేసిన ప్రయత్నాలన్నీ బెడిసికొట్టాయి. నిజమైన సమస్యలు ప్రస్తావించకుండా ప్రజల మధ్య విభజనే లక్ష్యంగా బిజెపి చేసిన ప్రచారాన్ని ఓటర్లు తిరస్కరించారు. బంగ్లాదేశ్ నుంచి వస్తున్న చొరబాటుదారులతో రాష్ట్రానికి పెనుముప్పు ఉందంటూ ఎన్నికల సభల్లో బిజెపి అగ్రనేతలు చేసిన ప్రచారాన్ని పట్టించుకోలేదు. చొరబాటుదారులతో జార్ఖండ్ గుర్తింపే ముప్పులో పడిందని, జనాభా మార్పులకు గురవుతుందని బిజెపి ప్రచారం చేసింది. గిరిజన మహిళలపై అత్యాచారాలకు పాల్పడుతున్నారని, బలవంతంగా భూములు గుంజుకుంటున్నారని బిజెపి ఆరోపించింది. 'ఆదివాసీల రోటీ, భేటీ, మాటీలను రక్షించండి', 'ఐక్యంగా ఉంటేనే సురక్షితంగా ఉంటాం' వంటి నినాదాలతో సోషల్ మీడియాతో పాటు సంఫ్ పరివార్ అనుబంధ వనవాసి కళ్యాణ్ ఆశ్రమాల ద్వారా బిజెపి ఈ ప్రచారానికి పాల్పడింది.

ప్రముఖుల ఓటమి

బిజెపి ఎన్నో ఆశలు పెట్టుకున్న ఎస్‌టి రిజర్వుడ్ సీట్లలో విద్వేష ప్రచారం ఎలాంటి ప్రభావం చూపలేదు. రాష్ట్రంలో మొత్తం 28 ఎస్‌టి రిజర్వుడు సీట్లు ఉండగా, ఇందులో 27 స్థానాల్లో బిజెపి ఓడిపోవడమే ఇందుకు నిదర్శనం. బిజెపి నుంచి మాజీ సిఎం చంపాయ్ సొరేన్ మాత్రమే సెరైకెల్లా స్థానంలో గెలుపొందారు. సంతాల్ పరగణ, కోల్హాన్, దక్షిణ చోటానాగ్‌పూర్, పాలం ప్రాంతాల్లో ఈ 28 స్థానాలు ఉన్నాయి. ఈ స్థానాల్లో 25 స్థానాల నుంచి బిజెపి స్వయంగా పోటీ చేసింది. మిగిలిన మూడు భాగస్వామ్య పార్టీలకు ఇచ్చింది. ఈ ఎస్‌టి స్థానాల్లో ఇండియా వేదిక 52 శాతానికి పైగా ఓట్లను సాధించింది. ఎస్‌టి రిజర్వ్ స్థానాల్లోనే కాక జనరల్ సీట్లలో కూడా బిజెపి ప్రచారానికి పెద్దగా స్పందనలేదు. 2009 నుంచి బిజెపి విజయం సాధిస్తున్న రాజమహల్‌లో ఈసారి జెఎంఎం అభ్యర్థి మహ్మద్ తాజుద్దీన్ భారీ మెజార్టీ (43 వేల ఓట్లు)తో విజయం సాధించడమే ఇందుకు ఉదాహరణ. సంతాల్ పరగణాలో 'బంగ్లాదేశ్ నుంచి చొరబాట్లు' అంటూ రెచ్చగొట్టినా... బిజెపి అభ్యర్థులు చిత్తుచిత్తుగా ఓడిపోయారు. జమ్తారా స్థానం నుంచి మాజీ సిఎం శిబూ సొరేన్ కోడలు ముర్ము సొరేన్, జంషెడ్‌పూర్ ఈస్ట్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి చంపాయ్ సొరేన్ కుమారుడు బాబు లాల్ సొరేన్, పోత్క స్థానం నుంచి మాజీ సిఎం, ప్రస్తుత కేంద్ర మంత్రి అర్జున్ ముండా భార్య మీరా ముండా వంటి ప్రముఖులను బిజెపి రంగంలోకి దింపినా ప్రజలు తిరస్కరించారు. బిజెపి చేస్తున్న అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని, ఆ పార్టీ ఇకనైనా ఇలాంటి కుట్రలను మానుకోవాలని రాజకీయ విశ్లేషకులు హితవు చెబుతున్నారు.

లేటరల్ ఎంట్రీ ఉద్యోగాల భర్తీపై పార్లమెంటరీ కమిటీ

- ప్రతిపక్షాల వ్యతిరేకతతో చర్యలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

లేటరల్ ఎంట్రీతో ఉద్యోగాల భర్తీ సమస్యను పరిశీలించడానికి పార్లమెంటరీ కమిటీని ఏర్పాటు చేయనున్నారు. ప్రభుత్వ శాఖల్లోని కీలక పోస్టుల భర్తీకి సంబంధించి ఈ ఏడాది ప్రారంభంలో రాజకీయ దుమారం రేగిన అంశాన్ని పార్లమెంటరీ కమిటీ పరిశీలించనుంది. లోక్‌సభ సెక్రటేరియట్ వెల్లడించిన వివరాల ప్రకారం 2024-25లో పర్సనల్, పబ్లిక్ గ్రీవెన్స్, లా అండ్ జస్టిస్‌పై డిపార్ట్‌మెంట్ సంబంధిత పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఎంపిక చేసిన సబ్జెక్టులలో సివిల్ సర్వీసెస్‌లో లేటరల్ ఎంట్రీ ఒకటి ఉంది. ఈ ఏడాది ఆగస్టులో యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యుపిపిఎస్) కాంట్రాక్ట్ ప్రాతిపదికన లేటరల్ ఎంట్రీ మోడ్ ద్వారా భర్తీ చేయడానికి 45 పోస్టులను (10 జాయింట్ సెక్రటరీలు, 35 డైరెక్టర్లు, డిప్యూటీ సెక్రటరీల) ప్రకటన చేసింది. ఈ ప్రకటన ప్రతిపక్షాలతోపాటు లోక్ జనశక్తి పార్టీ (జెఎల్‌పి), జెడియు వంటి ఎన్‌డిఎ మిత్రపక్షాల నుండి వ్యతిరేకత వ్యక్తమైంది. సిపిఎంతో పాటు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఎస్‌పి అధినేత అఖిలేష్ యాదవ్, ఆర్‌జెడి తేజశ్వీ యాదవ్‌లతో సహా పలువురు నాయకులు షెడ్యూల్డ్ కులాలు (ఎస్‌సి), షెడ్యూల్డ్ తెగలు (ఎస్‌టి), ఒబిసి రిజర్వేషన్లకు కేంద్రం తూట్లు పొడుస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ప్రభుత్వం తన ప్రకటనను రద్దు చేయాలని యుపిపిఎస్‌సిని కోరింది.

28న హేమంత్ సోరెన్ ప్రమాణ స్వీకారం

- కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు గవర్నర్ ఆహ్వానం

లెజిస్లేటివ్ పార్టీ నేతగా హేమంత్ సోరెన్ ఎన్నిక

రాంచీ : జార్ఖండ్ నూతన ముఖ్యమంత్రిగా హేమంత్ సోరెన్ ఈ నెల 28న ప్రమాణ స్వీకారం చేయనున్నారు. తాజా ఎన్నికల్లో జెఎంఎం నేతృత్వంలోని ఇండియా వేదిక ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. గవర్నర్ సంతోష్ గంగ్వార్‌ను ఆదివారం కలిసిన హేమంత్ సోరెన్ తన రాజీనామా సమర్పించారు. మళ్లీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు అవకాశం ఇవ్వాలని కోరారు. రాజీనామాను ఆమోదించిన గవర్నర్ కొత్త ప్రభుత్వం ఏర్పాటు చేసేవరకూ తాత్కాలిక ముఖ్యమంత్రిగా కొనసాగాలని కోరారు. హేమంత్ సోరెన్ వెంట జార్ఖండ్ కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ గులాం అహ్మద్ మీర్, ఆర్‌జెడి నాయకులు జయ ప్రకాశ్ నారాయణ యాదవ్ ఉన్నారు. గవర్నర్‌తో భేటీ తరువాత మీడియాతో హేమంత్ సోరెన్ మాట్లాడుతూ కొత్త ప్రభుత్వం ఏర్పాటు చేయాలని గవర్నర్ తమను ఆహ్వానించినట్లు చెప్పారు. ఈ నెల 28న కొత్త ప్రభుత్వం ప్రమాణస్వీకారం చేయనుందని తెలిపారు. ఆయనతోపాటు 12 మంది వరకూ మంత్రులుగా ప్రమాణస్వీకారం చేయనున్నారని సమాచారం.

రాజ్‌భవన్‌కు వెళ్లేముందు హేమంత్ సోరెన్ తన అధికారిక నివాసంలో జెఎంఎం ఎమ్మెల్యేలతోపాటు ఇండియా వేదిక ఎమ్మెల్యేలతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో జెఎంఎం లెజిస్లేటివ్ పార్టీ నాయకుడిగానూ, ఇండియా వేదిక సిఎం అభ్యర్థిగాను హేమంత్ సోరెన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశం తరువాత రాజ్‌భవన్‌కు ఇండియా వేదిక నాయకులతో కలిసి హేమంత్ సోరెన్ వెళ్లారు. తనకు మద్దతుగా ఉన్న ఎమ్మెల్యేల జాబితాను గవర్నర్‌కు అందజేశారు. రాష్ట్రంలో మొత్తం 81 అసెంబ్లీ స్థానాలకు గాను ఇండియా వేదిక 56 స్థానాల్లో విజయం సాధించింది. ఎన్‌డిఎ 24 స్థానాలకే పరిమితమైంది. జెఎల్‌కెం ఒక స్థానంలో గెలుపొందింది.

సిపిఎం ఢిల్లీ రాష్ట్ర కార్యదర్శిగా అనురాగ్ సక్సేనా

- ఎనిమిదిమందితో రాష్ట్ర కార్యదర్శివర్గం
- 30 మందితో రాష్ట్ర కమిటీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

సిపిఎం ఢిల్లీ రాష్ట్ర కార్యదర్శిగా అనురాగ్ సక్సేనా ఎన్నికయ్యారు. మూడు రోజుల పాటు న్యూఢిల్లీలోని హరికిషన్ సింగ్ సూర్జిత్ భవన్‌లో జరిగిన సిపిఎం ఢిల్లీ 17వ రాష్ట్ర మహాసభ ఆదివారం ముగిసింది. ఎనిమిది మంది సభ్యులతో కూడిన కార్యదర్శివర్గం, 30 మంది సభ్యులతో కూడిన రాష్ట్ర కమిటీని మహాసభ ఎన్నుకుంది. రాష్ట్ర కార్యదర్శిగా ప్రస్తుత సిఐటియు రాష్ట్ర కార్యదర్శి అనురాగ్ సక్సేనాను ఏకగ్రీవంగా ఎన్నుకుంది. కార్యదర్శి వర్గంలో కెఎం తివారీ, పిఎంఎస్ గ్రావాల్, ఆశా శర్మ, సుబీర్ బెనర్జీ, రాజీవ్ కున్వర్, సెబా ఫరూకీ, పివి అనియన్ ఉన్నారు. కార్యదర్శి వర్గానికి ఆహ్వానితుడిగా సిద్దేశ్వర్ శుక్లాను ఎన్నుకున్నారు. రాష్ట్ర కమిటీలో జెఎన్‌యు విద్యార్థి సంఘం మాజీ అధ్యక్షురాలు, ఎస్‌ఎఫ్‌ఐ ఢిల్లీ రాష్ట్ర కార్యదర్శి ఐషి ఘోష్ కూడా ఉన్నారు. అఖిల భారత మహాసభకు నలుగురు ప్రతినిధులు ఎన్నికయ్యారు. రాష్ట్ర కార్యదర్శిగా ఉన్న కెఎం తివారీ రిలీవ్ అయ్యారు. సిపిఎం సమన్వయకర్త ప్రకాష్ కరత్, సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బృందాకరత్ మహాసభకు హాజరై ప్రసంగించారు. మతోన్మాద, కార్పొరేట్ శక్తులకు వ్యతిరేకంగా పోరాడాలని, వర్గ పోరాటాలను తీవ్రతరం చేయాలని మహాసభ నిర్ణయించింది.

పంత్‌పై కనకాభిషేకం

- ఐపిఎల్ వేలం చరిత్రలోనే రూ 27 కోట్లతో రికార్డు ధర
- శ్రేయస్‌కు రూ.26.75 కోట్లు, అయ్యర్‌కు రూ.23.75 కోట్లు

జెడ్డా : ఐపిఎల్ 2008 ఆటగాళ్ల వేలంలో ఎం.ఎస్ ధోని రికార్డు ధరతో చరిత్ర సృష్టించిన సన్నివేశం 2024 ఆటగాళ్ల మెగా వేలంలో పునరావృతం అయ్యింది. యువ ఆటగాడు రిషబ్ పంత్ ఐపిఎల్ వేలం చరిత్రలోనే అత్యధిక ధర సొంతం చేసుకున్నాడు. రూ.27 కోట్ల భారీ ధరతో లక్నో సూపర్‌జెయింట్స్ పంత్‌ను దక్కించుకుంది. శ్రేయస్ అయ్యర్‌కు సైతం పంజాబ్ కింగ్స్ రూ.26.75 కోట్లకు గత సీజన్ టైటిల్ నెగ్గిన కెప్టెన్‌ను సొంతం చేసుకుంది. యువ ఆల్‌రౌండర్ వెంకటేశ్ అయ్యర్ రూ.23.75 కోట్లు దక్కించుకున్నాడు. విదేశీ ఆటగాళ్లలో జోశ్ బట్లర్ రూ.15.75 కోట్లు (గుజరాత్ టైటాన్స్), మిచెల్ స్టార్క్ 11.75 కోట్లు (ఢిల్లీ క్యాపిటల్స్), కగిసో రబాడ రూ.10.75 కోట్లు (గుజరాత్ టైటాన్స్) ఆకర్షణీయ ధర దక్కించుకున్నారు. సౌదీ అరేబియా రాజధాని జెడ్డా వేదికగా ఐపిఎల్ 2025 ఆటగాళ్ల మెగా వేలం ఆదివారం మొదలైంది. డెవిడ్ వార్నర్, జానీ బెయిర్‌స్టో, దేవదత్ పడిక్కల్, ఉమేశ్ యాదవ్‌లను ఎవరూ తీసుకోలేదు.

ఐపిఎల్ వేలంలో రిషబ్ పంత్ కోసం లక్నో సూపర్‌జెయింట్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ పోటీపడ్డాయి. ధర రూ.10 కోట్లు దాటిన తర్వాత సన్‌రైజర్స్ హైదరాబాద్ ఎంట్రీ ఇచ్చింది. ఢిల్లీ క్యాపిటల్స్ ఆర్‌టిఎం కార్డ్ ప్రయోగించింది. దీంతో రూ.27 కోట్ల ఫైనల్ బిడ్‌తో లక్నో సూపర్‌జెయింట్స్ స్టార్ ఆటగాడిని దక్కించుకుంది. పేసర్ అర్షదీప్ సింగ్‌ను పంజాబ్ కింగ్స్ తిరిగి తీసుకుంది. ఆర్‌టిఎంతో రూ.18 కోట్లకు కొనుగోలు చేసింది. జోశ్ బట్లర్, కగిసో రబాడలు గుజరాత్ టైటాన్స్ గూటికి చేరారు. మిచెల్ స్టార్క్‌ను ఢిల్లీ తీసుకుంది. ఆరుగురు దిగ్గజ ప్లేయర్ల మొదలైన వేలం.. రికార్డు ధరతో ప్రకంపనలు సృష్టించింది.

యువ ఆల్‌రౌండర్ వెంకటేశ్ అయ్యర్ కోసం ఫ్రాంచైజీలు పోటీపడ్డాయి.కోల్‌కత మొదటి నుంచి అయ్యర్ కోసం పోటీపడింది. లక్నో, బెంగళూర్ సైతం రేసులో నిలిచినా రూ.23.75 కోట్లతో అయ్యర్‌ను కోల్‌కత దక్కించుకుంది.. కెఎల్ రాహుల్ రూ.14 కోట్లకు ఢిల్లీ క్యాపిటల్స్‌కు వెళ్లాడు. హ్యారీ బ్రూక్ రూ.6..25 కోట్లు, జేక్ ఫ్రేసర్ మెక్‌గుర్క్ రూ.9 కోట్లకు, నటరాజన్ రూ.10.75 కోట్లకు క్యాపిటల్స్‌కు దక్కారు. ఆఫ్ స్పిన్నర్ అశ్విన్ మళ్లీ సూపర్‌కింగ్ అయ్యాడు. రూ.9.75 కోట్లకు చెన్నై అతడిని తీసుకుంది. డెవాన్ కాన్వే రూ.6.25 కోట్లు, రాహుల్ త్రిపాఠి రూ.3.40 కోట్లు, రచిన్ రవీంద్ర రూ.4 కోట్లు, అఫ్గాన్ స్పిన్నర్ నూర్ అహ్మద్ రూ.10 కోట్లకు సూపర్‌కింగ్స్‌కు శిబిరంలో చేరారు.

సన్‌రైజర్స్ సూపర్ : సన్‌రైజర్స్ హైదరాబాద్ వేలంలో మంచి వ్యూహం అమలు చేసింది. మహ్మద్ షమి రూ.10 కోట్లు, హర్షల్ పటేల్ రూ.8 కోట్లు, రాహుల్ చాహర్ రూ.3.20 కోట్లు, ఆడం జంపా రూ.2.40 కోట్లు, ఇషాన్ కిషన్ రూ.11.25 కోట్లతో కొనుగోలు చేసింది. హైదరాబాదీ పేసర్ మహ్మద్ సిరాజ్ రూ.12.25 కోట్లకు గుజరాత్ టైటాన్స్‌కు దక్కాడు. ప్రసిద్ కృష్ణ రూ.9.50 కోట్లకు టైటాన్స్‌తో చేరాడు. క్వింటన్ డికాక్ (రూ.3.60 కోట్లు), రెహ్మానుల్లా గుర్బాజ్ (రూ.2 కోట్లు), రఘువంశీ (రూ. 3 కోట్లు), నోకియా (రూ.6.50 కోట్లు)ను కోల్‌కత కొనుగోలు చేసింది. నమన్ ధీర్ (రూ.5.25 కోట్లు), రాబిన్ (రూ.0.65 కోట్లు), ట్రెంట్ బౌల్ట్ (రూ.12.50 కోట్లు)ను ముంబయి ఇండియన్స్ తీసుకుంది.

ఝాన్సీ ఆసుపత్రి దుర్ఘటనలో గాయపడిన మరో ఇద్దరు శిశువుల మృతి

17కు చేరిన మరణాలు

లక్నో : ఉత్తరప్రదేశ్‌లో ఝాన్సీ పట్టణంలోని ఆసుపత్రిలో జరిగిన అగ్ని ప్రమాదం నుంచి రక్షించిన నవజాత శిశువుల్లో మరో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. దీంతో ఈ ప్రమాదంలో మరణించిన పసికందుల సంఖ్య 17కు చేరుకుంది. ఈ విషయాన్ని ఆసుపత్రికి చెందిన సీనియర్ అధికారి ఒకరు ఆదివారం తెలిపారు. ఈ నెల 15 రాత్రిన మహారాణి లక్ష్మీబాయ్ మెడికల్ కాలేజీ ఆసుపత్రి చిన్నపిల్లల వార్డులో అగ్నిప్రమాదం సంభవించిన సంగతి తెలిసిందే. అదే రోజున 10 మంది నవజాత శిశులు మరణించగా, 39 మందిని రక్షించి వేరే వార్డుకు తరలించారు. వీరిలో ఇద్దరు శనివారం మరణించారని ఆసుపత్రి ప్రిన్సిపాల్ డాక్టర్ నరేంద్ర సింగ్ సెనగార్ ఆదివారం తెలిపారు.

పోలవరంపై పార్లమెంట్ చర్చిస్తాం

- అదానీ వ్యవహారంలో ఏపి ప్రస్తావన దురదృష్టకరం
- వక్ఫ్ బిల్లుపై చర్చ పూర్తి కాలేదు
- టిడిపి నేత లావు శ్రీకృష్ణదేవరాయలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

అదానీ వ్యవహారంలో ఆంధ్రప్రదేశ్ ప్రస్తావన రావడం దురదృష్టకరమని టిడిపి ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ఓ బ్రాండ్ ఇమేజ్ ఉందని, రాష్ట్ర ప్రతిష్ట దెబ్బతినేలా ఇలాంటి సంఘటనలకు కారకులైన వారిని సమర్థించే విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. అఖిల పక్ష సమావేశ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర విభజన అంశాల్లో కొన్ని పూర్తయ్యాయని, ఇంకా కొన్ని పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. పదేళ్లుగా నెమ్మదిగా పోలవరం నిర్మాణం జరుగుతున్న తీరుతెన్నులపై, కడప స్టీల్ ఫ్యాక్టరీ జాప్యానికి కారణాలపై చర్చ జరగాలని కోరానని చెప్పారు. విభజన హామీల్లో కొన్ని సంస్థలకు శాశ్వత కట్టడాలు వచ్చాయని, కౌలు రైతుల ప్రయోజనాలను పరిరక్షించాల్సిన అవసరం ఉందని తెలిపారు. విజయవాడలో వరద భీభత్సం నేపథ్యంలో, దేశంలో పలు నగరాలు, పట్టణాలను ముంచెత్తుతున్న వరదలు, ప్రకృతి వైపరీత్యాలపై చర్చ జరగాలని కోరానని అన్నారు. నదుల అనుసంధానంపైనా చర్చ జరగాలన్నారు. గోదావరి-పెన్నా నదుల అనుసంధానంతో ఏపిలో 10 లక్షల ఎకరాలు సాగులోకి వచ్చే అవకాశం ఉందన్నారు. ఆచార్య రంగా శతజయంతి ఉత్సవాల నేపథ్యంలో కౌలు రైతుల ఈతిబాధల పరిష్కారం కోసం చర్యలు చేపట్టాలని అన్నారు. వలస కార్మికుల కష్టాలు, సమస్యలను కూడా సమగ్రంగా చర్చించాలని చెప్పారు. సోషల్ మీడియా విశృంకలత్వంపై చర్చతో పాటు, కట్టడి చేసేందుకు నిర్దిష్టమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. "వక్ఫ్" పై చర్చ పూర్తి కాలేదని, ఇంకా సంప్రదింపులు జరుగుతున్నాయని చెప్పారు. ముస్లింల అభీష్టం మేరకు, బిల్లు రూపకల్పన జరగాలని తెలిపారు.

విభజన సమస్యలపై చర్చించాం : బాలశౌరి

ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన పలు అంశాలను ప్రస్తావించామని లోక్‌సభ నేత బాలశౌరి తెలిపారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ విభజన సమస్యలను వేగంగా పరిష్కరించాలని కోరానన్నారు. విభజన హామీల మేరకు, ఆయిల్ రిఫైనరీ, కడప స్టీల్ ప్లాంట్. ఓడ రేవు కూడా ఏపికి ఇవ్వాలని కోరానని చెప్పారు. పోలవరం మొత్తం ఖర్చును కేంద్ర ప్రభుత్వమే భరించాలని అన్నారు. పునరావాసం కల్పించి రెండేళ్లలోనే నిర్మాణం పూర్తవ్వాలని చెప్పారు. పోలవరం ఎత్తును తగ్గించకుండా ప్రజల కోరుకుంటున్న రీతిలో ప్రాజెక్ట్ నిర్మాణం జరగాలని అన్నారు. కౌలు రైతులకు మేలు కలిగేలా, నష్ట పరిహారం వారికే వెళ్లేలా చర్యలు తీసుకోవాలని కోరానన్నారు. అదానీ వ్యవహారంపై పార్లమెంట్‌లో చర్చకు వచ్చినప్పుడు తమ అభిప్రాయాన్ని ప్రస్తావిస్తామని బాలశౌరి తెలిపారు.

వైజాగ్ స్టీల్‌ప్లాంట్

ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తాం : విజయసాయి రెడ్డి, మిథున్ రెడ్డి

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తామని వైసిపి నేతలు విజయసాయి రెడ్డి, మిథున్ రెడ్డి తెలిపారు. వారు మీడియాతో మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు ఎత్తుపై రాష్ట్ర మంత్రులు భిన్న ప్రకటనలు చేస్తున్నారని అన్నారు. పోలవరం అంశంపై పార్లమెంట్‌లో చర్చించాలని కోరారు. విభజన చట్టంలోని హామీలను ఇంకా పూర్తిగా నెరవేర్చలేదన్నారు. డ్రగ్స్ నిర్మూలనకు కఠిన చట్టాలు తీసుకురావాలని కోరారు. సోషల్ మీడియా కార్యకర్తలపై "నాన్ బెయిలబుల్" కేసులు పెడుతున్నారని, పోలీస్ స్టేషన్ల చుట్టూ తిప్పుతూ, తీవ్రంగా వేధిస్తున్నారని విమర్శించారు. అధికార పార్టీకి ఒక చట్టం, ప్రతిపక్ష పార్టీకి మరోచట్టం అన్న తరహాలో రాష్ట్రప్రభుత్వం వ్యవహరిస్తోందని అన్నారు. సోషల్ మీడియా కార్యకర్తల అంశాన్ని పార్లమెంటులో ప్రస్తావిస్తామని, చర్చకు పట్టుబడతామని అన్నారు. అదానితో ఎలాంటి "సోలార్ పవర్" ఒప్పందం జరగలేదని, కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ "సెకి" తో మాత్రమే ఒప్పందాలు జరిగాయని పేర్కొన్నారు. "సెకి" తో అనేక రాష్ట్రాలు ఒప్పందాలు కుదుర్చుకున్నాయని, తమపై వచ్చేవన్నీ నిరాధార ఆరోపణలేనని తెలిపారు. "వక్ఫ్" బిల్లు విషయంలో మైనార్టీల పక్షాన నిలబడతామని పేర్కొన్నారు.

కౌన్ బనేగా మహా సీఎం

- ఫడ్నవీస్, షిండే, అజిత్ పవార్‌ల మధ్య కుర్చీలాట

ముంబయి : మహారాష్ట్రలో తదుపరి సీఎం ఎవరన్నదానిపై సర్వత్రా చర్చ జరుగుతోంది. అటు బీజేపీ దేవేంద్రఫడ్నవీస్ కాబోయే సీఎం అంటూ లీకులిస్తోంది. మరోవైపు ప్రస్తుత సీఎం ఏక్‌నాథ్ శిండే పోటీపడుతున్నారు. ఎన్సీపీ చీలికవర్గం నేత అజిత్ పవార్ కూడా తగ్గేదేలేదంటున్నారు. దీంతో ముఖ్యమంత్రి చైర్ రేసులో.. ఈ ముగ్గురి మధ్య ముక్కోణపు పోటీ కనిపిస్తోంది. స్వల్పవ్యవధిలోనే మహాయుతి ప్రభుత్వ ప్రమాణ స్వీకారోత్సవం జరగవచ్చని, తొలుత ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి మాత్రమే ప్రమాణ స్వీకారం చేస్తారని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. మహాయుతిలో ఆ ముగ్గురు నేతలు, ఆయా పార్టీల ఎమ్మెల్యేలతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. ముఖ్యమంత్రి రేసులో దేవేంద్ర ఫడ్నవీస్ ముందంజలో ఉన్నారని కమలం పార్టీ లీకులు వదులుతోంది. మూడోసారి ఈ పదవిని ఆయనే చేపడతారని రాజకీయ వర్గాల్లో ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఫడ్నవీస్ సీఎం కావాలని బీజేపీ నేతలు డిమాండ్ చేస్తున్నారు.

ప్రస్తుత సిఎం, శివసేన నేత ఏక్‌నాథ్ షిండే తమ ఎమ్మెల్యేలతో సమావేశమయ్యారు.తనకు మరో ఛాన్స్ ఇవ్వాలని కోరుతున్నారు. అజిత్ పవార్ నేతృ ృత్వంలోని ఎన్‌సిపి కూడా సమావేశం అయింది. ఈ సమావేశంలో పార్టీ నాయకుడిగా అజిత్ పవార్‌ను ఎన్నుకున్నారు. సిఎం పదవిపై ఎన్సీపీ కూడా రేసులో ఉన్నట్టు ఛగన్ భుజ్‌బల్ చెప్పారు. అజిత్ పవార్ కూడా ముఖ్యమంత్రి కావచ్చు అని మీడియాతో అన్నారు.ఎవరు సిఎం అవుతారనేది హైకమాండ్ మీద ఆధారపడి ఉన్నదని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

పేట్రేగిపోతున్న ఇజ్రాయిల్

- గాజాలో 120 మంది ఊచకోత
- లెబనాన్‌లో మరో 15 మంది మృతి

గాజా : అమెరికా అండ చూసుకుని ఇజ్రాయిల్ అంతకంతకూ పేట్రేగిపోతోంది.మరీ ముఖ్యంగా అమెరికా అధ్యక్షుడిగా పచ్చి మితవాది డొనాల్డ్ ట్రంప్ మళ్లీ ఎన్నికైన తరువాత నెతన్యాహు యుద్ధోన్మాదం పతాక స్థాయికి చేరుకుంది. అంతర్జాతీయ నేర న్యాయస్థానం (ఐసిసి) నెతన్యాహును యుద్ధ నేరస్తుడిగా పరిగణించి ,అయన అరెస్టుకు వారెంట్ కూడా జారీ చేసింది. అయినా, డోన్ట్ కేర్ అన్న రీతిలో ఈ ఫాసిస్టు నేత వ్యవహరిస్తున్నాడు.గడచిన 48గంటల్లో ఇజ్రాయిల్ జరిపిన క్రూర దాడుల్లో గాజాలో 120 మంది, బీరుట్‌లో 15 మంది మరణించారు. గాజా స్ట్రిప్ అంతటా ఇజ్రాయెల్ తన సైనిక దాడులను తీవ్రతరం చేసింది. గాజా ఉత్తర కోస్తా తీరాన ఉన్న ఆసుపత్రిపై బాంబుల వర్షం కురిపించింది. ఈ పాశవిక దాడిలో వైద్య సిబ్బంది కూడా గాయపడ్డారు. ఇదిలా వుండగా శనివారం లెబనాన్ రాజధాని బీరుట్‌పై ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడుల్లో 15 మంది చనిపోయారు.

పాక్‌లో రెండు తెగల మధ్య ఘర్షణలు

- 64 మంది మృతి

పెషావర్ : వాయువ్య పాకిస్తాన్‌లోని ఖైబర్ పఖ్తూంఖ్వా ప్రావిన్స్‌లో రెండు తెగల మధ్య చెలరేగిన హింసలో గడచిన మూడు రోజుల్లో మొత్తం 64 మంది మరణించారు . ఇంకా అనేక మంది గాయపడ్డారు. చాలా కాలంగా నానుతున్న భూ వివాదంపై అలీజాయ్, బగన్ తెగల మధ్య ఇంతకు ముందు కూడా ఘర్షణలు జరిగాయి. ఇరు పక్షాలకు చెందిన సాయుధ గ్రూపులు పరస్పరం కాల్పులకు దిగాయి. ప్రజల ఆస్తులను ధ్వంసం చేశాయి. వ్యాపార సంస్థలను లూటీ చేశాయి. చెక్‌పోస్టులు, ఇళ్లు, దుకాణాలకు నిప్పు పెట్టాయి. వందలాది కుటుంబాలు ఇళ్లు వీడి సురక్షిత ప్రాంతాలకు తరలి పోయాయి. శాంతి భద్రతల పరిస్థితి పూర్తిగా అదుపు తప్పిందని, అంతా అల్లకల్లోలంగా ఉందని పేరు తెలపడానికి ఇష్ట పడని ఓ ఉన్నతాధికారి తెలిపారు.

పరాచినార్ సమీపంలో ప్రయాణీకుల వ్యాన్‌ల కాన్వాయ్‌పై గురువారం జరిగిన దాడిలో 47 మంది మరణించారు. ఆ వెంటనే ఆఫ్ఘనిస్తాన్ సరిహద్దులోని కుర్రమ్‌లో అలీజాయ్, బగన్ తెగల మధ్య ఘర్షణలు తలెత్తాయి. భారీ, ఆటోమేటిక్ ఆయుధాలతో గిరిజనులు ఒకరినొకరు టార్గెట్ చేసుకుంటున్నారని పోలీసులు తెలిపారు. అధికార యంత్రాంగం, పోలీసు ఉన్నతాధికారులు హెలికాప్టర్‌లో ఆ ప్రాంతానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. జిల్లాలోని అన్ని విద్యాసంస్థలను మూసివేశారు. ఆ ప్రాంతం నుండి షేర్ చేయబడిన వీడియోలలో కొన్ని మృతదేహాలు కాలిపోయి, చూడడానికి భయంకరంగా ఉన్నాయి. ఆరుగురు మహిళలను బందీలుగా తీసుకెళ్లినట్లు పోలీసులు తెలిపారు, బలిష్‌ఖేల్, ఖార్ కాలీ, కుంజ్ అలీజాయ్ , మక్బుల్‌లలో ఘర్షణలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయని పోలీసులు తెలిపారు. .సాధారణ పౌరులకు సురక్షితమైన ప్రయాణం కల్పించాలని గత ఒకటిన్నర నెలలుగా గిరిజన నాయకులు ప్రభుత్వాన్ని కోరుతూ ఆందోళనలు చేస్తున్నారు. సెప్టెంబరులో, కుర్రం జిల్లాలో ఒక భూభాగంపై షియా, సున్నీ తెగల మధ్య ఎనిమిది రోజులుగా జరిగిన ఘర్షణల్లో 50 మందికి పైగా మరణించిన సంగతి తెలిసిందే.

మీకోసం

చిటికెడు సోడా వేసి గోధుమ పిండి కలిపితే పూరీలు మెత్తగా వస్తాయి.

జీవన సౌరభం

బానిసత్వానికి అలవాటుపడితే బలాన్ని ఎప్పుడూ గుర్తించలేం.

తాత ప్రేమ

తాత.. తన చిట్టి
మనవరాలకి ధనం ఇవ్వలేకపోవచ్చు
కానీ మనసు నిండుగా మెండైన
దీవెనలు ఇవ్వడంలో
మహారాజు అతను

కబుర్లు ఎన్నో చెబుతాడు
ఆకాశం... చందమామ
సూర్య చంద్రులు ... చుక్కలు
చెట్లు చేమలు.. పక్షులు జంతువులు
ఇలాంటివి ఎన్నో..
ఎన్నెన్నో విషయాలను పరిచయం చేస్తాడు

చిట్టి తల్లిని పున్నమి వెన్నెల
కురిపించే చంద్రుడిలా
మెరిసిపోవాలని కాంక్షిస్తూ
వెన్నెల్లో కూర్చోబెడతాడు

ఉదయపు సూర్యుడిలా
నీ చుట్టూ ఉన్నవారికి వెలుగు
నివ్వాలి తల్లి అంటూ
నీలోని బద్ధకాన్ని తన మంచి
మాటలతో దూరం చేస్తాడు

వర్షం వస్తే ఒక పాట
ఎండ కాస్తే మరో పాట
చలి వేస్తే మరో పాట
ఇలా ప్రతి చిన్న ఆనందాన్ని
చిట్టి పొందాలని ఆరాట పడతాడు

కష్టమొస్తే కృంగిపోకూడదంటూ
ఆకులు రాలిన చెట్టుని చూపించి
మరలా ఎలా చిగురిస్తుందో చూడు అంటాడు
ఆనందమొస్తే పొంగిపోకూడదు అంటూ
కడలి కెరటాలను చూపిస్తాడు

వెలకట్టలేము తాతయ్య కన్నులు
వర్షించే అనురాగపు జల్లులు
సాటి రాదు మరేది
తన స్వచ్ఛమైన ప్రేమకు

అందుకే పదిలంగా దాచుకుంటుంది
చిట్టి.. తన గుండె లోతుల్లో..
ప్రతి నిమిషాన్ని..
తన ప్రియమైన తాతయ్య జ్ఞాపకంగా...

– పేలూరి వెంకట మీనాక్షి,
నరసాపురం,
99126 01765.

నేను గీసిన బొమ్మ

ఉప్పాడ జైదేవ్,
2వ తరగతి,
హరిగోపాల స్కూల్,
రైల్వే న్యూ కాలనీ,
విశాఖపట్నం.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

కలివిడిగా .. సందడిగా వనభోజనాలు

చుట్టూ పరిసరాలు, వాతావరణం చాలా ఆహ్లాదకరంగా ఉండే కాలం ఇది. ఎక్కడ చూసినా పచ్చదనం పలకరిస్తూ ఉంటుంది. ఏరులూ, సెలయేర్లూ గలగలమని పారుతూ ఉంటాయి. ఈ తరుణంలో సమూహాలుగా, సందడి సందడిగా వనాలకు తరలివెళ్లి, అక్కడ ఉమ్మడి భోజనాలతో ఆనందంగా గడపటం ఎంతో ఆనందాన్ని కలిగిస్తోంది. మనుషుల మధ్య మరింత స్నేహసంబంధాలూ, ఆప్యాయతానుబంధాలూ వర్ధిల్లటానికి వనభోజనాలు దోహదపడతాయి. బిజీ బిజీ జీవితాల ఉరుకులు పరుగులకు భిన్నంగా ఆటపాటలతో, ఆనంద సందోహాలతో గడపటానికి పిక్నిక్కులు కేరాఫ్ అడ్రసులుగా అలరారుతున్నాయి.

ఏటేటా స్నేహపూరిత వాతావరణాన్ని చేరువచేసే మహత్తర ఘట్టమే వనభోజనం. ఇక్కడ అప్యాయమైన పలకరింపులు...కలగొలుపు కేరింతలు... ఆనందాల హరివిల్లులు సర్వసాధారణం. ఒకరిపై ఒకరికి మమకారాన్ని పంచే అద్వితీయమైన ఆ క్షణాలను వెలకట్టగలమా? వనభోజన సమయం ఆసన్నమైన ఈ వేళ ఒక్కసారి మనకూ ఆ క్షణాలను ఆస్వాదించేద్దాం రండి.

విహారం, వినోదం, ఆనందం, ఆహారం, ఆరోగ్యం, సామరస్యం, సమైక్యత, పరస్పర సహకార భావనలకు కేంద్రం వనభోజనం. ఇవన్నీ ఒకచోట సమకూరే ఏకైక వేడుక వనభోజన కేంద్రంలోనే. కార్తీక మాసం అంటే పిక్నిక్‌ల సీజన్. ఈ కాలంలో చాలామంది వనభోజనాలు చేసేందుకు ఆసక్తి చూపిస్తుంటారు.

ప్రకృతితో మన బాంధవ్యాన్ని పెంపొందించేదే వనభోజనం. సెలవురోజుల్లో ఈ పిక్నిక్‌ల హడావుడి మరింతగా ఎక్కువగా ఉంటోంది. ఉదయం ఇంటి నుంచి బయలు దేరే దగ్గర నుంచి ఇంటికి క్షేమంగా తిరిగి వచ్చే వరకూ అందరూ సమన్వయంతో పనిచేయటం. పనుల్లో భాగస్వామ్యం కావటం, ఆత్మీయ పలకరింపులు, పరస్పర సహకారం ఆద్యంతం ఇక్కడ సాక్షాత్కరిస్తుంటుంది. అంతకుముందు ఒకే అపార్టుమెంటులోనో, ఒకే వీధి, ఒకే కాలనీల్లో, ఊర్లు, పట్టణాల్లో ఉండేవారు పిక్నిక్‌లో సరదాగా కలిసి హాయిగా మంచీ చెడు గురించి మాట్లాడుకుంటుంటారు. అప్పటివరకూ నెలలతరబడి మాట్లాడుకోవటానికి వీల్లేని వారు కూడా ఈ వన సమారాధనల్లో చక్కగా ముచ్చడించుకోవటంతో సంతోషపడుతుంటారు.

మరికొందరు స్నేహితులు, బంధువులు ఇలా బృందాలుగా వెళ్లి వన భోజనాలు చేస్తున్నారు. ఇంకొందరు కులాలవారీగా కూడా జరుగుతున్నాయి. ఇలా కులాలవారీగా విభజించబడితే సమాజంలో అసమానతలు, అభద్రతాభావాలు వంటివి కొనసాగుతుంటాయి. అందుకే అందరూ కులమతాలకు అతీతంగా సమైక్యతా భావంతో పిక్నిక్‌లు జరుపుకోవటం సముచితం.

పిక్నిక్‌కు వెళ్లేటప్పుడు ఈ జాగ్రత్తలు పాటించండి...

పిక్నిక్‌కు వెళ్లినప్పుడు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. అత్యంత జాగ్రత్తగా ఉండగలిగితే ఆహ్లాదం కోసం చేసే వనవిహారయాత్రలు విషాదాంతం కాకుండా మంచి జ్ఞాపకంగా మిగులుతాయి.

సముద్రాల వద్ద : రాష్ట్రంలోని సుదీర్ఘమైన సముద్రతీరంలో ఎక్కడ చూసినా కార్తీక మాసం పిక్‌నిక్ స్పాట్‌లే కనిపిస్తుంటాయి. బీచ్‌లలో సందర్శకులు గల్లంతవుతున్న ఉదంతాలు చూస్తూనే ఉంటున్నాం. సముద్ర స్నానాలు చేసేటప్పుడు అత్యుత్సాహంగా లోతుకు వెళ్లకూడదు. పోలీసుల హెచ్చరికలు పాటించాలి.

జలపాతాలు : జలపాతాల వద్ద నాచుపట్టి జారిపోయే ప్రమాదం ఉంది. ప్రమాదకరంగా ఉండే ప్రాంతాలకు వెళ్లకూడదు. ఆహ్లాదాన్ని ఆస్వాదించాలే కాని అత్యుత్సాహానికి దిగి ప్రమాదాల బారినపడకూడదు.

నదులు : నదులు, చెరువులు, కాలువల్లో స్నానాలకు దిగకూడదు. స్నానఘట్టాలు ఉన్నచోట్ల కూడా మెట్లు దెబ్బతిని ముందుకు పడిపోయే ప్రమాదం ఉంటుంది. హెచ్చరిక బోర్డులను గమనించి నీటిలో దిగటం ఉత్తమం. ప్రతిచోటా ఉన్న హెచ్చరిక బోర్డుల సందేశాన్ని కచ్చితంగా పాటించాలి. సరదా పేరిట సాహసాలకు దిగరాదు.

ఆకతాయితనం వద్దు : వన సమారాధనకు చెట్లు, పుట్టలు ఎక్కువగా ఉన్న చోట్లకు వెళ్లేందుకు ప్రాధాన్యత ఇస్తారు. చెట్లు ఉన్న ప్రాంతాల్లో ఎక్కువగా తేనెపట్టులు ఉంటాయి. వాటిపై పిల్లలు, ఆకతాయితనం ఉన్న వారు రాళ్లు వేస్తే తేనెటీగలు దాడిచేస్తుంటాయి. విషసర్పాల ప్రమాదం కూడా పొంచివుంటుంది. వాటికి ఆవాసంగా ఉన్న పొదలు, పుట్టలు ఉన్న చోట్లకు దూరంగా ఉండటం మంచిది.

ఇంకా...

వన భోజన సమయంలో పిల్లలను జాగ్రత్తగా కనిపెట్టుకొని ఉండాలి. వారు దూరంగా వెళ్లకుండా చూసుకోవాలి

వెళ్లే వాహనాలు కండిషన్‌లో ఉన్నాయో లేదో ముందు చూసుకోవాలి

సరిపడా మంచినీరు, ఆహార పదార్థాలను తీసుకెళ్లాలి. పిల్లలకు, వృద్ధులకు ఆహారం ఆలస్యం కాకుండా అందించాలి.

వెళ్లిన ప్రదేశానికే పరిమితమైతేనే మంచిది

ఏ తిండి పదార్థాలు, ఇతరత్రా తగినన్ని లేకపోతే అప్పటికప్పుడు అమర్చుకోగలిగేలా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ముందే చేసుకోవాలి.

అన్ని వయసుల వారికి ఆటపాటలు ఏర్పాటు చేయాలి. ఎవరిలో ఏ టాలెంటు ఉందో అప్పుడే బయటపడుతుంది.

విజేతలు అయినవారికే కాకుండా పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రోత్సాహక బహుమతులు ఇవ్వాలి. ముఖ్యంగా పిల్లల విషయంలో ఈ జాగ్రత్త తీసుకోవాలి. నిర్వాహకులు ప్రతి ఒక్కరినీ ప్రోత్సహిస్తూ మాట్లాడాలి.

– యడవల్లి శ్రీనివాసరావు

సందర్శకులకు పర్యాటక సేవలు

ఎపి టూరిజం శాఖ ద్వారా విజయవాడ డివిజన్ పరిధిలోని కృష్ణా, ఎన్‌టిఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలోని పర్యాటక ప్రాంతాల్లో కార్తీక మాసంలో పిక్నిక్‌లు జరుగుతున్నందున ప్రత్యేక ఏర్పాట్లు చేశాం. ఇటీవల వచ్చిన అకాల వరదలకు విజయవాడ కృష్ణానదిలోని భవానీఐలాండ్ ముంపునకు గురై కొంతమేరకు కోతకు గురైంది. ఇప్పటికే కొంతభాగాన్ని పునరుద్ధరించే కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. రాష్ట్రప్రభుత్వ సహకారంతో ఇంకా పెద్దఎత్తున అక్కడి పనులు చేయాల్సివుంది. ఆ దిశగా కృషిచేస్తున్నాం. కృష్ణానదిలోనూ, నాగార్జున సాగర్‌లోనూ బోట్ షికారు వంటివి కొనసాగుతున్నాయి. నాగార్జున సాగర్ నుంచి శ్రీశైలం వరకూ బోటు షికారు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. నాగాయలంక, పులిగడ్డ ప్రాంతాల్లో రిసార్ట్స్ వంటివి ఏర్పాటుచేయటానికి ప్రతిపాదనలు ఉన్నాయి. గన్నవరం మండలం తోటపల్లి పరిధిలోని శ్రీబ్రహ్మయ్యలింగం చెరువులో రిజర్వాయర్ ఏర్పాటుకు కృషి జరుగుతోంది. రాజధాని విజయవాడ నుంచి అమరావతి, ఇక్కడి నుంచి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు టూరిజం బస్సులు ఏర్పాటుకు కృషి జరుగుతోంది. సూర్యలంక, మచిలీపట్నం బీచ్‌లలో యాత్రికులు మరింతగా పెరిగేందుకు వీలుగా ప్రాజెక్టులు చేపడతాం. రాష్ట్ర సినిమాటోగ్రఫీ, పర్యాటకశాఖామంత్రి కందుల దుర్గేష్, రాష్ట్ర పర్యాటక శాఖ మేనేజింగ్ డైరెక్టర్ ఆమ్రపాలి, పర్యాటక శాఖ స్పెషల్ సిఎస్ వినయ్‌చంద్, చైర్మన్ నూకసాల బాలాజీయాదవ్‌ల ఆదేశాలతో పర్యాటక కేంద్రాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నాం.

– పి.కృష్ణచైతన్య,
ఎపి టూరిజం కార్పొరేషన్
విజయవాడ డివిజనల్
మేనేజర్

'మనదేశం' సినిమాకు 75 ఏళ్లు

తెలుగు సినిమాకు ఆయనో మకుటం లేని చక్రవర్తి. తరాలు మారినా మరిచిపోలేని మహానటుడు. నవరసాలు అలవోకగా పండించగల దిట్ట. అందుకే ఆయన విశ్వవిఖ్యాత నటసార్వభౌముడయ్యారు. తెలుగువారి ఖ్యాతిని విశ్వమంతా చాటిన నందమూరి తారక రామారావు నటించిన 'మనదేశం' సినిమాకు ఇది వజ్రోత్సవ సందర్భం. వెండితెరపై చెరగని ముద్ర వేసిన ఎన్టీఆర్ మొత్తం 302 సినిమాల్లో నటించారు. వీటిలో 275 సినిమాలు బాక్సాఫీస్ వద్ద సంచలన విజయాన్ని సాధించాయి. నటుడిగా, నిర్మాతగా, రచయితగా తెలుగు సినీ పరిశ్రమకు ఆయన అందించిన జ్ఞాపకాలు కోకొల్లలు.

కృష్ణాజిల్లా పామర్రు మండలంలోని నిమ్మకూరు గ్రామంలో నందమూరి లక్ష్మయ్య, వెంకట రామయ్య దంపతులకు ఎన్టీ రామారావు 1923 మే 28న జన్మించారు. చిన్నప్పటి నుంచి నటనపై ఆసక్తి పెంచుకుని చదువుకునేరోజుల్లో నాటకాలను ఆడేవారు. ఆ తర్వాత సినిమా రంగ ప్రవేశం చేశారు.

'మనదేశం'లో పోలీస్ అధికారిగా

నిమ్మకూరు నుంచి మద్రాస్‌కు సినిమా అవకాశాల కోసం వెళ్లగా అక్కడ మొదట్లో రాలేదు. ఢీలాపడిన సమయంలోనే 'మనదేశం' చిత్రంలో పోలీసు అధికారిగా ఓ చిన్న పాత్ర లభించింది. అయిష్టంగానే ఆ పాత్ర చేశారు. రోల్ కొద్దిసేపే అయినప్పటికీ ఆయనకు మంచి గుర్తింపునే తీసుకొచ్చింది. శోభనాచల పిక్చర్స్ పతాకంపై ఈ చిత్రాన్ని కృష్ణవేణి నిర్మించారు. ఎల్వీ ప్రసాద్ దర్శకుడు. 1949 నవంబర్ 24న ఈ సినిమా విడుదలయ్యింది. విప్రదాస్ అనే బెంగాలీ నవల ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. స్వాతంత్ర్య పోరాటం నేపథ్యంలో తెరకెక్కిన ఈ చిత్రంలో నాగయ్య, నారాయణరావు, రేలంగి, వంగర, కృష్ణవేణి, కాంచన్, సురభి బాలసరస్వతి తదితరులు నటించారు.

డిగ్రీ లేకుండా నటించనన్నారు

సాధారణంగా సినిమాల కంటే ముందురోజుల్లో నాటకాలు ప్రేక్షకులకు వినోదాన్ని పంచేవి. అందులో రాణించటమే గొప్ప ఎచీవ్‌మెంట్‌గా భావించేవారు కళాకారులు. పాతతరం నటీనటులంతా నాటక రంగం నుంచి సినిమా రంగానికి వచ్చిన వారే. విశ్వవిఖ్యాత నట సార్వభౌముడిగా పేరు సంపాదించుకున్న నందమూరి తారక రామారావు కూడా నాటక రంగం నుంచి వచ్చిన వారే. ఎన్టీఆర్ చదువుకునే రోజుల్లో నాటకాల్లో తన ప్రతిభను ప్రదర్శించి అందరిచేత శభాష్ అనిపించుకున్నారు. మనదేశం సినిమా కంటే ముందే ఆయనకు సి.పుల్లయ్య దర్శకత్వంలో తెరకెక్కిన వింధ్యరాణి చిత్రంతోనే సినీరంగ ప్రవేశం చేయాల్సివుంది. బిఎ డిగ్రీ పూర్తికాని కారణంగా ఆయన ఆ అవకాశాన్ని ఉపయోగించుకోలేదు.

మీసాల నాగమ్మగా పిలిచేవారు

విజయవాడలోని ఎస్ఆర్ఆర్ అండ్ సివిఆర్ కళాశాలలో డిగ్రీ చదువుతుండగా కళాశాల వార్షికోత్సవం సందర్భంగా 'రాచమల్లుని దౌత్యం' నాటకం వేద్దామంటే స్త్రీ పాత్రకు ఎవ్వరూ దొరకలేదు. దీంతో అందరూ

ఎన్‌టిఆర్ పేరు చెప్పారు. ఆయనేమో అంగీకరించలేదు. స్నేహితులు, అప్పటి కళాశాల తెలుగు విభాగం అధిపతి విశ్వనాథ సత్యనారాయణ సూచనలతో ఒప్పుకున్నారు. మేకప్ మేన్ మీషం తీసేయాలని కోరగా దానికి ఎన్టీఆర్ ఒప్పుకోలేదు. చివరికి మీసాలతోనే స్త్రీ పాత్రలో నటించి బహుమతిని గెల్చుకున్నారు.

పాత్రలో పరకాయప్రవేశం

ఓ రోజు నిర్మాత ఎల్‌వి ప్రసాద్ వద్ద ఎన్టీఆర్ ఫొటోను బిఏ సుబ్బారావు చూశారు. స్క్రీన్‌టెస్ట్ కోసం ఉన్నఫళంగా రైలెక్కి మద్రాస్ రావాలని కబురుచేశారు. టెస్ట్ పూర్తయ్యాక మరో ఆలోచన లేకుండా తాను తీస్తున్న 'పల్లెటూరి పిల్ల' సినిమాలో అవకాశం కల్పించారు. సినిమా చిత్రీకరణ సందర్భంలో ఎన్టీఆర్ నటనను చూసినా ఎల్‌వి ప్రసాద్ తను తీస్తున్న సినిమా 'మనదేశం'లో అవకాశం ఇచ్చారు. 'మనదేశం'లో సత్యాగ్రహులపై లాఠీఛార్జి చేసే క్రూర పోలీసు అధికారిగా నెగెటివ్ షేడ్ పాత్రలో ఆయన నటించారు. అవకాశాలను పాజిటివ్‌గా మార్చుకోవటానికి నెగెటివ్ పాత్రలైనా ఫర్వాలేదనుకున్నారు. అలా సినీరంగ ప్రస్థానం ప్రారంభమైంది. తర్వాత కాలంలో వెండితెరపై అగ్రహీరోగా నిలిచారు. 'మనదేశం'లో 'ఇంతవాణ్ణి కావటానికి ఎంత కష్టపడి పైకి వచ్చానో తెలుసా? అనే డైలాగ్ చక్కగా సాగుతుంది. అయితే ఇక్కడ గమ్మత్తయిన మరో విషయం జరిగింది.

తొలిచిత్రం కావటం, అందులోనూ పోలీసు అధికారి పాత్ర. సన్నివేశం ప్రకారం లాఠీఛార్జ్ చేయాలి. లైటింగ్...కెమెరా..యాక్షన్ అని చెప్పగానే రామారావు పాత్రలో లీనమయ్యారు. జూనియర్ ఆర్టిస్టులను నిజంగానే చితకబాదేశారు. అప్పుడు దర్శకుడు పిలిచి కొట్టకూడదు... కొట్టినట్లు నటిస్తే చాలని చెబితే...'పోలీసులు అలానే బాదుతారు సార్' అని అమాయకంగా జవాబు ఇచ్చారట.. ఆ తర్వాత నటించిన 'పాతాళ భైరవి' సినిమా అత్యధిక వసూళ్లు సాధించి ఎన్టీఆర్‌ను తొలిసారి కమర్షియల్ స్టార్‌ను చేసింది.

ఎన్టీఆర్ తరువాతి కాలంలో ఎన్ని సినిమాల్లో నటించినా, ఎన్ని విజయాలు సాధించినా తొలిగా తెర మీద కనిపించిన 'మనదేశం' ఆయన సినీరంగ జీవితాన మేలిమి తొలి పేజీ. ఈ సినిమా విడుదలైన నవంబరు 24 ఒక ప్రత్యేకమైన రోజు. వచ్చేనెల 14వ తేదీన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆధ్వర్యాన ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవాన్ని విజయవాడలో ఘనంగా జరపనున్నారు.

కింగ్, ప్రిన్స్ శతకాల మోత

• యశస్వి 161, కోహ్లి 100 • పెర్త్ టెస్టులో గెలుపు ముంగిట భారత్

భారత్ రెండో ఇన్నింగ్స్ 487/6 డిక్లేర్డ్ • ఆసీస్ లక్ష్యం 534, ప్రస్తుతం 12/3

భారత్, ఆసీస్ తొలి టెస్టు మూడో రోజు

పెర్త్ : బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ తొలి టెస్టులో టీమ్ ఇండియా విజయం ముంగిట నిలిచింది. 534 పరుగుల రికార్డు ఛేదనలో ఆతిథ్య ఆస్ట్రేలియా 4.2 ఓవర్లలో 12/3తో పీకల్లోతు కష్టాల్లో కూరుకుంది. పేసర్లు జస్‌ప్రీత్ బుమ్రా (2/1), మహ్మద్ సిరాజ్ (1/7) ఆసీస్ బ్యాటర్లను వణికించారు. ఆసీస్ విజయానికి మరో 522 పరుగులు అవసరం కాగా.. భారత్ విజయానికి ఏడు వికెట్ల దూరంలో నిలిచింది. అంతకుముందు.. భారత క్రికెట్ కింగ్, ప్రిన్స్ శతక మోత మోగించారు. యశస్వి జైస్వాల్ (161, 297 బంతుల్లో 15 ఫోర్లు, 3 సిక్స్‌లు), విరాట్ కోహ్లి (100 నాటౌట్, 143 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్స్‌లు) సెంచరీలతో కదం తొక్కారు. కెఎల్ రాహుల్ (77, 176 బంతుల్లో 5 ఫోర్లు) అర్థ సెంచరీతో మెరువగా.. నితీశ్ కుమార్ రెడ్డి (38 నాటౌట్, 27 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), వాషింగ్టన్ సుందర్ (29, 94 బంతుల్లో 1 సిక్స్), దేవదత్ పడిక్కల్ (25, 71 బంతుల్లో 2 ఫోర్లు) రాణించారు. 134.3 ఓవర్లలో 487/6 పరుగుల వద్ద భారత్ రెండో ఇన్నింగ్స్‌ను డిక్లరేషన్ ప్రకటించింది. నేడు నాల్గో రోజు ఆటలో టీమ్ ఇండియా గెలుపు లక్ష్యంగా బరిలోకి దిగుతోంది.

యశస్వి అదరగొట్టాడు :

ఓవర్‌నైట్ స్కోరు 172/0తో మూడో రోజు బ్యాటింగ్‌కు వచ్చిన భారత్.. ఓపెనర్ల మెరుపులతో పెర్త్ టెస్టుపై తిరుగులేని పట్టు సాధించింది. యశస్వి జైస్వాల్ కాస్త దూకుడు పెంచి ఆడగా.. రాహుల్ తనదైన శైలిలోనే పరుగులు పిండుకున్నాడు. 8 ఫోర్లు, 3 సిక్స్‌లతో 205 బంతుల్లో సెంచరీ సాధించాడు. సచిన్ టెండూల్కర్ తర్వాత ఆసీస్ గడ్డపై తొలి టెస్టులోనే శతకం సాధించిన అతి పిన్న వయస్కుడిగా యశస్వి నిలిచాడు. సెంచరీ అనంతరం జోరు పెంచిన జైస్వాల్.. మరో 70 బంతుల్లోనే 150 మార్క్ చేరుకున్నాడు. ద్వి శతకం ఊరిస్తుండగా సహనం కోల్పోయిన జైస్వాల్.. ఆసీస్ పార్ట్‌టైమ్ పేసర్ మార్ష్‌కు వికెట్ కోల్పోయాడు. రాహుల్ 77 పరుగుల వద్ద వికెట్ కోల్పోయాడు. దీంతో 201 పరుగుల తొలి వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. తొలి సెషన్లో ఒక్క వికెట్ మాత్రమే కోల్పోయిన భారత్.. రెండో సెషన్లో నాలుగు వికెట్లు చేజార్చుకుంది. పడిక్కల్ కాసేపు క్రీజులో నిలిచినా.. నిలకడగా ఆడలేదు. 275/1తో పటిష్టంగా కనిపించిన భారత్.. రిషబ్ పంత్ (1), ధ్రువ్ జురెల్ (1) సహా జైస్వాల్ వికెట్లతో 321/6కి పరిమితమైంది. చివరి నాలుగు వికెట్లను ఆసీస్ పడగొడుతుందనే అనిపించింది.

కింగ్ కోహ్లి కొట్టేశాడు :

కొంతకాలంగా అంచనాలను అందుకోలేకపోతున్న విరాట్ కోహ్లి.. అచ్చొచ్చిన ప్రత్యర్థి ఆసీస్‌పై శతకంతో చెలరేగాడు. లంచ్ తర్వాత బ్యాటింగ్‌కు వచ్చిన కోహ్లి మరో ఎండ్‌లో వికెట్లు పడుతున్నా సహనంగా ఆడాడు. వాసింగ్టన్ సుందర్ (29) జతగా కోహ్లి కీలక భాగస్వామ్యం నమోదు చేశాడు. వికెట్ల పతనం

అడ్డుకున్న ఈ జోడీ 176 బంతుల్లో 89 పరుగులు జోడించింది. లయాన్ ఓవర్లో భారీ షాట్‌కు వెళ్లిన సుందర్ వికెట్ కోల్పోయాడు. క్రీజులోకి కోహ్లికి జతకలిసిన తెలుగు తేజం నితీశ్ కుమర్ రెడ్డి (38 నాటౌట్) ధనాధన్ ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. వచ్చీ రాగానే సిక్సర్ బాదిన నితీశ్ కుమార్..ఇన్నింగ్స్‌కు ఊపు తెచ్చాడు. మూడు ఫోర్లు, రెండు సిక్సర్లు కొట్టిన నితీశ్ 27 బంతుల్లోనే 38 పరుగులు చేశాడు. లబుషేన్ ఓవర్లో స్వీప్ షాట్‌తో బౌండరీ బాదిన విరాట్ కోహ్లి 'వంద' అభివాదం చేశాడు. 8 ఫోర్లు, 2 సిక్సర్లు కొట్టిన విరాట్ కోహ్లి ఆసీస్ బౌలర్లను అలవోకగా ఎదుర్కొన్నాడు. అవుట్‌ఫీల్డ్ మరీ నెమ్మదిగా ఉండటంతో భారత్ విలువైన పరుగులను కోల్పోయింది. నితీశ్, కోహ్లి జోడీ 54 బంతుల్లోనే 77 పరుగులు జోడించారు. దీంతో భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 487/6 పరుగులు చేసింది. ఆధిక్యం 533 పరుగులు ఉండటంతో.. కోహ్లి సెంచరీ సాధించగానే బుమ్రా భారత ఇన్నింగ్స్‌ను డిక్లరేషన్ ప్రకటించాడు. ఆసీస్ బౌలర్లలో స్పిన్నర్ నాథన్ లయాన్ (2/96) రెండు వికెట్లు పడగొట్టగా.. స్టార్క్, కమిన్స్, హాజిల్‌వుడ్, మార్ష్‌లు తలా ఓ వికెట్ పడగొట్టారు. హాజిల్‌వుడ్ ఇన్నింగ్స్ ఆసాంతం మెరుపు బంతులు సంధించినా వికెట్ల వేటలో సఫలం కాలేదు.

బుమ్రా నిప్పులు :

మూడో రోజు ఆఖర్లో ఛేదనకు వచ్చిన ఆస్ట్రేలియాకు పేస్ దళపతి జస్‌ప్రీత్ బుమ్రా పీడకల మిగిల్చాడు. రెండో ఇన్నింగ్స్‌లో 4.2 ఓవర్లలోనే ఆసీస్ మూడు వికెట్లు చేజార్చుకుంది. ఇన్నింగ్స్ నాల్గో బంతికే యువ ఓపెనర్ నాథన్ మెక్‌స్వీనీ (0)ను డకౌట్ చేసిన బుమ్రా.. మార్నస్ లబుషేన్ (3)ను సైతం వికెట్ల ముందు అవుట్ చేశాడు. నైట్ వాచ్‌మెన్ పాట్ కమిన్స్ (2)ను సిరాజ్ స్లిప్స్‌లో క్యాచౌట్‌గా వెనక్కి పంపించాడు.

534 పరుగుల రికార్డు ఛేదనలో కంగారూలు 12 పరుగులకు మూడు వికెట్లు కోల్పోయింది. ఆసీస్‌కు మరో 522 పరుగులు అవసరం కాగా.. టీమ్ ఇండియా విజయానికి మరో 7 వికెట్ల దూరంలో నిలిచింది.

స్కోరు వివరాలు :

భారత్ తొలి ఇన్నింగ్స్ : 150/10

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ : 104/10

భారత్ రెండో ఇన్నింగ్స్ : జైస్వాల్ (సి) స్మిత్ (బి) మార్ష్ 161, రాహుల్ (సి) కేరీ (బి) స్టార్క్ 77, దేవదత్ పడిక్కల్ (సి) కేరీ (బి) హాజిల్‌వుడ్ 25, విరాట్ కోహ్లి నాటౌట్ 100, రిషబ్ పంత్ (స్టంప్డ్) కేరీ (బి) లయాన్ 1, ధ్రువ్ జురెల్ (ఎల్బీ) కమిన్స్ 1, వాషింగ్టన్ సుందర్ (బి) లయాన్ 29, నితీశ్ కుమార్ రెడ్డి నాటౌట్ 38, **ఎక్స్‌ట్రాలు :** 55, మొత్తం : (134.3 ఓవర్లలో 6 వికెట్లకు) 487 డిక్లేర్డ్.

వికెట్ల పతనం : 1-201, 2-275, 3-313, 4-320, 5-321, 6-410.

బౌలింగ్ : మిచెల్ స్టార్క్ 26-2-111-1, జోశ్ హాజిల్‌వుడ్ 21-9-28-1, పాట్ కమిన్స్ 25-5-86-1, మిచెల్ మార్ష్ 12-0-65-1, నాథన్ లయాన్ 39-5-96-2, లబుషేన్ 6.3-0-38-0, ట్రావిశ్ హెడ్ 5-0-26-0.

ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్ : మెక్‌స్వీనీ (ఎల్బీ) బుమ్రా 0, ఉస్మాన్ ఖవాజా నాటౌట్ 3, పాట్ కమిన్స్ (సి) కోహ్లి (బి) సిరాజ్ 2, మార్నస్ లబుషేన్ (ఎల్బీ) బుమ్రా 3, ఎక్స్‌ట్రాలు : 4, **మొత్తం :** (4.2 ఓవర్లలో 3 వికెట్లకు) 12.

వికెట్ల పతనం : 1-0, 2-9, 3-12.

బౌలింగ్ : జస్‌ప్రీత్ బుమ్రా 2.2-1-1-2, మహ్మద్ సిరాజ్ 2-0-7-1.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68